

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 21 జూన్ 2023 పేజీలు : 04


# సచివాలయ నిర్మాణ పనులపై కలెక్టర్ ఆగ్రహం

## - త్వరితగతిన సచివాలయ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ , సచివాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**కంబదూరు,జూన్ 20,ప్రభాతవార్త:** మండలంలో మంగళవారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఎం,గౌతమి పర్యటించారు. రాంపురం గ్రామంలో నూతనంగా నిర్మణం చేపడుతున్న గ్రామ సచివాలయ పనులు ఈ సందర్బంగా ఆమె పరిశీలించారు.సచివాలయ పనులను అర్ధాంతరంగా అపేసారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్మాణ పనులు అపేశారని తెలుసుకున్న కలెక్టర్ ఏందుకు అపేశారని అధికారులను అడిగారు.జిల్లాలో ఇప్పటికే చాలా సచివాలయ పనులు పూర్తి అవుతున్న,ఈ సచివాలయ భవణం నిర్మాణం మాత్రం ఏందుకు అపేశారని అధికారులు ప్రశ్నించారు.వీలైతే కాంట్రాక్టర్‌ను మార్చేయ మని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సంబంధిత కాంట్రక్టర్‌ను పిలచి త్వరగా సచివాలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమే సూచించారు.గ్రామంలోని రైతులు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్‌డిఓ నిశాంత్‌రెడ్డి,తహశీల్దార్ నయజ్ అహ్మద్,డీఈ రాజన్న,డి ఎల్ డి ఓ,శంకర్,ఎంపిడిఓ సుధాకర్ రాజు తదితర సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సిద్ధాంతాలు గాలికి.. భజన పరులకే అందలం

## - ఇదీ హిందూపురం బిజెపి దుస్థితి -పార్టీ బలోపేతానికి నేడు కేంద్ర మంత్రి పర్యటన

**హిందూపురం, జూన్ 21 ప్రభాతవార్త** ఒకప్పుడు రాయలసీమలోనే భారతీయ జనతా పార్టీకి ఎంతో పట్టు ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొ ందిన హిందూపురంలో ప్రస్తుతం నసిద్ధాంతాలు గాలికి.. భజన పరులకే అందలం అన్నట్లుగా ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా మారిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్గాలుగా నాయకులు విడిపోవడంతో గ్రూపు తగాదాలకు బిజెపి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హిందూపురంలో గతంలో జరిగిన ముని స్పల్, ఇతర ఎన్నికల్లో పోటీ చేసిన బిజెపి అభ్యర్థులు సత్తా చాటారు. నిస్వార్థంగా, నిబద్ధతతో పనిచేసిన నాయకులు ప్రజా సమస్యల కోసం పోరాడి బిజెపిని పటిష్టం చేశారు. ఏపి వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఖడ్గం ఉదంతంలో స్థానిక ఆ పార్టీ ముఖ్య నేతలు కేసుల్లో ఇరుక్కొని ఎన్నో బాధలు పడినప్పటికీ అందులో కొందరు ఇప్పటికీ పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేస్తున్నారు. నాడు బిజెపి అంటేనే సిద్ధాంతాలకు పెట్టింది పేరుగా ఉండేది. అయితే నేడు పరిస్థితి అందుకు భిన్నంగా తయారయింది. ముఖ్య నేతలకు వత్తాసు పలుకుతూ భజన చేసే వాళ్ళకే నియోజకవర్గంలో పెద్ద పీట వేయడం దురదృష్టకరమని క్యాడర్లో అసంతృప్తి నెలకొంది. పట్టుమని పదిమంది కార్యకర్తలను కూడా వెంట బెట్టుకొని రాలేని వారు పార్టీ ముఖ్య నాయకులుగా చలామణి కావడం జరుగుతోందని ఎద్దేవా చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీ సత్యసాయి బిజెపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న కేంద్ర మంత్రి దేవోసింహ చౌహాన్ బుధవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సంస్థాగత పరంగా పార్టీని బలోపేతం చేసేందుకు స్వయంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంతటి ముఖ్యమైన మిగతా 4 లో

# బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ తీర్పు రాష్ట్రానికి అన్యాయం

- ఉమ్మడి సీఎంలు ఈ అంశంపై స్పందించాలి
- పోలవరం ఆంధ్రకి జీవనాడి
- మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

**అనంతపురం సిటీ, జూన్ 20 ప్రభాతవార్త** బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ తీర్పుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం చేకూరుతుందని, ఈ విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ సీఎం, బిజెపి నేత కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలో బిజెపి 9 ఏళ్ల పాలనపై బిజెపి మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి నేత, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు బిజెపి ఏపి రాష్ట్ర సహాయ ఇన్‌చార్జ్ సునీల్ డియోడర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి సామాన్య ప్రజల కష్టాలు తెలుసు కాబట్టే దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలనను కొనసాగిస్తున్నారన్నారు. ప్రదానమంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో దేశంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్ని విధాలా సహకారాన్ని అందిస్తున్నారన్నారు. తాను ఉమ్మడి మిగతా 4 లో



మాజీ సీఎంను సత్కరిస్తున్న నేతలు

# ఇకపై లో ఓల్టేజీ సమస్య తగ్గి.. అంతరాయం లేని కరెంటు

- మేడాపురం సబ్ స్టేషన్ ఏర్పాటు - లో వోల్టేజీ సమస్య, అంతరాయం లేని కరెంటు
- ప్రజా సేవలోకి వచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేశా..
- మేడాపురం సబ్ స్టేసన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి




సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

**చెన్నేకొత్తపల్లి, జూన్ 20 ప్రభాతవార్త** మేడాపురం గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటుతో చుట్టుపక్కల ఉండే ఫీడర్లపై లోడు తగ్గి మండలమంతా కరెటు కష్టాలు తొలగిపోతాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో, సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు పైలా నరసిహయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 1400 మంది రైతులకు కరెంటు కష్టాల్ని తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాకుండా 1800 ఇళ్లకు కరెంటు సదుపాయం కల్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలో మిగతా 4 లో

# రివిజన్ యాక్టివిటీలను పక్కాగా చేపట్టండి

## - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**శ్రీసత్యసాయి జిల్లా, జూన్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు స్పెషల్ సమ్మర్ రివిజన్-2024 ప్రీ రివిజన్ యాక్టివిటీలను పక్కాగా చేపట్టాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై ఈఆర్‌వోలు, ఎఇఆర్‌ఓలు, ఈడిటిలు, ఈఎస్ఎలు ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు, బిఎల్‌ఓలకు డిఆర్‌ఓ కొండయ్యతో కలసి జిల్లాకలెక్టర్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు శిక్షణ ఇవ్వడం ప్రతి ఫారాన్ని గురించి తెలుసుకోవడం, అడిషన్స్ చేసేటప్పుడు ఎలా చేయాలి, తొలగింపులు ఎలా చేయాలని, మార్పులు చేర్పులు ఏ విధంగా చేయాలి తదితర యాక్టివిటిలను పూర్తి స్థాయిలోచేవట్టాలన్నారు. ఎక్కడా ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, బిఎల్‌ఓల ద్వారా ఇంటింటికి ధృవీకరణచేవట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌నితనిఖీ చేసి ఓటర్‌కు అందుబాటులో ఉండి ఓటు వేసేలా చూడాలన్నారు. ఈఆర్‌ఓలు 100 శాతం పోలింగ్ స్టేషనుతనిఖీ చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌లో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉండేలా చూడాలన్నారు. ప్రజలు,ప్రజా ప్రతినిధుల నుండి వ్యతిరేకత రాకుండా మార్పులు, చేర్పులు చేపట్టాలని, ఫార ం 13, 14 పోటిషికేషన్ నోటీసులు ఇచ్చి నిర్ధరణ చేసుకున్న తరువాతనే తొలగించే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదులో ఎటువంటి ఒత్తిళ్ళకు తలొగ్గరాదని, ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎపిక్ కార్డులను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ పి.అరుణ్‌బాబు

# ఆక్రమించి...అద్దెలకిచ్చి..

- తీర్మాణాలు చేశారు..అమలేది?
- అక్రమణలో ప్రభుత్వస్థలాలు
- డ్రైనేజీలపై వెలసిన చిల్లర దుకాణాలు
- నగర పంచాయతీ ఆదాయానికి గండి
- నిర్లక్ష్యధోరణిలో అధికారులు



సబ్‌రిజిష్టర్ కార్యాలయం ముందు



గాంధీ సర్కిల్ రోడ్డుపై ఉన్న దుకాణాలు

**పెనుకొండ జూన్20 ప్రభాతవార్త** పట్టణంలో విలువైన స్థలాలు అక్రమణకు గురౌతున్నాయి. అక్రమణదారులు అక్రమించిన స్థలాల్లో పెట్టెలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. వెరసి నగరపంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అక్రమదారులతో నెలనెల అద్దె రూపంలో వసూలు చేయాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మాణాలు చేశారు. అమలు చేయడంలో నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారు. డ్రైనేజీలను సైతం అక్రమించి చిల్లర దుకాణాలు వేస్తున్న పట్టించుకునే నాథులే కరువయ్యారు.

పెనుకొండ నగర పంచాయతీలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. చిల్లర దుకాణాల యజమానులు, టిపిన్, నూడిల్స్ బళ్ల నిర్వాహకులు, చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించి మరీ తమ వ్యాపార కార్యకలాపాలను సాగిస్తున్నారు.

### డ్రైనేజీలపై దుకాణాలు..

పట్టణంలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీలపై చిల్లర దుకాణాలు వెలశాయి. దర్గారోడ్డు, బాబయ్యస్వామి దర్గా ఎదురుగా, ట్యాంకు సర్కిల్, మెయిన్‌బజార్‌ల్లో డ్రైనేజీలను అక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ దారుల్లో అధిక భాగం అనధికార పార్కింగులు ఆక్రమిస్తుండగా మిగిన కొద్ది భాగాన్ని పూలఅంగళ్లు, తోపుడు బళ్లు, టిఫిన్ బళ్లు అక్రమించుకున్నాయి. దర్గారోడ్డుల్లో చిల్ల దుకాణదారులు అక్రమించి తమ వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### ఆక్రమించి..అద్దెలక్కి..

పట్టణంలోని ప్రధాన కూడ్లలైన కోర్డురోడ్డు, స్టేట్‌బ్యాంకు రోడ్డు, తెలుగు తల్లి సర్కిల్, తపాలాకార్యాలయం, అంబేద్కర్ సర్కిల్, దర్గారోడ్డు, బాబయ్యస్వామి దర్గా ఎదరుగా తదితర ప్రాంతాల్లో ప్రభుత్వా స్థలాలను, రోడ్లను అక్రమణకు గురైయ్యాయి. కోర్డురోడ్లు, స్టేట్‌బ్యాంకు రోడ్డు తెలుగు తల్లి, సర్కిల్, సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద రోడ్డు పక్కను ఉన్న ఖాలీ స్థలాలను అక్రమించి దుకాణాలు వేశారు. కొందరు మిగతా 4 లో













## మంత్రి ఉషాశ్రీచరణ్ ఇసుక దందా అరికట్టాలి - టిడిపి నేతలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 20 ప్రభాతవార్త** : నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పర్య టిస్తున్న సందర్భం గా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడి న వినతిపత్రాన్ని అందజేశారు. నూతిమడుగు పెన్నానది నుంచి మంత్రి అయిన ఉషాశ్రీ చరణ్ భర్త సహకారంతో నూతిమడుగు పెన్ననది నుంచి వారి సొంత రిసార్ట్‌కు అక్రమంగా రిసార్ట్‌కు ఇసుకను తరలించి డంప్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానంమాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్‌జి.శివశంకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పాపంపల్లి రామాంజినేయులు, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల వెంకటేషులు, పట్టణ కన్వీనర్ శర్మాస్, మాజీ జడ్పిటిసి కొల్లాపురప్ప, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అక్కమ్మగార్ల ఆలయ కమిటీచైర్మన్ గొర్ల గోవిందప్ప, మల్లిపల్లి నారాయణ, శామీర్, మునీర్, మోరేపల్లి రాము, పవర్ ట్రాక్ శ్రీనివాసులు, ఏరిస్వామి, మాజీ డీలర్ ఇటుకల రామాంజినేయులు, సునీల్, గొల్ల రాము, సన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 20 ప్రభాతవార్త** : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయు డు సతీమణి నారా భువనేశ్వరి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఎన్టీఆర్ భవన్‌లో కళ్యాణదుర్గం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు సూచన మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి పుట్టిన రోజులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు ఒకరికొకరు పంచిపెట్టారు. భర్తకు, కుమారుడికి, నారా భువనేశ్వరి చేదోడు వాదోడుగా ఉంటూ ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్‌గా టిడిపి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి ఆరో తరగతి విద్యార్థి మృతి



రోదిస్తున్న తల్లి, చెల్లెల్లు

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 20 ప్రభాతవార్త** : పట్టణ శివారుల్లో స్మిమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి ఆరో తరగతి విద్యార్థి చరణ్ మృతి చెందారు. కంబదూరు బైపాస్ రోడ్డు సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. తల్లి, చెల్లెలతో కలిసి ఈతకు వెళ్లిన విద్యార్థి చరణ్. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు.

## రేషన్‌కార్డు,కౌలురైతు కార్డులకు ధరకాస్తు చేసుకోండి తహశీల్దార్

**బ్రహ్మసముద్రం జూన్ 20 ప్రభాతవార్త,** : మండల వ్యాప్తంగా వున్న అన్ని గ్రామాల ప్రజలు తమకు అవసరమైన రేషన్‌కార్డుకోసం నూతనంగా ధరకాస్తు చేర్పులు మార్పులకోసం సచివాలయంను సంప్రదించాలని అన్నారు.మండలంలోని రైతులు కౌలుకు భుమిని చేస్తున్న రైతులు తమ వివరాలు సచివాలయంలో అందించి కౌలురైతు పట్టాలను పొందాలని తహశీల్దార్ బాలకిషన్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

## నూతన ఎంఈఓకు సన్మాణం



సన్మాణం చేస్తున్న దృశ్యం

**అమరావురం, జూన్ 20, ప్రభాతవార్త**: మండలానికి నూతన మండల విద్యాశాఖ అధి కారిగా నియ మితమైన వెంకట రమణ నాయక్ ను ఘనంగా మంగళ వారం సన్మాణం చేశారు.ఈ సన్మాణ కార్యక్రమం నందు మండలంలోని ఉపా ధ్యాయులు,మండల విద్యాశాఖ కార్యలయ సిబ్బంది,సిఆర్‌పిలు ఘనంగా సన్మాణం చేశారు.విద్యాశాఖ అధికారిగా విచ్చేసిన సందర్బంగా మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని ఆయన ఉపాధ్యా యులకు తెలియజేశారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృత దేహంను పరిశీలిస్తున్న ఎస్ఐ నాగస్వామి

**రొద్దం, జూన్ 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎం.కోత్తపల్లి గ్రామంలో బోయ మారుతి సోమవారం రాత్రి అనుమానస్పద స్థితిలో మృతి చెంద డం జరిగింది, వివరాల లోకి వెళితే మృతి చెందిన మారుతి మధ్యం సేవించి కురుబ నారాయ ణస్వామి, హనుమంత రాయుడు, మల్లయ్య ఇంటి తలుపులు తట్టి వారిని బయటికి రావాలంటు కేకలు వేయడంతో వారు ఇంటి బయటకు వచ్చి ఒకరిని ఒకరు వాధించుకోని మారుతిపై చేయి చేసుకోవడం జరిగింది. గాయపడిన మారుతి అక్కటికి అక్కడే పడిపోవడంతో తీసుకోని పోయి మారుతిని ఇంటి వద్ద వదిలేశారు.ఈ సంఘటన రాత్రి 8 గంటల సమయం లో జరగడంతో రాత్రి 11 గంటల సమయంలో మారుతి మృతి చెందాడని బంధువులు మృత దేహాన్ని నారాయణ స్వామి, హనుమంత రాయుడు ఇంటి ముందు వదిలేశారు. అనంతరం మంగళవారం ఉదయం డిఎస్పి హుస్సేన్ పీరా,సిఐ కరుణాకర్,ఎస్ఐ నాగస్వామి విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకొని ఫోస్టుమార్టం నిమిత్తం మృతి దేహాన్ని పెనుకొండకు తరలించారు. మారుతిని గాయపరచిన నిందుతులను స్టేషన్‌కు తరలించడం జరిగింది.

## పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

**బొమ్మనహాళ్, జూన్ 20 ప్రభాతవార్త** : మండల కేంద్రం లోని పిహెచ్‌సిని మంగళవా రం జిల్లా మెడికల్ వైద్యాధికారి వీరస్వామి తోపాటు డిఐఓ యుగం ధర్‌లు వారి బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు సిబ్బందితో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంప్రతి నిరుపేద కు ఉచిత వైద్యం అందించడానికి కృషి చేసుత్నున్నట్లు వారు తెలిపారు. అందు లో భాగంగా పిహెచ్‌సిని తనిఖీ చేయగా ఆసుపత్రి సిబ్బందిపై స్థానికులు కొన్ని విషయాలపై ఫిర్యాదు చేశారని, వాటిపై సిబ్బందికి సలహాలు, సూచ నలు ఇచ్చినట్లు వారు తెలిపారు. సిబ్బందిలో ఒకరికొకరిపై సమన్వయం లోపించిందని మహిళా ఉద్యోగుల పట్ల సూపర్‌వైజర్ యుగంధర్ అసభ్య కర పదజాలంతో మాట్లాడుతారని, సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని డాక్టర్లు సకాలంలో విధులకు హాజరు కావడం లేదని పలు విషయాలపై సిబ్బందికి సలహాలు ఇచ్చినట్లు వారు తెలిపారు .డాక్టర్లు పిహెచ్‌సిలో 24 గంటలు తప్పకుండా ఉండాలని జెఎంలు రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని త్వరలో భర్తీ చేఆస్తమని తెలిపారు. మందులు అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని రెండవ డాక్టర్ మల్లేశ్వరికి వేతనం రావడం లేదని, సెలవుపై వెళ్లారని, ఆమె సైతం విధులకు హాజరు అవుతారని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్యల ఉన్నా జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇవ్వవచ్చని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పిహెచ్‌సి డాక్టర్ శ్రీలక్ష్మి, ఫార్మసిస్టు ఓబులనాయుడు, యుడిసి నీలకంఠం నాయుడు, ఎల్‌టి శ్రీకాంత్, వారితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టపర్తి మండల ఎంఇఓ-2కు వైఎస్ఆర్‌టిఎఫ్ ఘనస్వాగతం

**పుట్టపర్తిరూరల్, జూన్ 20, ప్రభాతవార్త**

పుట్టపర్తి మండలానికి నూతన ఎంఇఓ-2 గా వచ్చిన బి.ప్రసాద్‌కు వైఎస్ఆర్‌టిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు అందే విధంగా ఉపాధ్యాయులకు అన్ని విషయాలలో తగు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఇందుకు వైఎస్ఆర్ టిఎఫ్ తరఫు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, చిన్నాగప్ప, రామ్మోహన్ రెడ్డి, రాజగోపాల్, జనార్ధన్ రెడ్డి, అంజినాయక్, సుబ్బారెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన టిడిపి నేత సంగా సుధాకర్



నారాలోకేష్‌తో పాదయాత్రలో పాల్గొన్న సంగా సుధార్ దృశ్యం

**శ్రీసత్యసాయిజిల్లా, జూన్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి సీనియర్ నేత పాముదుర్తి సంగా సుధాకర్ కలిశారు. యువగళం పాద యాత్రలో భాగంగా నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి ప్రాంతం లో మంగళవారం ఉదయం సంగా సుధాకర్ పాదయాత్ర లో తన అనుచర గణంతో పాల్గొన్నారు. ఈ సందర్బంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు ఆయన తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడమే ధ్యేయంగా నాయోజకవర్గంలో పార్టీ ఉన్నతి కోసం శక్తివంచన లేకండా అహర్నిశలు తాఉ శ్రమించి అధిష్టానం సూచించే అభ్యర్థి విజయానికి దోహదపడతానని లోకేష్‌బాబుకు తెలియజేయడం జరిగిందన్నారు. అందుకు లోకేష్ బాబు స్పందిస్తూ పార్టీలోకష్టపడే, పార్టీ ఉన్నతికి కృషి చేసే వారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందని, తెలియజేశారన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పార్టీని విజయపథంలో నడిపించాలని సూచించినట్లు ఆయన తెలియజేశారు. అధిష్టానం యొక్క ఆదేశాలమేరకు ఆశయాలకు అనుగుణంగా తాను విశేష కృషి చేస్తానన్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖ నిరుపయోగ వస్తువుల కొనుగోలుకు ఆహ్వానం

**పుట్టపర్తిరూరల్, జూన్ 20, ప్రభాతవార్త**

పుట్టపర్తి సాంఘికసంక్షేమ శాఖవసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న వస్తువుల కొనుగోలుకు టెండర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు శ్రీసత్యసాయిజిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా షెడ్యుల్ కులములసంక్షేమ సాధికారత అధికారి,ఐ.శివరంగ ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఐరన్ ర్యాకులు, ట్రంకు పెట్టెలు, జంక్ బకెట్స్, అల్యుమినియం పాత్రలు, ప్లాస్టిక్ వస్తువులు, స్టీలు సామానులు, చెక్కబల్లలు,కుర్చీలు తదితర వస్తువులను ఆసక్తి కలిగిన వారు కొటేషన్ టెండరు ఫారంను 21వ తేది ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 05:00 గంటలలోపు వెస్ట్ గేట్ వద్ద, దీనజనోద్ధరణ భవనంలోని తమ కార్యాలయం రూము నెంబర్ 05లో అందించాలన్నారు. గడువు తదుపరి వచ్చే కొటేషన్లను స్వీకరించడం జరగదన్నారు. ఇందుకు దరఖాస్తు రుసుము రూ.1000లు, ఈఎండి రూ.25,000లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు



తహశీల్దారును సన్మానిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 20 ప్రభాతవార్త** : మండల తహశీల్దారుగా టి.ఓబు లేసు పదవీ బాధ్య తలు చేపట్టా రు. ఇంతకు ముందు కళ్యాణదుర్గం ఆర్డిఓ డిప్యూటీ తహశీల్దా రుగా పని చేస్తూ ప్రమోష న్‌తో తహశీల్దారుగా బాధ్య తలు చేపట్టారు. కార్యాలయంకు చెందిన అధికారులు పూలమాలలు, శాలు వాతో సన్మానించి, వైఎస్ఆర్‌సిపి నాయకులుసైతం సన్మానించారు. మండ లంలో రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని వారు తెలిపారు.

## 22న బళ్లారి బంద్‌కు చేంబర్ ఆఫ్ కామర్స్ పిలుపు



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న చేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ అధ్యక్షుఉు శ్రీనివాసరావు తదితరులు

**బళ్లారి, జూన్ 20, ప్రభాతవార్త** ; విద్యుత్ ధరల పెంపును ఖండి స్తూ తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారంనాడు బళ్లారి బంద్‌కు చేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ పిలుపునిచ్చినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో మంగళవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు అధికం చేయడంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలపై పెనుభారం పడినట్లయ్యిందని, ఇలాగే ఉంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు మూత పెట్టుకోవాల్సి వస్తుందని తెలిపారు. భారీ స్థాయిలో విద్యుత్ ధరలు పెంచితే తామెలా వ్యాపారాలు చేసుకోవాలని ప్రశ్నించారు. సార్వజనికులపై విద్యుత్ బిల్లులు తడిచి మోపెడవుతున్నాయని, ఉన్నఫలంగా విద్యుత్ ధరలు పెంచి వినియోగదారులపై ఉక్కుపాదంమోపిన ప్రభుత్వం చర్యను ఖండిస్తున్నామన్నారు. పరిశ్రమలకు వచ్చిన బిల్లులు చూస్తే వ్యాపారులు, పారిశ్రామికవేత్తల గుండె బరువెక్కిందని, బళ్లారిలో జీన్స్, స్పాంజ్ ఐరన్, స్టీల్ ఫ్యాక్టరీలపై విద్యుత్ ధరల పెంపు పరిణామకరంగా ఉన్నదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే పారిశ్రామికవేత్తలు వలసపోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దృష్టికి తమ పరిస్థితిని వివరించేందుకు ఈనెల 22వ తేదీన నగరంలో భారీస్థాయిలో వ్యాపార లావాదేవీలు, పరిశ్రమలు బంద్ చేసి ప్రతిఘటన జరుపుతామని తెలిపారు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, కార్యకలాపాలకు, బస్సు సంచారానికి ఎటువంటి సమస్య ఉండదన్నారు. బంద్ గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హోటళ్లు, పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపార సముదాయల కార్యకలాపాలను బంద్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ కాలేజీ మైదానం నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని ప్రతిఘటన జరిపి వినతి పత్రం అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎన్.యశ్వంత్‌రాజ్, పదాధికారులు దొడ్డన్నగౌడ, మహారుద్రగౌడ, గిరిధర్ పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీకి కేంద్రం నో..... బళ్లారిలో కాంగ్రెస్ భారీ ప్రతిఘటన

**- నిరుపేదల కడుపు కొడతారా.... ; జిల్లా మంత్రి బి.నాగేంద్ర**



బళ్లారిలో జిల్లా మంత్రి నాగేంద్ర నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిఘటన చేస్తున్నప్పటి దృశ్యం

**బళ్లారి, జూన్ 20, ప్రభాతవార్త** ; కర్ణాటక రాష్ట్రానికి అవసరమైన బియ్యం సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిరాకరించడాన్ని ఖండిస్తూ నగరంలో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ప్రతిఘటన చేపట్టారు. ప్రతిఘటనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర నేతృత్వం వహించారు. స్థానిక రాయసర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తక్షణం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న ప్రకారం నిరుపేదలకు 10 కేజీల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించడం జరిగిందని, ఆ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రేషన్ బియ్యాన్ని కేటాయించాల్సిందిగా కేంద్రాన్ని కోరగా, కేంద్రం అందుకు నిరాకరించడం కక్ష్య సాధింపు చర్యేనని మంత్రి నాగేంద్ర ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న అక్కసుతోనే ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీకి చెందిన హైకమాండ్ నాయకులు అక్కసుతో బియ్యం సరఫరాకు నో చెప్పారని, బియ్యం సరఫరాకు అవసరమైన నిధులు చెల్లిస్తామని చెప్పినా కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం చూస్తే నిరుపేదల కడుపు కొడుతున్నారు కదా..? అని ప్రశ్నించారు. పైగా ఎఫ్‌సీఐ వారికి బియ్యం పంపిణీ చేయకుండా ఆదేశాలు చేసిందని ఆరోపించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు 10 కేజీల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా కక్ష్య సాధింపు చర్యకు పాల్పడుతుందని, ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురయ్యేలా ఇటువంటి కుతంత్రాలకు పాల్పడుతున్నదని, రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా ఉండాల్సిన కేంద్రం ఇటువంటి పనికిమాలిన చర్యలకు దిగడం దేశ ప్రజలు చూస్తున్నారని, కేంద్రం బియ్యం ఇవ్వకున్నా ఇతర రాష్ట్రాల నుంచి బియ్యం పొంది ప్రజలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతిఘటనలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఘటనను చేపట్టారు. ఈ ప్రతిఘటనలో సండూరు ఎమ్మెల్యే ఇ.తుకారామ్, మాజీ ఎంపీ ఉగ్రప్ప, జెడ్పీ మాజీ సభ్యులు అల్లం ప్రశాంత్, ఎ.మానయ్య, మేయర్ త్రివేణి, కార్పొరేటర్లు వి.కుబేర, వివేక్, నాయకులు ఎం.శ్రీధర్, శివరాజ్‌హెగడే, వెంకటేష్‌హెగడే తదితరులు పాల్గొన్నారు.

## టి.బి.డ్యాంలో పూడిక తొలగింపునకు బోర్డు వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలి

**- బళ్లారి మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప**



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న బళ్లారి మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప

**బళ్లారి, జూన్20, ప్రభాతవార్త**

తుంగభద్ర జలాశయంలో సుమారు 32 టీఎంసీల నీరు సేకరణ జరిగేంత పూడిక చేరిందని వెంటనే దానిని తొలగించేందుకు తుంగభద్ర బోర్డు వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప డిమాండ్ చేశారు.

నగరంలో కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన తుంగభద్ర జలాశయంలో పేరుకుపోయిన పూడిక కారణంగా సుమారు 300 టీఎంసీలకు పైగా నీరు నది ద్వారా సముద్రానికి చేరుతున్నదని, దీనిని నియంత్రించడం ద్వారా నీటిని సద్వినియోగం చేసుకునే దిశలో ప్రభుత్వం దృష్టి సారించాలని, జలాశయ ప్రాంతంలో 28,180 చదరపు కి.మీ. సేకరణ ప్రాంతంలో 132 టీఎంసీల నీరు తుంగభద్ర జలాశయం ఆనకట్ట నిర్మాణం జరిగిన సమయంలో సేకరణ జరుగుతుండేది. ఆ నీటిలో కర్ణాటకకు 65, ఆంధ్రప్రదేశ్‌కు 35 శాతం వాటా జరిగేది. దీనివల్ల 3,62,795 హెక్టార్ల ప్రాంతం నీరావరి ఆయకట్టుగా ఉంది. అయితే జలాశయానికి చేరుతున్న పూడిక తొలగించే విషయంలో వైజ్ఞానికంగా ఎటువంటి చర్య తీసుకోవడంలేదని, తద్వారా గత 70 సంవత్సరాల వ్యవధిలో 32 టీఎంసీలకు పైగా పూడిక జలాశయంలో చేరిపోయి నీటి సేకరణ సామర్థ్యం కర్ణాటక రాష్ట్ర రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఎటువంటి సమస్య లేదని తెలిపిన ఆయన, సుమారు 32 టీఎంసీల నీరు సేకరణ జరిగే డ్యాం ప్రాంతంలో ప్రస్తుతం పూడిక నిండుకుపోయిందని, తుంగభద్ర జలాశయం బోర్డుకు రైతులు పదేపదే తెలియజేస్తున్నా ఏ ప్రయోజనం కనిపించడంలేదని, దీని పరిణామంగా జలాశయం నీటి సామర్థ్యం 132 టీఎంసీలకు బదులు వంద టీఎంసీలకు తగ్గిపోయిందని చెప్పారు. అంత ప్రమాణంలో పూడిక చేరినా తుంగభద్ర జలాశయం వారు పూడిక తొలగిం పు, ప్రత్యామ్నాయ నీటి సేకరణకు ముందుకు రాలేదని ఆరోపించారు. ఈ కారణంగా ప్రతి సంవత్సరం అదనంగా 300 టీఎంసీలకు పైగా నీరు సముద్రం పాలు అవుతున్నదని, ఇప్పటికైనా తుంగభద్ర బోర్డు వారు పూడిక తొలగింపుకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని ఆంధ్ర, తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలు గానీ ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పత్రికాగోష్టిలో కేపీసీసీ మీడియా ఇన్‌చార్జి వెంకటేష్ హెగడే, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.ఎం.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఓ రామారావు



మొక్కలు నాటుతున్న దృశ్యం

**గుడిబండ, జూన్ 20 ప్రభాతవార్త** : మండలం లోని రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఎంపిడిఓ రామారావు రైతులను కోరారు. కెఎన్ పల్లి గ్రామంలో తిమ్మప్ప ఎలాలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా క ఒబ్బరిచెట్లను నాటారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధిహామీ పథకంలో చెట్లు పెంపకానికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించి ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ భార్గవి, టిఏ మారేగౌడ్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నరహరి, ఫీల్డ్ అసిస్టెంట్ తిప్పేస్వామి రైతులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షా కార్యక్రమంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రామారావు

**గుడిబండ, జూన్ 20 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మండల ప్రజాపరి షత్ కార్యాలయంలో మండలంలోని వాలెంటీర్లకు జగన న్న సురక్షా కార్యక్ర మంపై ఎంపిడిఓ రామారావు, ఈఓఆర్డి నాగరాజునాయక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. వాలెంటీరు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పతకాల గురించి వివరించి అర్హులుగా ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించాలని అలాగే పథకాలు అందుకునేందుకు అవసరమైన పత్రాలను సమకూర్చుకోవడానికి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అదేవిధంగా జగనన్నసురక్ష కార్యక్రమంపై వాలెంటీ ర్లు అవగాహన కలిగి ఉండాలని సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని ్రతి ఇంటికీ ప్రభుత్వ పతకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత వాలెంటీర్లపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిలు గోవిందప్ప, రమేష్,అమరేష్,అరుణ,జయరంగమ్మ,వాలెంటీర్లు పాల్గొన్నారు.

## ప్రధాన మురుగుకాలువ పునరుద్దరణ



నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఛైర్మన్

**గుత్తి, జూన్ 20 ప్రభాతవార్త**

పట్టణంలోని చర్చి నుండి కురవవీధి వరకు ఉన్న ప్రధాన మురుగుకాలువ పునరుద్ధరణ పనులు ఛైర్మన్ వన్నూరు బి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. మూడు లక్షల అంచనా వ్యయంతో శిధిలమైన కాలువ గోడల పునర్నిర్మాణ పనులను అదే విధంగా పూడికతీత పనులను ప్రారంభించారు. త్వరలో 14 లక్షల రూపాయల అంచనాతో ఆ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైకాపా కన్వీనర్ హుసేన్‌పీరా, వెంకటరాముడు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు పునరుద్దరణ పనులు



పోలీసులు మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

**గుత్తి, జూన్ 20 ప్రభాతవార్త**

63వ జాతీయ రహదారిపై, కొజ్జెపల్లి, రాజాపురం నడుమ రోడ్డు ధ్వంసం కావడంతో ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి స్పందించిన సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఐ.లు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు స్వయంగా పోలీసు శాఖ తరపున మరమ్మత్తులకు పూనుకున్నారు. గోతులు పడిన ప్రాంతాల్లో ఎర్రమట్టిని తరలించి, యంత్రాల సాయంతో రోడ్డు చదును చేయించారు. వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. పోలీసు శాఖ చర్య పట్ల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# రెవెన్యూ అధికారుల గోల్‌మాల్‌కు నిండు ప్రాణం బలి

## - నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం, జూన్ 20 ప్రభాతవార్త బ్యూరో

నకిలీ పత్రాలు సృష్టించి నిండు ప్రాణం కోల్పోవడానికి కారణమైన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతలో కబ్జాకోరుల ఆగడాలు, దౌర్జన్యాలు అంతులేకుండా ఉన్నాయన్నారు. రెండు రజుల క్రితం తుమ్మల వంశీ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని ఏకరువు పెట్టారు. ఘటన నేపథ్యంలో బుల్లెట్ బాబా, సర్దార్, ఖాసీంలను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్ పంపడం జరిగిందన్నారు. ఇందులో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విష్ణు పరారీలో ఉన్నట్లు సమాచారం తెలిసిందన్నారు. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన విఆర్ఓ అనంతపురం ఇన్‌చార్జ్‌గా ఉంటూ నకిలీ వంశ వృక్షం సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కరుగుంట వద్ద 5 ఎకరాల 68 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు గోల్మాల్ చేసి దొంగ రికార్డులు సృష్టించడం జరిగిందన్నారు. ఆర్ఐ, విఆర్ఓల ప్రమేయం ఉందని స్పష్టంగా తెలుస్తోందని ఇందులో అధికార పార్టీ నాయకుల హస్తముందని స్పష్టం చేశారు. ఇన్‌చార్జ్ విఆర్ఓను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కక్కలపల్లి పొలం సర్వే నెంబర్ 10లో 3 ఎకరాల 74 సెంట్లు కమ్యునిస్టు పార్టీ సీనియర్ నాయ కుడు వెంగమనా యుడు, కుమారుడు రామాంజినేయులు, అజయ్‌కుమార్ భూమిని సైతం ఆన్‌లైన్ ఎక్కించి నకిలీ పత్రాలు సృష్టించడం జరిగిందన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యా లయానికి సెలవున్నప్పటికీ రాత్రికిరాత్రి తారు మారు చేశారన్నారు. 2021 లో అప్పటి తహశీల్దారు నకిలీ పత్రాలను తయారు చేసినట్లు తెలు స్తోందన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ లో ఎక్కించిన తహశీల్దారును ఆ పత్రాలు పొందిన కబ్జా కోరులపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జిల్లాలో భూమి తగాదాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు అధికమవుతున్నాయని పోలీసులు ఈ అంశాలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

# బిసి సెల్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు

గార్లదిన్నె, జూన్ 20 ప్రభాతవార్త

మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా తెలుగుదేశం పార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మి నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, దాసరి శ్రీధర్, రాష్ట్ర ఉపా ధ్యక్షులు కురుగుంట బ్రహ్మయ్య, కురుబ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, శాలివాహన సాధికారత రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, వడ్డెర సాధికార రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్ తదితరులు మాట్లాడుతూ.. కొల్లు రవీంద్ర బిసి సాధికారత పైన కట్టుబడి పోరాటాలు చేయడం జరుగుతుం దన్నారు. బిసిల అభివృద్ధిపై తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు గడిం చారన్నారు. వైకాపా పాలనలో ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్రమ కేసు లు పెట్టిన వెన్ను చూపని దీరు డు అన్నారు. బిసిలపై జరుగు తున్న దాడులను ఎప్ప టికప్పు డు ప్రతిఘటిస్తూ పోరాడుతు న్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాలివాహన రాష్ట్ర డైరెక్టర్ ఓబుళ పతి, కురుబ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ నారాయ ణస్వామి, పాలేకరి రాష్ట్ర డైరెక్టర్ బండారు సుధాకర్ నాయుడు, వడ్డే నాగేంద్ర, గోపాల్ గౌడ్, గంగ వరం బుజ్జి, కనుమ చౌదయ్య, రజక రాష్ట్ర డైరెక్టర్ వెంకటేష్, రామా ంజినేయులు, కొండ ఆనంద్, రాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

# అనుమానిత కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించండి

## - మండల వైద్యాధికారి షమిన్‌తాజ్

గార్లదిన్నె, జూన్ 20 ప్రభాతవార్త

గార్లదిన్నె మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 26 నుంచి జులై 16వ తేది వరకు లెప్రసీ కేస్ డిటెన్షన్ క్యాంపెయిన్ కార్యక్రమము చెయ్యబడును. దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించ డమైంది. డా.షమీన్ తాజ్ గ్రామంలోని గృహ సందర్శన చేసినప్పుడు ఆశా కార్యకర్తలు అనుమానిత కుష్టు వ్యాధి లక్షణాలను ఉన్న వారిని ఎలా గుర్తించాలి, ఏ విధంగా పరీక్ష చెయ్యాలి, వ్యాధి యొక్క లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. 21 రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహించ బడునని, కావున ప్రతి ఆశా కార్యకర్త వారికి రోజువారి నిర్దేశించిన గృహాలను తప్పక వెళ్లి గృహంలోని ప్రతి వక్కరిని క్షుణ్ణంగా పరీక్షించి వారిలో ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించిన యెడల వారికి సంబంధిత సచివాలయ ఆరోగ్య సిబ్బందికి తెలియజేలని, ఆరోగ్య సిబ్బంది వారిని మరోసారి పరీక్షించి అనుమానిత వ్యక్తులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని మెడికల్ ఆఫీసర్ తెలియజేశారు. అలాగే ముందస్తు లింగనిర్ధారణ పరీక్షలకు ప్రోత్స హించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ముందస్తు లింగ నిర్ధారణ పరీక్షల చట్టం గురించి అవగాహన కల్పించాలని, గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.హనీషా, సిహెచ్ ఓలో కానాత్, పిహెచ్ ఎన్ అరుణకుమారి, సూపర్‌వై జర్స్ కృష్ణమో హన్, విశ్వనాథ్ రావ్, సూర్యకళ, ఇంది రమ్మ, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి షమిన్‌తాజ్

# ద్వారంపూడి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు

## - జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్

అనంతపురం అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త

కాపుల అభ్యున్నతి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని జనసేన పార్టీతోనే సాధ్యమవుతుందని, ముద్రగడ పద్మనాభం లేఖ ఆయన వ్యక్తిగతమని కాపు జాతికి సంబంధం లేదని కాపు సోదరులు భావిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కాపులకు వైసీపీ ఏం చేసిందో ముఖ్యమంత్రిని ప్రశ్నించలేని ముద్రగడ ఇప్పుడు లేఖలు రాసుకుంటూ కాపు జాతిని మరొకసారి మోసం చేసే విధంగా వ్యవహరిస్తే మోసపోయేందుకు కాపులు ఇక సిద్దంగా లేరని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూనే.. కాపుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యల పట్ల చిత్తశుద్ధి కలిగిన జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ బాటలోనే కాపులందరూ సిద్ధంగా ఉన్న క్రమంలో, వ్యక్తిగత ప్రయోజనాల కోసం జాతిలో చీలికలు తీసుకొచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా వారిని కాపు సమాజం దూరంగా పెడుతుం దన్నారు. ఇక కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. ఆయన గురి ంచి పవన్‌కళ్యాణ్ వాస్తవాలే మాట్లాడారని, కాకి నాడ ప్రజలే చెబుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్‌తో పోటీపడే స్థాయి ద్వారంపూడికి లేదని, మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం చెల్లించు కోక తప్పదని పత్తి చంద్రశేఖర్ ఘాటుగా హెచ్చరించారు.



పత్తి చంద్రశేఖర్

# ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

## - తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహజంచారు. మంగళవారం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు తెలుగు మహిళల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నగర మహిళ అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి మాట్లాడుతూ .. హెరిటేజ్ డెయిరీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మహిళలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్న నారా భువనేశ్వరి నిండు నూరేళ్ల వర్ధిల్లాలని, నేడు మహిళలు అన్ని రంగల్లో రాణి స్తున్నారని, ఎన్టీఆర్ ట్రస్టు అధ్యక్షురాలిగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, అందరికీ ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతోనే మహిళల పురోగతి సాధ్యమవుతుందని, పార్టీకి మహిళలు అండగా ఉండాలని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించి నారా చంద్రబాబునా యుదుని ముఖ్యంత్రి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జానకి, సరళ, షరీనా, వసుం ధ ర, హసీనా, సూత, బుజ్జి, కృష్ణవేణి, దేవి, కవిత, మాణెమ్మ తదితరులు పాల్గొన్నా



కేక్ కట్ చేస్తున్న తెలుగు మహిళలు

# ఆరోగ్యమే మహాభాగ్యం

## - ఉచిత గుండె వైద్య శిభిరానికి చక్కటి స్పందన - గుమ్మేపల్లి సర్పంచు దేగల లలితమ్మ, కృష్ణమూర్తి

శింగనమల, జూన్ 20 ప్రభాతవార్త

ప్రతి మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యమని, ఈ బిజీ జీవతంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని గుమ్మేపల్లి సర్ప ంచు దేగల లలితమ్మ, టీడీపీ అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుమ్మే పల్లి గ్రామంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత గుండె వైద్య శిభిరాన్ని గుమ్మేపల్లి గ్రామ సర్పంచు దేగల లలితమ్మ, టిడిపి అనం తపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర ్యంలో నిర్వహించారు. సవేరా ఆసుపత్రి వైద్యులు రామ్‌కుమార్, అనీఫ్, పృథ్వీలచే వైద్య శిభిరంలో దాదాపు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి సిఫార్సు చేశారు. వచ్చిన వారికి విఆర్‌బిఎస్ బిపి, ఈసిజి, 2డి ఎకో మొదలగు గుండెకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా నిర్వహించారు.

అనంతరం దేగల దంపతులు మాట్లాడుతూ.. సవేరా ఆసు పత్రి వారి సహకా రంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని, భవిష్యత్తులో మరిన్ని శిభిరాలు నిర్వహిస్తామని, ఎన్నికల సమంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే పంచాయితీ అభివృద్దికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉచిత పరీక్షలు చేసిన సవేరా వైద్యులను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేగల శ్రీనివాసులు, పెద్ద నాగముని, దండు విజయ్‌కుమార్, లక్ష్మయ్య, శివయ్య, ఓబులపతి, పెద్ద ఓబయ్య, దేగల హరీష్, దేగల కిరణ్, కోయగూర పెద్దన్న, మొండి పోగుల ఎరిస్వామి, దాల్ వీరనారాయణ, లోలూరు నారాయణ స్వామి, వడ్డే రామాంజినేయులు, బండి ఎరిస్వామి, గంగాధర్, ఆదిరెడ్డి, సూర్య నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిపి చెక్ చేయించుకుంటున్న సర్పంచు దేగల లలితమ్మ



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న దేగల దంపతులు

# పశు బీమాను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి - డిడి రమేష్‌రెడ్డి,ఏడి సురేష్.డాక్టర్లు ఉషా,శారద

అనంతపురం రూరల్,జూన్ 20 ప్రభాతవార్త:

అనంత జిల్లా,రూరల్ మండలంలోని రైతులు అందరు పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని డిడి రమేష్‌రెడ్డి,ఏడి సురేష్,డాక్టర్లు ఉషా, శారదలు తెలిపారు.మంగళవారం అనంత రూరల్ మండలం కందుకూరు గ్రా పంచాయితీలో డాక్టర్ ఉషా అధ్యక్షతన రైతులకు పశు బీమాపై అవగాహన సదస్సు వెటర్నీ డాక్టర్ అధికారులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిడి రమేష్‌రెడ్డి,ఏడి సురేష్‌లు హజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పశుపోషణ పెంపు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పాడి రైతులను ప్రోత్సహిం చడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా రైతులకు జీవనధారమైన పాడి పశువులు మరణించే రైతులు నష్టపోకుండా రైతులకు అండగా నిలవడం కోసం పశు బీమాను తీసుకురావడం జరిగిందని ఈ బీమా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని కావున పాడి పశువులు కలిగిన ప్రతి రైతు పశు బీమాను తప్పని సరిగా చేసుకోవాలన్నారు. పశు బీమా పైన ప్రతి విడి రైతులకు అవగాహన కల్పించి రైతుల చేత పశు బీమా చేయించాలని వారు విడిలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెటర్నీ డాక్టర్లు చోళసముద్రం విడి స్వేత, కాటిగాని కాల్వ విడి శారద, కూడేరు విడి శ్రీనివాసులు, అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిడి రమేష్‌రెడ్డి.

# రాజీ మార్గం రాజ మార్గం

## - శాశ్వత లోక్ ఆదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం,ఓల్డ్‌టౌన్ జూన్ 20,ప్రభాతవార్త: రాజీ మార్గం ద్వారా కేసులను రాజ మార్గంలో పరిష్కరించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస రావు కక్షి దారులకు సూచించారు.మంగలవారం నిర్వహించిన పత్రికల విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గం రాజ మార్గం అనే నినాధంతో విరుపక్షాల నడుమ రాజీ కుదిరితే వివాద పరిష్కరానికి విరుపక్షాలు సమ్మతితోనే లోకదాలత్‌లో సమస్య పరిష్కారం అవుతుంది అన్న విషయం అందరికి తెలుసుకోవాలన్నారు.న్యాయ సేవా అధికార చట్టం క్రింద లోకదాలత్‌తో పాటు శాశ్వాత లోకదాలత్ కూడా ఏర్పాటైంది.ప్రజా ప్రయేజన సేవల కేసుల్లో తప్పని సరిగా పరిష్కారం పొందే విధంగా ప్రజ ప్రయేజన సేవల శాశ్వాత లోక్‌అదాలత్ పనిచేస్తుందని తెలిపారు.న్యాయ సేవా అధికార చట్టంలోని సెక్షన్ 22బి కింద శాశ్వత లోక్ అదాలత్‌లు దేశ వ్యప్తంగా ఏప్పడ్డ యి.విశ్రాంతి జిల్లా న్యాయ మూర్తి అధ్యక్షులుగాను అనుభవజ్ఞులైన విశ్రాంతి అధికారులు మరో ఇద్దరు సభ్యులు గాను ఈ శాశ్వాత లోక్‌అదాలత్ బెంచ్ ఫిర్యాదులను స్వీకరిస్తుందని దీనివలన అనంతపురం,శ్రీ సత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా అనంతపురం జిల్లా కేంద్రంలోని న్యాయ సేవా సధంలో ప్రజ ప్రయేజనాల శాశ్వాత లోక్‌అదాలత్ లో అందుతాయన్నారు.

అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాలకు ప్రజా ప్రయేజనాలు శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం అధ్యక్షులుగా న్యాయ మూర్తి కె.శ్రీనివాస రావు, సభ్యులుగా ఎం.రాజశేఖ ర్‌రెడ్డి, ఎం,వి,ఎల్. ఎన్ శ్రీని వాస రావులు వ్యవహరిస్తు న్నా రని తెలియజేశారు.ప్రజా ప్రయేజనాల శాశ్వాత లోక్ అదాలత్ లో ఫిర్యాదు దాఖలు చేయటానికి ఎటువంటి కోర్టు ఫీజు/రుసుము చెల్లిచాల్సిన అవసరం లేదని, విరు పక్షల నడుమ సమరస్య పరిష్కారానికి అవకాశం కల్పిస్తుంది. ఒక వేళ సమరస్య పరిష్కారానికి సహకరించని పక్షంలో అందుబాటులో ఉన్న అధారల ములకంగా ఈ కేసులో తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉంది అని తెలిపారు.శాశ్వాత లోక్ అదాలత్ కు గరిష్ఠ అధికార పరిమితి ఒక కోటి రూపాయలగా నిర్ణయించారు.ఫిర్యాదు దాఖలుకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఉంటుంది.అలోగా దఖలు చేసు కోవాలి.ప్రజ ప్రయేజన సేవల శాశ్వాత లోకదాలత్‌గా పిలువ బడే ఈ ధర్మాసనం జారీ చేసిన నిర్ణయం అంతిమంగా ఉంటుంది.అప్పిలుకు ఆస్కారం లేని శాశ్వాత పరిష్కారంగా పరిగనించ బడుతుంది.ప్రజ ప్రయేగ సేవల శాశ్వత లోకదా లత్‌లో జారి చేసే నిర్ణయాన్ని ఆవార్డులు జిల్లా కోర్టులో అమలు చేయవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఎస్కేయూ,జూన్ 20,ప్రభాతవార్త: ఆకుతోటపల్లి ఆమ్మఒడి వృద్ధాశ్ర మం లోను మరియు శ్రీ క్రిష్ణ దేవరాయల విశ్వవిద్యాలయం నందు స్టాచ్యూ దగ్గర భావి భారత ప్రధాని భారతీయుల ప్రియతమ నేత రాహుల్ గాంధీ 53వ జన్మదిన వేడుల సందర్భంగా భారత జాతీయ విద్యార్థి సంఘం(ఎన్ ఎస్ యూఐ) రాష్ట్ర యూనివర్శిటి కమిటీ యనమల ప్రసాద్ ఆధ్వర్యంలో, ఆమ్మవడి వృద్ధాశ్రమం లోని ఘనంగా జన్మదిన వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమంలో యనమల ప్రసాద్ మాట్లాడుతూ భరత దేశ సమైక్యత కోసం రాహుల్ గాంధీగారు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 3573 కిలోమీటర్లు దేశం సంక్షేమం కోసం భారత్ జోడోయాత్ర దిగ్విజయంగా చేపట్టడం జరిగింది. రైతులు,మహిళలు ,కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు వివిధ వర్గాల ప్రజలను కలుస్తూ వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలో ప్రజలు ఆనందంగా ఉండాలని,అభివృద్ధి పనులు జరగాలని మన మందరం కలసి రాహుల్ గాంధీని 2024లో ప్రధాని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యనమల ప్రసాద్ అధ్వర్య ంలో బియ్యం, పండ్లు,బ్రెడ్లు పంపిణి చేయడం జరిగంది.అదేవిధంగా లక్ష్మణ్, సునీల్, మారెన్న,మహేష్, రాజెంద్ర, ముత్యాలు,వంశీచంద్, ఖాజావలి, రాజారెడ్డి, స్టీపెన్, అజరత్,లక్ష్మన్న, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పాలు బ్రెడ్లు పంపిణి చేస్తున్న దృశ్యం

# ఘనంగా బెస్త నారాయణ స్వామి జన్మదిన వేడుకలు

శింగనమల,
జూన్ 20 ప్రభాతవార్త

శింగనమల నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి జన్మదినం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు శాలువాతో బెస్త నారాయణస్వామిని సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి పుష్ప గుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దాసరి గంగాధర్, మాజీ ఎ ంపిటిసి కుళ్లాయప్ప, ఎం.ఆదినారాయణ, బండి పరుశురామ్, బిసి సెల్ బండి పరుశురామ్, కాయల సురేష్ యాదవ్, మహ్మద్ గౌస్, బెస్త అమర్‌నాథ్, వడ్డే పవన్, సతీష్‌రాయల్, రంగస్వామి, తిప్పన్న, రంగాపురం శ్రీరాములు, పోతులయ్య, సురేష్, రామదాసు, సోము తదితరులు పాల్గొన్నారు.



బెస్త నారాయణస్వామిని సన్మానిస్తున్న దండు

# 6, 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష

అనంతపురం న్యూటౌన్, జూన్ 20 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్షను మంగళవారం ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 12: 30 గంటల వరకు నిర్వహిం చడం జరిగింది. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 77 సీట్లకుగా ను మొత్తం 257 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, 220 మంది విద్యార్థు లు ప్రవేశ పరీక్షకు హాజరు, 37 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జోన్ -4 అధికారి రాజేంద్రనాథ్ రెడ్డి తనిఖీ చేశారు. ఫలితాల కోసం విద్యా ర్థులు ఎక్కడైతే పరీక్ష రాశారో అదే పాఠశాలలోని నోటీసు బోర్డులో ప్రదర్శి ంచడమైంది. జిల్లాలోని ఐదు పాఠశాలల ఫలితాలు అనంతపురం జిల్లా క న్వీనర్ కార్యాలయం నార్పల బిసి గురుకుల పాఠశాలలో ప్రదర్శించడం జరిగిందని అనంతపురం జిల్లా బిసి గురుకుల పాఠశాల కన్వీనర్ సంగీత కుమారి తెలియజేశారు.



ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

# యోగ అవగాహన ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృ:శ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, జూన్ 20 ప్రభాతవార్త బ్యూరో

9వ అంతర్జాతీయ యోగ దినమును పురస్కరించుకుని, నేడు అనం తపురం పట్టణంలో పెద్ద ఎత్తున నినాదాలతో యోగపై అవగాహన, ఆవశ్ యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో ఎం. రాజశే ఖర్‌రెడ్డి వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షుడు పెద్ద ఆహ్వానించి, అనంతపురం మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కొగటం విజయ భాస్కర్, యువజన సంక్షేమ శాఖ అధికారి కేశవనాయుడు, అడిషనల్ ఎస్‌పి హనుమంతు ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. పి.గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. యోగ, అభ్యాసనము ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. అనంతరం పట్టణంలోని వివేకానంద యోగ కేంద్ర నిర్వహించిన 13 కేం ద్రాలలో ఉచిత యోగా శిక్షణ పొందవలసిందిగా ప్రజలను కోరారు. విజ య భాస్కర్‌రెడ్డి యోగా చేస్తూ, పర్యవరణమును కూడా పరిరక్షించుకంటే ప్రజలకు ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## - టీడీపీ అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి

శింగనమల,
జూన్ 20 ప్రభాతవార్త

జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సోషియల్ మీడియా కన్వీనర్లుగా ఎంపికైన మొండిపో గుల ఎరిస్వామి, శింగనమల నియోజకవర్గ అధ్యక్షులు దాల్ వీరనారాయణ మంగళవారం గుమ్మేపల్లి గ్రామంలో టిడిపి అధికార ప్రతి నిధి దేగల కృష్ణమూర్తితో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దేగల మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ నాయకులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆయన తెలిపారు.



దేగల దంపతులను సన్మానిస్తున్న టిడిపి ఎస్సీ సెల్ కన్వీనర్లు

# వ్యవసాయం దండగన్న చంద్రబాబును రైతులు నమ్మరు

## - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం అధ్యక్షులు తరిమెలచిన్న రంగారెడ్డి

శింగనమల, జూన్ 20 ప్రభాతవార్త

వ్యవసాయం దండగన్న చంద్రబాబును రైతులు నమ్మరని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం అధ్యక్షులు తరిమెలచిన్న రంగారెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ 2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి రాగానే సవాలక్ష సాకులు చెప్పి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారన్నారు. ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు రైతులను అవహేళనగా చూశారన్నారు. అటువంటి నాయకున్ని రైతులు నమ్మరని 2024 ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి రావాలనుకుంటున్న చంద్రబాబు మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు ప్రకటి ంచిన మినిమేనిఫెస్టోలోనివి పథకాలన్నీ జగన్ అమలు చేస్తున్న పథకాలేనని చంద్రబాబు కొత్తగా తెచ్చిన పథకాలు ఏవీ లేవన్నారు.



తరిమెల రంగారెడ్డి (ఫైల్‌ఫోటో)

# నేడే రైతు గర్జన సభ

## - జిల్లా వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు తరలి రండి - సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం, జూన్ 20 ప్రభాతవార్త బ్యూరో

జూన్ 21న కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ, ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు గర్జన పేరుతో భారీ ధర్నా చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ చేయాలని, హంద్రీనీవా కాలవను వెడల్పు చేసి పదివేల క్యూసెక్కులకు పెంచి, సమాంతర కాలవ నిర్మాణం చేపట్టాలని, కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టు కొప్పల్ జిల్లా నవలీ ప్రాజెక్టును ఆపాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా ఇటీవల అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ, జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం జరుగనున్న రైతు గర్జనకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు.

# పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి..ఎంపీపీ సునీత



మాట్లడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం, జూన్ 20 ప్రభాతవార్త

పేద ప్రజలకు మెరుగైన వైద్యసే వలు అందించాలని జిల్లా ఎంపీపీల సంఘం గౌవరవ అధ్యక్ష లు ఎంపీపీ సునీత అన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్ర ంలోని అర్బన్ హెల్త్‌సెంటర్ నందు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమా వేశం చైర్మన్ దాసరి సునీత అధ్య తన నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మా ట్లడుతు బాల్యవివాహాల పైన వైద్య ఆరోగ్యశాఖ తోపాటు అన్ని శాఖల కలసి గ్రామీణ ప్రాంతల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిం చాలన్నారు. గ్రామాల్లో పారుశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి సేవల్లో ముఖ్యంగ ఫ్యామిలీ ఫిజీషియర్ సేవలు గురించి తెలి యజేయాల న్నారు. అనంతరం కమిటి సభ్యులు మనేరి కొండమ్మ మాట్లడు తు గర్భవతు లు, బాలింతల పై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది మాట్లడుతు ఆసు పత్రిలో కరెంట్ సమస్య ఉంది, ఇన్‌వేటర్లును ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు వైద్యాదికారి డాక్టర్ స్వాతి లక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఈఓఆర్‌డి దామోదరమ్మ, సిహెచ్చఓ మోహన్ రావు, పసులూరు సర్పంచు కల్పనరెడ్డి, వైద్యసిబ్బంది చెన్నమ్మ, ఈశ్వరమ్మ,భాషా తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదపడుతుంది

## - ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి

పామిడి,
జూన్ 20 ప్రభాతవార్త

మానసిక వత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంపొందిస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని అందువల్ల ప్రతిఒక్కరూ యోగా చేయాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి పిలు పునిచ్చారు. ఈనెల 21న అం తర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది యోగాంధ్రప్రదేశ్..ఆరోగ్యాంధ్రప్రదేశ్.. యోగాతో ఆరోగ్యం.. యోగాతో ఆనం దం అని నినదిస్తూ అంబేద్కర్ సర్కిల్‌లో మానవ హారాన్ని నిర్వహించిరు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి మాట్లా డుతూ యోగా, ద్యానం చేయటం ద్వార రోగాలను దూరం చేయవచ్చని తెలియజేస్తూ వయసుతో సంబందం లేకుండా యోగా చేయవచ్చని యోగా చేయటం ద్వార కలిగే ప్రయోజనాలను వివరిం చారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మహేష్, స్టాఫ్‌నర్స్ మమత, యోగా శిక్షకురాలు సంధ్య, ఆరోగ్యమిత్ర బాబు, వైసీపీ నాయకులు జోజోడే కుమార్, అడ్వకేట్ దత్తు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



.అంబేద్కర్ సర్కిల్‌లో విద్యార్థుల మానవహారం

వార్త

ఖర్చుపెట్టాక బాధపడే బదులు, ఖర్చుపెట్టడానికి ముందు పడేబాధను బడ్జెట్ అంటారు.

-వాల్

# ప్రజారోగ్యాన్ని పీలుస్తున్నదెవరు?

జనారోగ్యమే జాతి మహాభాగ్యం. దేశ ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఆరోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా నేటికీ అందరికి కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్నివ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపైకి వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నవిగా చెప్పొచ్చు. కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించు కున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కొత్తకొత్త వ్యాధులు వస్తూనే ఉన్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నా రు.లక్షల సంఖ్యలో ప్రాణాలు వదులుతున్నారు. మొన్న కరోనా రక్కసి సృష్టించిన బీభత్సం నుంచి మానవజాతి ఇంకా కోలుకోలేదనే చెప్పొచ్చు. ఈ వ్యాధిసోకినవారు బయటపడినా ఇంకా దాని ప్రభావం వదిలిపెట్టడం లేదు. గుండెజబ్బులు, లివర్, కిడ్నీ లాంటి అవయవాలపై దాని ప్రభావం చూపడంతో ఇప్పటికీ బయటపడలేకపోతున్నారు. అయితే రోగనిరోధక శక్తి ఉన్నవారు కొంతమేరకు తట్టుకోగలుగుతున్నారని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. మధుమేహం, గుండెపోటు, రక్తపోటు, వ్యాధులున్నవారు తట్టుకోలేకపోయారు. ఇప్పుడిక వర్షాకాలం ఆరంభం కాబోతున్నది. దీంతో దోమలద్వారా వచ్చే సీజనల్ వ్యాధులు విజృంభించబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. భారత్‌లో కొవిడ్ తర్వాత అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో డెంగ్యూ ఒకటని చెప్పొచ్చు. ప్రధానంగా నైరుతి ఈశాన్య రుతుపవనాలతోపాటు ఈ డెంగ్యూ వ్యాధి కూడా విస్తరించడం సర్వసాధారణమైపోయింది. పగటిపూట మాత్రమే కుట్టే ఎయిడిస్ ఈజిప్ట్ఫ్లయి అనే దోమకారణంగా డెంగ్యూ వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వచ్చిన తర్వాత కోలుకోవడం కొంత క్లిష్టతరంగానే మారుతున్నది. ప్రపంచవ్యాప్తంగా యేటా పది, ఇరవై కోట్ల మంది వరకు ఈవ్యాధిబారిన పడుతున్నట్లు ప్రభుత్వ అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం గుర్తించిన ప్రమాదకర వ్యాధుల్లో ఒకటిగా డెంగ్యూని ప్రపంచ ఆరోగ్యసంస్థ 2019లోనే గుర్తించింది. 2022లో దేశం మొత్తం మీద నమోదైన డెంగ్యూ కేసుల్లో 60 శాతం తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. డెంగ్యూను నియంత్రించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలం కావడం లేదు. ఈ వ్యాధి విస్తరించకుండా నిరోధించేందుకు టీకా కనుగొనే ప్రయత్నాలు ఇంకా ఒక కొలిక్కిరాలేదు. ఇక స్వైన్‌ఫ్లూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే శరీరంలో ఇమ్యూనిటీని పెంచు కోవడంతోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని డాక్టర్లు చెబుతున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లేకాదు ఆయుర్వేదిక్, హోమియో అన్ని విభాగాల డాక్టర్లు, వైద్యరంగ నిపుణులందరూ శరీరంలోని ఇమ్యూనిటీని పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. అయితే ప్రజలు ఈ వాస్తవాలు తెలిసి కూడా రోగనిరోధక శక్తిని ఎందుకు పెంచుకోలేక పోతున్నారు. రోగనిరోధకశక్తి ఒక్క రోజులోనో, ఒక వారంలోనో నెలరోజుల్లోనో పెరిగేది కాదు. బాల్యం నుండి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందివ్వాలి. ఏ మేరకు అందిస్తున్నామో చెప్పాల్సిన పనిలేదు. పౌష్టికాహార లోపంతో కోట్లాది మంది ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటిస్తున్నవారే కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది? ఎక్కడి నుండి వస్తుంది? మరోకపక్క ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ధూమపానం, మద్యపానం వల్ల జరుగుతున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. ప్రపంచ వ్యాప్తంగా అనారోగ్య కారణాల్లో ధూమపానం ఇప్పుడు రెండోస్థానానికి చేరుకున్నది. ధూమపానం చేసేవారికే కాదు వారి చుట్టుపక్కల ఉన్నవారికి కూడా వ్యాధులను వ్యాపింపచేయగలిగే శక్తి దానికి ఉంది. సిగరెట్‌పొగలో 4,800 ప్రమాదకర విషవాయువులున్నట్లు గుర్తించారు. ఇవి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. ధూమపానాన్ని నియంత్రించేందుకు పాలకులు తీసుకున్న చర్యలు ఆశించిన లక్ష్యాన్ని చేరుకో లేకపోతున్నాయి. ప్రధానంగా ధూమపానం నిషేధం వల్ల జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపకుండా చట్టాలు చేయడంతో అవి నిరుపయోగంగా మారిపోతున్నాయి. ఇక మద్యపానం కూడా ప్రజా రోగ్యాన్ని కాటువేస్తున్నది. ఇక కల్తీ గురించి ప్రత్యేకంగా చర్చించాల్సిన పనిలేదు. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. రోగనిరోధకశక్తి తగ్గిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో పాలకులే ఆలోచించాలి.

చదరంగంలో వలెనే జీవితంలో కూడా ముందుచూపే జయిస్తుంది.



బెంజమిన్ డిజ్రాయిలీ

గొప్ప మేధ నలుగురు నడిచిన దారిలో నడవదు. అది ఇంతవరకూ ఆవిష్కరించని మార్గాలను అన్వేషిస్తుంది.



లింకన్

## ప్రజావాక్కు



### వ్యవస్థల వైఫల్యం!

రాష్ట్రంలో యువకుల్లో రోజురోజుకు హింసా ప్రవృత్తి పెరిగిపోవడం ప్రతిఒక్కరినీ ఆందోళనకు గురిచేస్తున్నది. సమస్య మూలాల్లోకి వెళితేచట్టాలు, పోలీసువ్యవస్థ తమను ఏమీ చేయలేవన్న ధీమా పెరిగిపోయింది. ఆపైన రాజకీయ అండదండలతో మరింత బరితెగిస్తున్నారు. గతనాలుగు సంవత్సరాలుగా హత్యలు, అత్యాచారాలు, ఇంకా అనేక చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారికి శిక్షలు పడిన దాఖలాలు లేవు. పాలకులు చట్టసభల్లో ఊకదంపుడు, బడాయికబుర్లు చెప్పడం, అందుకు విరుద్ధంగా పోలీసు వ్యవస్థను దుర్వినియోగ పరిచి కేసులను నీరుగార్చే ప్రక్రియ యధేచ్ఛగా కొనసాగుతున్నది. విధి నిర్వహణలో భాగంగా హంతకులను పట్టుకోవడానికి వచ్చిన కేంద్ర సిబిఐ అధికారుల మీదే ఎదురు కేసులు పెట్టిస్తున్నారంటే రాజకీయ అధికార దుర్వినియోగం ఏ స్థితికి వెళ్లిందో ప్రతి ఒక్కరికి అర్థం అవుతున్నది. ఇంకాగొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరుకోవడం ఎందుకు? ప్రజాక్షేత్రంలో పాలకులే ముద్దాయిలు?

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### బాధ్యులను కఠినంగా శిక్షించాలి

రాష్ట్రంలో పలు చోట్ల భారీగా దొంగ ఓట్లు నమోదు అయినట్లు పత్రికల్లో నిత్యం వార్తలు వస్తున్నాయి. అది కూడా ఒకే ఇంటి నంబరుతో, ఒకే తండ్రి పేరుతో వందల సంఖ్యలో నమోదు అయినాయంటే అది ఉద్దేశ్యపూర్వకంగా చేసిన దుశ్చర్య అని స్పష్టంగా తెలుస్తుంది. ఓటర్లజాబితా అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైనది. ఇలాంటి తప్పుడు జాబితాలతో ఎన్నికైన ప్రతినిధులు మరిన్ని దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుంది. ఈ విధంగా దొంగ ఓట్ల నమోదుచేయడంలో బాధ్యులెవరోగుర్తించి శిక్షించాల్సిన బాధ్యత ఎన్నికలసంఘంపై ఉంది. ఎప్పుడో పరిశీలించి తొలగిస్తామని చెప్పడం బాధ్యతారాహిత్యం అవుతుంది. తప్పుచేసిన వారికి తగిన శిక్షపడకపోతే అవే తప్పులు పునరావృతం అవుతాయి.

-ఉప్పలపాటిరాజా, గంగన్నగూడెం, ఏలూరుజిల్లా

### అధిక ఫీజులపై ఉక్కుపాదం మోపాలి

పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయోలేదో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ మొదలైంది. ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించి మూడురకాల ఫీజులను నిర్ణయించింది. అంతకుమించి అదనంగా వసూలు చేసినట్లు తెలిస్తే ఆ స్కూల్ అనుమతులను రద్దుచేస్తామని హెచ్చరించింది. అయినా ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు పెంచేశాయి. ముఖ్యమంత్రి ఆదేశించినా విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యోగాతో లాభమే

జూన్ 21న ప్రపంచ యోగాదినోత్సవం అన్ని దేశాల్లో జరుపుకోవడం యోగా పుట్టినభారత దేశానికి గర్వకారణం. ఈ యేడు భారత ప్రధాని మోడీ అమెరికాలో ఐక్యరాజ్యసమితి ఆవరణలో యోగాకార్యక్రమాలు నిర్వహించబోవడం మరింత హర్షణీయం. ఆరోగ్యానికి బాటలువేసే సహజమార్గమైన యోగాని జనబాహుళ్యంలోకిప్రాచుర్యంలోకితీసుకురావడం, అవగాహన కలిగించి ఆచరణ మార్గంపట్టించడం దేహానికి, దేశానికి లాభదాయకమే. ఈ మధ్యనే ఐసిఎంఆర్ ఆధ్వర్యంలో జరిగిన ఒక పరిశోధన ప్రకారం దేశంలో చక్కెరవ్యాధి, రక్తపోటు, స్థూలకాయం జీవన శైలివ్యాధులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. రానున్న ఐదేళ్లలో 13 కోట్ల మంది కొత్తగా చక్కెర వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగాఉన్నాయి. ఇప్పటికే దేశం ఈ వ్యాధికి ప్రపంచ రాజధానిగా తయారైంది. కాబట్టి వెంటనే మేలుకుంటే ప్రమాద తీవ్రతను తగ్గించొచ్చు. స్కూల్ దశ నుండే మంచి జీవన శైలి అలవడితే దేహానికి, దేశానికి లాభం.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### ఉద్యోగ రంగాల పట్ల దృష్టి సారించాలి

తెలంగాణ రాష్ట్రదశాబ్ది వేడుకలో భాగంగా జూన్ 20న విద్యా దినోత్సవాన్ని జరిపింది. గత 9 సంవత్సరాలుగా విద్యావ్యవస్థ గాడి తప్పింది. గురుకుల పేరుతో హంగామా చేస్తున్న ప్రభుత్వం ప్రభుత్వబడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోలేదు. గత సంవత్సరం నుండి మన ఊరు, మన బడి పేరుతో కొంతమార్పు చేస్తున్నట్టు ప్రచారాలు చేస్తున్నారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, బట్టలు ఇవ్వలేదు. విద్యార్థులకు సరిపడా టీచర్లను నియమించలేదు. ఉన్న విద్య వలంటీర్లను తొలగించారు. క్రమంతప్పకుండా టెట్ డీఎస్సీ నోటిఫికేషన్లు జారీచేయాలని నిబంధనలు ఉన్నగత 9 సంవత్సరాలుగా ఈ నోటిఫికేషన్స్‌పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. ప్రభుత్వంఇప్పటికైనావిద్య,ఉద్యోగరంగాలపట్లదృష్టి సారించాలి.

-రావుల రామ్మోహన్‌రెడ్డి, హైదరాబాద్

### పెరుగుతున్న నేరాలు

నేరాలు, హత్యలురోజురోజుకి పెరిగిపోతున్నాయి. తమకి, తమ కుటుంబానికి అన్యాయంచేశారనే కారణం వల్ల, ప్రేమవ్యవహారాలవల్ల హత్యలు చేసి జైళ్లలో మగ్గిపోతున్నారు. తమను పోలీసులు పట్టుకోరనే భావనతో హత్యలు చేస్తూ ఉండవచ్చు. కానీ సెల్‌ఫోన్ లొకేషన్, సిసికెమెరాల సహాయంతో పోలీసులు సులభంగా పట్టుకుంటారనే విషయాన్ని గుర్తించి హత్య అనే ఆలోచన రాకుండా బతకడం మంచిది.

-ఎస్.కె. యాకుబ్‌పాషా, ఖమ్మం

# ఏరువాక సాగేదెలా! సాగునీరు పారేదెలా?

**ఈ యేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. తొలకరి వర్షం పడిన వెంటనే విత్తనాలు వేసుకోవచ్చని ఎదురుచూస్తున్న రైతులకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. వర్షాలు ఆలస్యంగా పడితే పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోతే సరైన దిగుబడి రాక రైతన్నలు నట్టేట మునిగే ప్రమాదం ఉంది. ఏదేమైనప్పటికీప్రకృతి రైతులపై కన్నెర్ర చేయడంతో ఆందోళన పరిస్థితి నెలకొంది. జూన్ నెల చివరికి వచ్చినా నేటికీ పగలంతా ఎండకాలంలా విపరీతమైన ఎండలు, వడగాల్పులు వీస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు పొలాలకు ముందుగానే కౌలు చెల్లించారు. సకాలం లో వర్షాలు రాకపోతే సరైన పంటలు రాక పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలోనని కౌలు రైతులు చర్చించుకుంటున్నారు.**



డా.సంగని మల్లేశ్వర్

దేశవ్యాప్తంగా ఎండ తీవ్రత కొనసాగుతూనే ఉంది. వడగాల్పులు వీస్తున్నాయి. తెలంగాణలో చుక్కవర్షం లేక రైతులు అల్లాడిపోతున్నారు. రోహిణికార్తెలో పడుతాయనుకున్న వర్షాలు మృగశిరకార్తె ముగిసినా చినుకు జాడలేదు. వర్షం చుక్క కోసం జనం ఆకాశంవైపు ఆశగా చూస్తున్నారు. జూన్‌లో జోరుగా పడాల్సిన వానలు నెలాఖరొచ్చినా కరుణించడం లేదు. రుతుపవనాలు వచ్చాయని ఆశపడుతున్న అన్నదాతలకు అన్నమో రామచంద్రా అనేంత పని చేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో అక్కడక్కడా కురిసిన వర్షాలు ఆ తరువాత జాడలేకుండా పోయాయి. వేడి గాలులతో ఎండలు తీవ్రంగా కొడుతున్నాయి. కొంత మెత్తబడే వరకు రైతులు కొన్ని చోట్ల బాయిలకాడా నార్లుపోసుకున్నారు. పత్తి విత్తనం నాటినారు. మొలకెత్తక, ముఖం చాటేస్తున్న మేఘం రైతులను నిలువునా కుంగదీస్తోంది. అనేక ప్రాంతాల్లో వేసవి వాతావరణం సాయంత్రం ఏడుగంటలు అయినా పొద్దుకుక్కడం లేదు. సాధారణంగా నైరుతి సీజన్‌లో ఖరీఫ్ పనుల ప్రారంభానికిజూన్‌లో కురిసే వర్షాలు ఎంతో కీలకం. అటువంటిది ఆరుద్రకార్తె వచ్చే వరకు కూడా దేశవ్యాప్తంగా 159 మి.మీ వర్షపాతానికి కేవలం 104.3 మి.మీ. (34మిమీ లోటు) మాత్రమే నమోదైంది. సాధారణం కంటే దక్షిణాదిన 30.మి.మీ మధ్యభారతంలో 36.మి.మీ వాయవ్య భారతంలో 34 మి.మీ తూర్పు ఈశాన్య భారతంలో 35.మి.మీ తక్కువ వర్షం కురిసింది. దేశంలో ఒక్క తూర్పు రాజస్థాన్, జమ్మూకాశ్మీర్‌లో మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. విదర్భలో 74 శాతం, తూర్పు మధ్యప్రదేశ్‌లో 66, జార్ఖండ్‌లో 60, ఢిల్లీ,పశ్చిమ యూపీలో 62 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతన్నలను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ముందస్తు పంటలకు సిద్ధం కావాలన్న తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు సిద్ధం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఖరీఫ్‌కు జూన్‌లో వర్షాలే కీలకం. తెలంగాణలో కొన్ని చోట్ల అసలు వర్షమే లేకపోవడంతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టక గందరగోళంలో పడ్డారు. దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావం కొనసాగింది. రుతుపవనాలొచ్చినా కనుకరించని మేఘాల వల్ల దిగులుగా చినుకు జాడకోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఈ యేడాది రుతుపవనాలు సాధారణం కంటే వారం ఆలస్యంగా జూన్‌లో కేరళను తాకాయి. ఆ తర్వాత అరేబియా సముద్రంలో ఏర్పడిన తుఫాను రుతుపవనాల విస్తరణకు అడ్డంకిగా మారడంతోపాటు అటు అరేబియా సముద్రం, ఇటు భూ ఉపరితలంపై తేమను దొంగిలించింది. ఆ తరువాత రుతుపవనాలు పుంజుకున్నా ఆశించిన వర్షాన్ని ఇవ్వలేదు. దక్షిణాది మొత్తానికి రుతుపవనాలు విస్తరించాయని చెప్పడమే తప్ప చినుకు కురిసిన దాఖలాలు మచ్చుకు కూడా కనిపించలేదు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీని రుతుపవనాలు తాకాల్సి ఉండగా జాప్యం అవుతుంది. శాస్త్రవేత్తలకైతే అంతుపట్టడం లేదు. మరో నాలుగైదు రోజులు పడుతుందని జ్యోతిష్యం చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో దుర్భిక్షంగామారింది. రెండు రాష్ట్రాల్లో చూసుకుంటే తెలంగాణలో ఈ సీజన్‌లో నిన్నటి



వరకు ఎపిలో సాధారణం కంటే 31 శాతం, తెలంగాణలో 37 శాతం లోటు వర్షపాతం నమోదైంది.ఎండల కారణంగా వ్యవసాయంతోపాటు నడుస్తున్న ఎసిలకు, ఫ్యాన్‌లకు కరెంట్ బిల్లులు కట్టలేక జనం గగ్గోలు పెడుతున్నారు. బిపర్‌జోయ్ తుఫానులు ప్రతిబంధకాలుగా మారాయి. మండుతున్న ఎండలను చూసి కాలు బయట పెట్టలేని పరిస్థితి. జాడలేని రుతుపవనాలతో తెలంగాణలోని కోల్‌బెల్ట్ ఏరియా నిప్పుల కొలిమిలా మండుతోంది. జూన్ చివరివారంలో దడపుట్టిస్తున్న ఎండలు, వడగాల్పులు మరో మూడు రోజులు కొనసాగనున్నాయి. వర్షం ఎప్పుడు పడుతుందా అని ఆకాశం వైపు చూస్తున్నారు. కదలని నైరుతి, 'తొలకరి పలకరింపు' మరింత ఆలస్యం అవుతుందనే భావంతో రైతన్నలు డీలా పడిపోయారు. సాధారణంగా ప్రతి యేడాది తొలకరి చినుకులు కురిసినవెంటనే రైతన్నలు తమ పొలాల్లో విత్తనాలను వేసుకొని పంటల సాగులో నిమగ్నమయ్యేవారు. ఈ యేడాదికూడా తొలకరి వర్షాలు వస్తాయని వేసవిలో రైతులు పొలాలను దుక్కులు దున్ని, గతంలో వేసిన పంట వ్యర్థాలను తీసివేశారు. పొలాలను సేద్యాలు చేసుకొని సాగుకు సిద్ధం చేసి తొలకరి వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగు కోసం వేసవిలోనే పొలాలను సిద్ధం చేసుకుని తొలకరి చినుకులు కురిసిన వెంటనే పలు రకాల విత్తనాలు వేసే విధంగా గత మే నెలలో కురిసిన వర్షాల కారణం గా రైతన్నలు తమ పొలాలను సిద్ధం చేసి తొలకరి చినుకులు పడిన వెంటనే విత్తనాలు వేయాలన్న సంకల్పంతో ఇప్పటికే విత్తనాలను కూడా అప్పులు చేసి తెచ్చి పెట్టుకున్నారు. అయితే ఆదిలోనే వర్షాలు లేక రైతన్నకు కష్టాలు మొదలయ్యాయి. గత సంవత్సరం ఈ సమయం కల్లా మండలంలో రైతులు విత్తనాలు వేయడంతోపాటు మొలకలు కూడా వచ్చి వ్యవసాయ పనుల్లో బిజీగా గడుపుతూ ఉన్నారు. ఈ యేడాది మాత్రం ప్రతిరోజు సాయంత్రం సమయంలో మేఘాలు ఊరిస్తూ, వీస్తున్న గాలులకు రైతన్నలు వర్షాలు పడుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎంతకు వాతావరణంలో మార్పులు అగుపడకపోయే సరికి నిరాశ చెందుతున్నారు. ఈ యేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. తొలకరి వర్షం పడిన వెంటనే విత్తనాలు వేసుకోవచ్చని ఎదురుచూస్తున్న రైతులకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. వర్షాలు ఆలస్యంగా పడితే పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోతే సరైన దిగుబడి రాక రైతన్నలు నట్టేట మునిగే ప్రమాదం ఉంది. ఏదేమైనప్పటికీప్రకృతి రైతులపై కన్నెర్ర చేయడంతో ఆందోళన పరిస్థితి నెలకొంది. జూన్ నెల చివరికి వచ్చినా నేటికీ పగలంతా ఎండకాలంలా విపరీతమైన ఎండలు, వడగాల్పులు వీస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు పొలాలకు ముందుగానే కౌలు చెల్లించారు. సకాలంలో వర్షాలు రాకపోతే సరైన పంటలు రాక పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలోనని కౌలు రైతులు చర్చించుకుంటున్నారు. తొలకరి పలకరింపు లేక రాష్ట్రంలో కొనసాగుతున్న గ్రీష్మతాపం తొలకరి కోసం రైతుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. గతనెలలో కురిసిన వర్షాలతో తొలకరి సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్ని చోట్ల విత్తనం, మరికొన్ని చోట్ల దుక్కులు దున్ని ఎదురు చూస్తున్నారు. ఈనెల చివరి వారంలో రుతుపవనాల గమనంపై స్పష్టత రానుంది. గతంలో ఈదురు గాలులు, అకాల వర్షాలు, వడగండ్ల జడివానలతో నష్టపోయిన రైతన్నలను ముందుగా ప్రిపేర్ చేస్తే రోహిణికార్తె, మృగశిర కార్తెలో ఫలితం లేకుండాపోయింది. 30 రోజులు గడిచినా తొలకరి జల్లుల జాడ కనిపించడం లేదు. మృగశిరకార్తెలో కూడా ఎండలు మండే పరిస్థితి ఈ సంవత్సరం కనిపిస్తుంది. పూర్వం కప్పలకి పెళ్లి చేసి ఊరంతా ఊరేగింపుగా ఊరేగిస్తే వర్షాలు కురిసేవనీ, ఏపి కొత్తపేట మండలంలో కప్పలకు పెళ్లి చేసినట్లు చెప్తున్నారు. భానుడు శాంతించాలి. నైరుతి రుతుపవనాలు త్వరగా రావాలని పూజలు నిర్వహిస్తున్నారు. ●

# చైనాకు రష్యా, ఉత్తరకొరియా తోడ్పాటు

కనుమ ఎల్లారెడ్డి

ఏనాడూ చైనాకు రష్యాసహకారం ఇవ్వలేదు. ఉత్తర కొరియా అడపాదడపా మద్దతు ఇచ్చినా రష్యా దూరంగా ఉండేది. అయితే మారుతున్న పరిణామాల దృష్ట్యా చైనాకు రష్యాదగ్గర అవుతున్నట్లు కనపడుతోంది. ఇటీవల చైనా అధ్యక్షుడికి డెబ్బై ఏళ్ల నిండిన సందర్భంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేకంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు అందించారు. అయితే ఇది గతంలో లేదు. ఉక్రెయిన్‌తో యుద్ధం వచ్చినప్పటి నుంచి రష్యాను కొన్ని దేశాలు పక్కన పెట్టాయి. అది తెలిసే రష్యా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు దగ్గర కావాలని, చైనా, రష్యా నుంచి భాగస్వామ్యదేశాలుగా ఉండాలని ఒకరికొకరు తమ ప్రయత్నాలను ముమ్మరంచేశారు. ఈ దిశలో మాస్కో,బీజింగ్ మరింత దగ్గరగా వచ్చాయని మనస్నేహం పటిష్టంగా ఉంటుందని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఇందుకు చైనా అధ్యక్షుడు చేసే ప్రతి ప్రయత్నాన్ని పుతిన్ ప్రశంసించారు. జిన్‌పింగ్ చేసే కృషి వల్లనే మా మధ్యసయోధ్య పెరిగిందని ఒకరికొకరు నమ్మకంగా, విశ్వాసంగా ఉన్నామని వెల్లడించారు. సుదీర్ఘకాలం చైనాకు అధ్యక్షుడిగా వ్యవహరించడం రాజకీయ పరిణితి చెందిన నాయకునిగా అన్ని విషయాలలో ఆయనకు పట్టుఉందని ఓ బలమైన దేశం, మరో బలమైన దేశంతో సఖ్యతతో, సామరస్యంగా మెలగడం గొప్ప చర్యఅని జిన్‌పింగ్‌కు ఉన్నటువంటి ఆదరణ చైనాలో స్పష్టమైందని పుతిన్ వ్యాఖ్యానించారు. ఆయన సారథ్యంలో చైనా అన్ని రంగాల్లో పుంజుకుందని, ముఖ్యంగా పౌరుల జీవన ప్రమాణాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయని, విశ్వంలోబీజింగ్ స్థాయి, స్థానం బలపడుతోందని రష్యా అధ్యక్షుడు చెప్పడం గమనార్హం. రెండు దేశాల మధ్య సహకారం బలపడుతోందని ఇది ఆశించిన స్థాయిలో మరింత బలోపేతం కావాలని పుతిన్ వక్కాణించారు. పుతిన్ చైనా గురించి ఎన్నడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇప్పుడు చైనాతో సంబంధాలు బలపడడంతో ఆ దేశానికి దగ్గరకావాలని కాంక్షిస్తున్నారు. అదేవిధంగా జిన్‌పింగ్‌కు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జంగ్ ఉన్ కూడా డెబ్బైవ జన్మదిన శుభాకాంక్షలు అందించారు. కిమ్‌జింగ్ ఉన్ అసాంతం చైనా అధ్యక్షుడిని ప్రశంసలతో ముంచెత్తాడు. విశ్వవ్యాప్తంగా చైనా స్థానం దృఢతరంగా ఉందని ఒకేమహోత్తర శక్తివంతమైన నాయకత్వాన్ని ఆయన కొనసాగిస్తున్నారని చైనా ప్రపంచ దేశాలకు ఒక మార్గదర్శిగా ఉండగలదని, రాబోయే రోజుల్లో చైనా ఒక బలమైన స్థానం పొందగలదని తన సందేశంలో పేర్కొన్నాడు. అంతేగాక ఆయన ఒకే నిరంతర శ్రామికుడు ఉత్సాహవంతమైన ఆయన హయాంలో చైనా కమ్యూనిస్టు పార్టీ బలం పుంజుకుందని కిమ్ అభినందనలతో ముంచెత్తాడు. చైనా తన పరిధిని విస్తరించుకుంటుందని ఆ దేశంతో మా స్నేహం బలపడాలని కోరుకుంటున్నట్లు కిమ్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనేకాక అంతర్జాతీయపరంగా చైనా శక్తివంతమైన దేశంగా ఉందని, ఆ దేశంతో మాకు తోడ్పాటు, సహకారం సహాయం అవసరమని మీ నాయకత్వంలో చైనా అగ్రదేశంగా దూసుకుపోవాలని కిమ్ తన సందేశంలో పేర్కొన్నారు. అందుకు సూచనగా కిమ్ చైనా అధ్యక్షునికి 'పూలు' పంపారు. పూలు పంపడంలో ఉద్దేశ్యం ఏమనగా చైనాకు ఇక ఎదురు ఉండదు. చైనాతో ఎల్లప్పుడూ మేము స్నేహితులుగానే ఉంటామని తెలుస్తోంది. ఈ మేరకు కొరియా వార్త సంస్థ కూడా చైనా అధ్యక్షుడి గురించి ఆయన నాయకత్వ పటిమను వెల్లడించింది. జిన్‌పింగ్ పుట్టిన రోజు సందర్భంగా వైట్‌హౌస్ కాని, భారతదేశం కానీ ఏమాత్రం స్పందించలేదు. రష్యా, చైనా స్నేహం భారత్ గమనిస్తోంది. భారత్‌తో స్నేహాన్ని రష్యా ఎప్పుడూ వదులుకోదు. అది రష్యాకు కూడా తెలుసు. అయితే చైనా దృక్పథం వేరు. ఆసియా ఖండంలో భారత్ ప్రాభవాన్ని తగ్గించాలని చైనా తలుస్తోంది. అందు నిమిత్తమే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు రావాల్సిన శాశ్వత స్థానానికి ప్రధాన అడ్డంకి చైనాయే. ఒకదశలో అమెరికా ఒప్పుకున్నా వీటోఅధికారంతో చైనా తన పవర్ చూపిస్తుంది. భారత్ అంటేనే చైనాకు గిట్టదు. అదే విధంగా ఉత్తరకొరియాకు కూడా భారత్‌తో సరైన సంబంధాలు లేవు. ఆసియా ఖండంలో ఈ మూడు దేశాలు ఉన్నా చైనా, ఉత్తరకొరియా ఎప్పుడూ భారత్‌కు వ్యతిరేకమే. ఇప్పుడు చైనాకు అండగా రష్యా చేరడంతో చైనాకు కొత్త ఊపు వచ్చినట్లు అయింది. రష్యాను దగ్గరకు తీసుకుంటే అమెరికాను ఏకాకి చేయవచ్చని చైనా ఆలోచనగా ఉంది. కాని అది అంత సులభంకాదు. ప్రపంచంలోనే అత్యంత బలవంతమైన దేశం అమెరికా. విశ్వంలో అన్నిదేశాలు ఏకమైనా, అమెరికా చెక్కు చెదరదు. అందుకే చైనా, రష్యా, ఉత్తరకొరియా, దేశాల తోడ్పాటు కోరుకుంటోంది. చైనా, రష్యా బంధం ఎన్నాళ్లు ఉంటుందో తెలియదు. పుతిన్‌కు జిన్‌పింగ్ వైఖరి తెలుసు. గతంలో భారత్‌తో చేసుకున్న పంచశీల ఒప్పందానికి తూట్లు పొడిచిన సంగతి కూడా పుతిన్‌కు అవగతమే. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ రష్యా భారత్‌ను విడువదు. భారత్‌తో స్నేహ భగ్నం కావాలని జిన్‌పింగ్ ఆలోచన ఉండొచ్చు. అయితే అదంతా అనుకున్నట్లుగా జరగదు. ●

# రోడ్డు ప్రమాదాలను నియంత్రించలేమా?

డి.జె.మోహనరావు

ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ప్రయాణించాలంటే తన కాళ్లనే నమ్ముకున్న మనిషి చక్రం ఆవిష్కరణతో సులువుగా, వేగంగా, సుఖవంతంగా తన గమ్యాన్ని చేరుకునే క్రమంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని వ్యక్తిగత ప్రయాణం కోసం బస్సులు, కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు, సరుకు రవాణా కోసం లారీలు, లగేజీ వ్యాన్లు, మొదలైన వాటిని ఉపయోగించే స్థితికి చేరుకోవడానికి ఎన్నో యేళ్లు పట్టింది. దీనికిగాను ఇరుకు రహదారుల నుండి విశాలమైన రహదారులను నిర్మాణం చేసుకొన్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు అందరూ వివిధ అవసరాల కోసం ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో ఎక్కువ ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయి. మనదేశంలో ప్రతి రోజూ ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇందులో స్వల్పమైన గాయాలతో గట్టెక్కిన వారు కొందరు తీవ్ర గాయాలతో శరీరంలోని కొన్ని భాగాలను కోల్పోయిన వారు మరికొందరు కాగా చాలా మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు. కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీవారి 2022-23 సంవత్సరం విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ద్విచక్ర వాహనాలు, కార్లు,జీపులు,టాక్సీలు, బస్సులు, సరుకు రవాణా చేసేలారీలు, టిప్పర్లు మొదలైనవి ఇతర వాహనాలతో మొత్తంకలిపి 2003వ సంవత్సరంలో 67,007 ఉండగా 2020వ సంవత్సరానికి 3,26,299 వాహనాలు రిజిస్టర్ కాబడి ఉన్నాయి. జాతీయ రహదారులు,రాష్ట్ర రహదారులు, జిల్లా, ఇతర రహదారులతో కలిపి సుమారు 63.32లక్షల కిలో మీటర్ల పొడవు కలిగి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రోడ్లు కలిగి ఉన్నది మన భారతదేశం. 2005 సంవత్సరంలో జరిగిన 4,39,255రోడ్డు ప్రమాదాలలో 4,65,282 మందిగాయపడగా, 94,968 మంది మరణించారు. అదే 2021 సంవత్సరం వచ్చేసరికి మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలలో 3,84,448 మంది గాయపడగా,1,53,972 మంది చనిపోయారని ఈ నివేదిక పేర్కొంది. ఇందులో 1,28,825 (31.2శాతం) ప్రమాదాలు జాతీయ రహదారులలో 96,382 (23.4శాతం) ప్రమాదాలు రాష్ట్ర రహదారుల్లో 1,87,225 (45.4) ప్రమాదాలు మిగిలిన రహదారుల్లో జరుగుతున్నాయి. ఇక మరణాల విషయం చూస్తే 35.8 శాతం జాతీయరహదారులపై 24.6శాతం రాష్ట్ర రహదారులపై 39.6 శాతం ఇతర రోడ్లపై జరుగుతున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో అత్యధికంగా జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని కేంద్ర మంత్రిత్వశాఖ నివేదిక బట్టి తెలుస్తుంది. దురదృష్టకరం ఏమిటంటే మొత్తం మరణాల్లో 67 శాతం మంది 15సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య



వయస్సు కలిగినవారే ఉన్నారు. 2020 సంవత్సరంలో 36 శాతంగా ఉన్న మరణాలు 2021 సంవత్సరంలో 37.3 శాతంగా పెరగడం ఆందోళన కలుగచేస్తుంది. 2022 డిసెంబరులో విడుదల చేసిన నివేదిక ముందుమాటలో తెలిపిన సమాచారం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మరణించిన ప్రతి మందిలో ఒక్కరు భారతీయుడే ఉంటున్నారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, అవయవాలను కోల్పోయిన, మరణించిన వారి కుటుంబాలకు నష్టం వాటిల్లడమే కాకుండా,దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడడం వలన అభివృద్ధి కొంత మేర క్షీణించే ప్రమాదం ఉంది. ప్రధానమైన కారణం వాహనాలు అతివేగంగా నడపడం. కార్లలో సీటుబెల్టు పెట్టుకోకపోవడం, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, మద్యంతాగి వాహనాలు నడపడం, లారీలను క్లీనర్లు డ్రైవ్‌చేయడం, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడపడం, ఇయర్‌ఫోన్లు లేదా బ్లూటూత్‌లు ధరించి వాహనాలు డ్రైవ్ చేయడం, కాలం చెల్లిన, భద్రతా ప్రమాణాలు లేని వాహనాలలో ప్రయాణం చేయడం. ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, కండిషన్ లేని వాహనాల్లో ప్రయాణం, అర్ధరాత్రి దాటిన తరువాత కూడా నడపడం,డ్రైవర్లు పూర్తిస్థాయిలో నిద్రపోకపోవడం, ట్రాఫిక్ చిహ్నాలపై అవగాహన లేకపోవడం, రోడ్లపై నోపార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపడం, జంక్షన్లలో సిగ్నల్స్ పాటించకపోవడం, డ్రగ్స్‌తీసుకొని వాహనాలు నడపడం, కార్, బైక్‌లతో రేసింగ్‌లలో పాల్గొనడం, వయసు మళ్లిన వారు డ్రైవ్ చేయడం మొదలైన కారణాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్నో చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా మోటార్ వెహికల్ చట్టం (సవరణ) 2019 చట్టాన్ని తీసుకువచ్చింది. అలాగే జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా ఏ ప్రదేశాలలో జరుగుతున్నాయో గుర్తించి ఐఆర్‌ఎడి ఇడిఎఆర్‌ల సహాయంతో అంతర్జాతీయస్థాయి పద్ధతులతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడుపరాదు. మద్యతాగి డ్రైవింగ్ చేయరాదు. ఎప్పటికప్పుడు వాహనాల ఇంజన్లను తనిఖీలు చేయించుకోవాలి. కార్లలో సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి. అర్ధరాత్రి తరువాత వాహనాలు నడుపరాదు. ట్రాఫిక్ రూల్స్‌ని పాటించాలి. రాంగ్‌రూట్‌లో వెళ్లరాదు. మలుపుల దగ్గర నిదానంగా వెళ్లాలి. ఎప్పటికప్పుడు కళ్లను పరీక్షించుకోవాలి. రాత్రిపూటపార్కింగ్ దగ్గర మాత్రమే వాహనాలు ఆపాలి. వాహనాలను ఓవర్టేక్ చేయవలసి వస్తే జాగ్రత్తగా నడపాలి. జీబ్రా క్రాసింగ్‌ల దగ్గర, పాఠశాల దగ్గర, జనసమూహం ఎక్కువగా ఉన్న దగ్గర నెమ్మదిగా వెళ్లవలెను. మైనర్లు డ్రైవింగ్ చేయకూడదు. యువకులు రేస్ల జోలికి పోకూడదు. ట్రాఫిక్ చిహ్నాలపై అవగాహన పెంచుకోవాలి. లారీలను లైసెన్స్‌లేని వారు నడుపరాదు. ద్విచక్రవాహదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు. వీటిని అతిక్రమించిన వారిపై సంబంధిత అధికారులు చర్యలుతీసుకోవాలి. పెద్దపెద్ద ప్రమాదాలు జరగడానికి కారణమయ్యేవారిపై కేసులుపెట్టి వారి లైసెన్సులు రద్దు చేయాలి. పాదచారులుకూడా రోడ్డుపై నడిచేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ●

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

21-06Pg5exR:Layout 1 21/06/23 11:29 PM Page 1



# బంతి అనుకుని బాంబ్‌తో ఆట.. చిన్నారులకు గాయాలు!



**కోల్‌కతా, జూన్20:** పిల్లలు బంతితో ఆటాడుకుంటుండగా బాంబు పేలి ఐదుగురు చిన్నారులు గాయపడ్డారు. అయితే బంతి అనుకుని బాంబుతో ఆటలాడుతుండగా పేలుడు సంభవించింది. ఈ షాకింగ్ ఘటన పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఇమామ్‌నగర్‌లోని ఓ మామిడి తోటలో ఆడుకోవడానికి పిల్లలు వెళ్లారు. వారికి అక్కడ బంతి ఆకారంలో ఉన్న ఓ వస్తువు దొరికిందని, దానితో ఆటలాడుతుండగా బాంబుపేలిందని చెప్పారు. దీంతో ఐదుగురు చిన్నారులకు గాయాలయ్యాయని తెలిపారు. తక్షణమే చిన్నారులను చికిత్స కోసం బెనియాగ్రామ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటన గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరక్కా పోలీస్ స్టేషన్ అధికారి దేబబ్రత చక్రవర్తి ఆధ్వర్యంలో పోలీస్ బృందం ఘటనా స్థలిలో క్షుణ్ణంగా పరిశీలించింది. ఇదిలాఉండగా, బాంబు పేలుడు ఘటనతో మమతా బెనర్జీ ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఆటస్థలంలో బాంబు పేలుడు ఘటనతో రాష్ట్రంలో శాంతి భద్రతల్లో డొల్లతనం మరోసారి రుజువైందని విపక్షాలు మండిపడుతున్నాయి. బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ వేళ పలు ప్రాంతాల్లో బాంబులు, రాళ్ల దాడుల వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల అల్లర్లు జరిగిన దక్షిణ 24 పరగణాల్లో పర్యటించిన బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్‌బోస్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల విషయమై టిఎంసి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

# జెఇ అమీర్ ఖాన్ ఇంటికి సీలు వేసిన సిబిఐ

## ఇంట్లో సోదాలు, రహస్యంగా విచారణ

## దుర్ఘటన వెనుక కుట్ర ఉందని ఆధారాలు సేకరించిన సిబిఐ?

## ఒడిశా బహనాగా రైలు దుర్ఘటన

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఒడిషాలోని బాలాసోర్ జిల్లా బహనాగా రైలు దుర్ఘటనలో మరో కీలక పరిణామం చోటు చేసు కుంది. ఈ కేసును విచారిస్తున్న సిబిఐ అధికారులు బహనాగా వద్ద గల బాలేశ్వర్ సిగ్నల్ జేఈ అమీర్ ఖాన్ ఇంటికి సీలు వేయడంతో పాటు అతని ఇంట్లో సో దాలు చేబట్టి రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ దుర్ఘటన వెనుక కుట్ర కోణం వుందని మొదటి నుంచి రైల్వే శాఖ అనుమానిస్తున్నట్లుగానే దీనికి సంబంధించి సిబిఐకి కీలక ఆధారాలు లభించాయని సమాచారం.

ఈ నెల రెండవ తేదీన జరిగిన బహనాగా రైలు దుర్ఘటన 292మంది ప్రయాణీకులను బలిగొనడం తెలిసిందే. హౌరా నుంచి చెన్నై వస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు బహనాగా స్టేషన్‌లో వున్నట్లుండి లూప్ లైన్‌లో ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొనడం విదితమే. ఈ ఘటనలో 1200 మంది వరకు గాయపడ్డారు.

ఈ ఘటనలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకో పైలట్ గుణనిధి మహంతి తీవ్రంగా గాయపడి కోలుకోగా అతన్ని కలిసేందుకు కుటుంబ సభ్యులకు ఇప్పటి వరకు అనుమతి ఇవ్వక పోవడం ట్విస్ట్‌గా చెప్పాలి. ఈ ఘటనపై మొదట రైల్వే సేఫ్టీ కమిషనర్ విచారించి సిగ్నల్ టాంపరింగ్ వల్ల కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు అనూహ్యంగా లూప్‌లైన్‌లో దూసుకుపోయి గూడ్స్ రైలును ఢీకొందని తేల్చింది. ఇందులో కోరమాండల్ ఎక్స్ ప్రెస్ రైలు లోకో పైలట్ తప్పిదం లేదని కూడా అధికారులు తేల్చారు. అనంతరం ఈ ఘటనపై రైల్వేశాఖ సిబిఐ విచారణకు కోరగా కేంద్రం ఆ మేరకు ఆదేశాలు ఇచ్చింది. దీనిపై సిబిఐ జూన్ ఆరవ తేదీన సిబిఐ విచారణ మొదలవగా రెండువారాలుగా సాగుతున్న ఈ దర్యాప్తులో సోమవారం నాడు అనూహ్యఘటన చోటుచేసుకుంది. బహనాగా స్టేషన్ సమీపంలోని బాలేశ్వర్‌లో జూనియర్ సిగ్నల్ ఇంజినీర్ (జేఈ) అమీర్ ఖాన్ ఇంటికి సిబిఐ అధికారులు సీల్ వేశారు. రైల్వేలో జేఈ స్థాయిలో పనిచేసే ఇంజినీర్లు పాయింట్ మిషిన్లు, ఇంటర్ లాకిం సిస్టమ్స్‌లు, సిగ్నల్‌లతో సహా సిగ్నలింగ్ పరికరాల ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన విధులు నిర్వహిస్తారు.

రైళ్లు ఒకచోటు నుంచి మరోచోటుకు సాఫీగా వెళ్లేందుకు ఇవే కీలకపాత్ర వహిస్తాయి. ఇంతటి కీలక పాత్రలో వుండే జేఈ అమీర్ ఖాన్ ఇంటిని సిబిఐ అధికారులు సీలు వేయడంతో పాటు అతని ఇంట్లో అతని సమక్షంలోనే సోదాలు నిర్వహించడం కల కలం రేపింది. బహనాగా దుర్ఘటనకు ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టం తారుమారు చేయడం ప్రధాన కారణంగా తేలడంతో ఇందులో అమీర్‌ఖాన్ పాత్ర వుందని సిబిఐకి ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే జేఈ అమీర్‌ఖాన్ ఇంట్లో సోదాలు నిర్వహించి, అతని ఇంటికి సీల్ వేసిన అధికారులు అతడిని రహస్య ప్రాంతంలో సుదీర్ఘంగా విచారించారు. అమీర్ ఖాన్‌ను విచారించిన సిబిఐ అధికారులు ఇదే సమయంలో సోరోలోని తెంటెయ్ ఛక్ అనే ప్రాంతంలో వున్న బాలేశ్వర్ బహనాగా స్టేషన్ మాస్టర్ ఇంటిని సైతం సిబిఐ అధికారులు తనిఖీ చేశారు.



# వైభవంగా జగన్నాధుడి రథయాత్ర

## 10 లక్షలకు పైగా భక్తులతో కిటకిట

## ఢిల్లీలో జగన్నాథ ఆలయంలో రాష్ట్రపతి ముర్ము ప్రార్థనలు

## ప్రజలకు ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఒడిశా సిఎం శుభాకాంక్షలు



**భువనేశ్వర్, జూన్ 20:** ప్రఖ్యాత జగన్నాథుని రథయాత్ర సందర్భంగా పూరీ నగరం భక్తులతో కిటకిటలాడుతోంది. ఒడిశాతోపాటు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో శ్రీక్షేత్రం పరిసరాలతోపాటు అక్కడి వీధులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. 'జై జగన్నాథ' నినాదాలతో పూరీ నగరంలో మార్మోగుతోంది. మంగళవారం ఉదయం జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనుల విగ్రహాలను రథాలపై ప్రతిష్ఠించి తర్వాత మంగళ హారతి చేపట్టారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ రథాలపై చెరాపహర (బంగారు చీపురుతో ఊడ్చడం) చేశారు. మూడు గంటల నుంచి భక్తులు లాగుతున్నారు. సాయంత్రం రథాలు గుండిచా మందిరానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని భావిస్తున్నట్లు శ్రీ జగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యపరిపాలనా అధికారి రంజన్ కుమార్‌దాస్ తెలిపారు. బలభద్ర, సుభద్ర, శ్రీ జగన్నాథుడి విగ్రహాలను శ్రీ గుండిచ ఆలయం వరకు రథయాత్రతో తోడ్కొని వెళతారు. 12వ శతాబ్దం నాటి మందిరం ముందు ఉంచుతారు. భక్తుల ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో 80 ప్లాటూన్ల బలగాలను మోహరించారు. సాగరతీరం కావడంతో తీరంలో కోస్ట్‌గార్డ్‌కు చెందిన హెలికాప్టర్ సైతం గస్తీ నిర్వహిస్తోంది. పూరీ రథయాత్ర నేపథ్యంలో 125 ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడుపుతోంది. ఇదిలా ఉండగా పూరీ రథయాత్ర ప్రారంభానికి ముందు ఢిల్లీలోని హౌజ్‌కాస్‌లో ఉన్న జగన్నాథ్ మందిరం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రార్థనలు నిర్వహించారు. పూరీ రథయాత్ర సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ పవిత్రఉత్సవాన్ని జరుపుకున్నంటున్న వేళ జగన్నాథస్వామి మన జీవితాలను ఆరోగ్యం, సంతోషం, ఆధ్మాతిక భావనలతో నిండుగా ఉంచాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. అంతేగాకుండా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ సైతం ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ పూరీ చేరుకున్నారు. పూరీ శంకరాచార్యస్వామి అయిన నిశ్చలానంద సరస్వతి ఆశీర్వాదం తీసుకున్నారు. **ఇంటి బాల్కనీ కూలిపోయి ఒకరు మృతి , ఐదుగరికి గాయాలు:** అహ్మదాబాద్‌లో జగన్నాథ రథయాత్ర ఊరేగింపును వీక్షించడానికి ఓఇంటి బాల్కనీలో చాలామంది గుమిగూడటంలో అది కూలిపోయిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. అలాగేజార్ఖండ్‌లోని హజారిబాగ్‌లో రథయాత్ర సందర్భంగా పిడుగు పడడంతో 9 మంది గాయపడ్డారు.

# గుజరాత్, రాజస్థాన్‌లో బిపర్జాయ్ తుఫానువల్ల భారీ నష్టం



**గాంధీనగర్, జూన్20:** బిపర్‌జాయ్ తుఫాను వాయుగుండంగా మారడంతో గుజరాత్, రాజస్థాన్‌ల్లోని పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిసాయి. గుజరాత్ బనస్కాంత జిల్లా ధనేరా తాలూకాలో వరదలు సంభవించాయని అధికారులు తెలిపారు. 20 వరకు పశువులు కొట్టుకుపోయాయన్నారు. వచ్చే రెండు రోజుల్లో సౌరాష్ట్ర ప్రాంతంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ పేర్కొంది. అదేవిధంగా, రాజస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో గత రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. సంబంధిత ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే 15 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాలి, సిరోహి, బర్మేర్, జలోర్ జిల్లాల్లో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న 265 మందిని యంత్రాంగం కాపాడింది. అజ్మేర్‌లో కురిసిన వానకు స్థానిక జెఎల్ఎన్ ఆసుపత్రిలోకి వరద ప్రవేశించింది. 18 మంది రోగులను ఇతర వార్డులకు అధికారులు తరలించారు. రాజస్తాన్ మీదుగా ఏర్పడిన అల్పపీడనం బుధవారం కల్లా బలహీనపడుతుందని ఐఎండి తెలిపింది. అస్సాంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో పంటపొలాలు, గ్రామాలు, పట్టణాలు నీటి ముంపునకుగురయ్యాయి. లఃంపూర్‌లోని 25,200 మంది సహా మొత్తం 33,400 మంది వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాష్ట్రంలో మరో రెండు రోజులు అతి భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. తమిళనాడు రాజధాని చెన్నైలో భారీ వర్షాలు కురుస్తుండటంతో యంత్రాంగం పాఠశాలకు సెలవు ప్రకటించింది. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో పాటు చెట్లు విరిగి పడగటంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది.

# దేశంలో కరోనా తాజా కేసులు 36, మృతి ఒకరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్20:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 36 కేసులు నమోదయ్యాయి. మృతి ఒకరు. ఇప్పటి వరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,93,579 చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖవెల్లడించింది. మొత్తంబాధితుల్లో ఇప్పటివరకు 4,44,59,838 మంది కోలుకోగా 1844మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,31,897 చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనాపాజిటివ్ కేసులసంఖ్య 81,69,679కిచేరగా, 80,20,986మంది వరకు కోలుకున్నారు. 1,48,553మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటివ్ కేసులసంఖ్య69,06,878కి చేరింది. అందులో 68,33,834 మంది కోలుకున్నారు. 71,938 మంది మరణించారు.

# అభ్యర్థుల నేరచరిత్ర వెల్లడిలో రాజకీయ పార్టీలు విఫలం

## ఆ పార్టీలపై చర్యలు తీసుకోవాలని ఇసికి ఎఎఫ్‌డిఆర్ లేఖ




**న్యూఢిల్లీ, జూన్20:** అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్రకు సంబంధించిన విషయాలను వెల్లడించడంలో ఆయా రాజకీయ పార్టీలు విఫలమైనట్లు ఎన్నికల సంస్కరణల వేదిక అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పేర్కొంది. ఇలా విఫలమైన పార్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు ఇప్పటికే రాజకీయ పార్టీలను మందలించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. 2023 త్రిపుర, మేఘాలయా, నాగాలాండ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, పంజాబ్ ఎన్నికలు జరిగాయి. అంతకుముందు 2021లో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగింది. వాటిలో పోటీచేసిన అభ్యర్థుల నేర చరిత్రను వెల్లడించడంలో విఫలమైన ఆయా పార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఎడిఆర్ కోరింది. అటువంటివారి జాబితాను ఎన్నికల సంఘం తక్షణమే సుప్రీంకోర్టుకు తెలియజేయాలని కోరింది. వాటిపై చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలించాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు, తదనంతరం ఎన్నికల సంఘం విడుదల చేసిన నిబంధనల ప్రకారం, తమ అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు నేర స్వభావం గురించి రాష్ట్ర, జాతీయ స్థాయిలోని రాజకీయ పార్టీలు తమ వెబ్‌సైట్లో పొందుపరచాలి. అంతేకాకుండా అటువంటి వారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారు? అనే విషయాన్ని తెలియజేయడంతోపాటు నేరస్వభావం లేనివారిని ఎందుకు ఎంపిక చేసుకోలేదనే విషయాన్ని రాజకీయ పార్టీలు వెల్లడించాలి. ఈ క్రమంలోనే 2020లో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల నేర చరిత్రను వెల్లడించకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అందుకుగాను కోర్టు ధిక్కరణ కింద పది రాజకీయ పార్టీలకు భారీ జరిమానా విధించిన విషయం తెలిసిందే.

# మోడీ యుఎస్ పర్యటనపై చైనా అక్కసు



**బీజింగ్, జూన్ 20:** ప్రధాని మోడీ అమెరికా పర్యటనపై చైనా అక్కసు వెళ్లగక్కింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థ అమెరికాపై విమర్శలు గుప్పించింది. భారత్‌ను ఎగదోస్తోందని, బీజింగ్‌కు వ్యతిరేకంగా న్యూఢిల్లీని ఒక అడ్డుగోడలా వాడుకోవాలని వాషింగ్టన్ భావిస్తోందని తీవ్ర పదజాలం వాడింది. 'చైనా పురోగతిని అడ్డుకునేలా భారత్‌ను ఉసిగొల్పేందుకు అమెరికా ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. చైనాపై వేధింపులకు దిగుస్తోంది. చైనా దూకుడుకు అడ్డుగోడలా భారత్‌ను ఉపయోగించుకోవాలని అమెరికా చేస్తోన్న ప్రయత్నాలపై భారత్‌లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అమెరికా వేస్తోన్న భౌగోళిక రాజకీయ లెక్కలు విఫలమవు తున్నాయి. ఎందుకంటే ప్రపంచ సరఫరా గొలుసులో చైనా స్థానాన్ని భారత్‌తో పాటు మరే ఆర్థికవ్యవస్థ భర్తీ చేయలేదు. అమెరికా వేసే భౌగోళిక రాజకీయ లెక్కల్ని తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. చాలా మంది భారతీయ ప్రముఖులు భయపడుతున్నట్లుగా, ఢిల్లీతో ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి వాషింగ్టన్ చేస్తోన్న తీవ్ర ప్రయత్నాలు ప్రధానంగా చైనా ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీయడం కోసమే. ఆ రెండు దేశాలు ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనుకుంటే, చైనాను లక్ష్యంగా చేసుకోవడానికి బదులు ముందుగా రెండింటి మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలి' అని చైనా దౌత్యవేత్త వాంగ్ ఈ వాసుకొచ్చారు. అలాగే అమెరికా మాటలు మాత్రమే చెబు తుందని, వాటిలో దేనిని పాటించదని భారత్‌ను చైనా హెచ్చరించింది. చైనాను నియంత్రించేందుకు ఆ దేశం ఆడుతున్న ఆటలకు దూరంగా ఉండాలని కోరింది. చైనాతో ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని ప్రోత్సహించడం భారత వృద్ధికి ఎంతో ముఖ్యమని వ్యాఖ్యానించింది.

# టైటానిక్ శకలాలను చూసేందుకు వెళ్లి..బిలియనీర్ గల్లంతు!



**లండన్, జూన్ 20:** ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలోని జలగర్భంలో నిక్షిప్తమైన టైటానిక్ మహానౌక శకలాలను చూసేందుకు వెళ్లిన ఓ మినీ జలాంతర్గామి ఆచూకీ గల్లంతైంది. దీనిలో యుఎఇలో నివసించే బ్రిటన్‌కు చెందిన బిలియనీర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అడ్వెంచర్ టూరిజం చేయడం ఆయన హాబీ. ఈ ప్రమాదంతో అమెరికా, కెనడా రక్షణ బృందాలు అప్రమత్తమయ్యాయి. 22 అడుగుల పొడవున్న ఆ మినీ జలాంతర్గామి ఆచూకీ కనుగొనేందుకు ఇరు దేశాల కోస్ట్‌గార్డ్ బృందాలు కొన్ని వందల చదరపు కిలోమీటర్లలో గాలింపు చర్యలు చేపట్టాయి. దాదాపు 13వేల అడుగుల లోతున్న చోట ఆ మినీ జలాంతర్గామి చప్పుళ్లు వినేందుకు సోనార్లను జారవిడిచారు. ఈ మునిగిపోయిన జలాంతర్గామిలో మొత్తం ఐదుగురు ఉన్నట్లు రియర్ అడ్మిరల్ జాన్ ముగెర్ పేర్కొన్నారు. వారెవరనేది ఇంకా కచ్చితంగా గుర్తించలేదని పేర్కొన్నారు. అందులో ఉన్న వారిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. వారు యాత్రను మొదలుపెట్టిన 1.45 గంటల్లో కమ్యూనికేషన్‌ను కోల్పోయారని అమెరికా కోస్ట్‌గార్డ్ బృందం పేర్కొంది. పి-8నిఘా, సి-130 రవాణా విమానాలను కూడా రంగలోకి దించారు. వాణిజ్య నౌకలను కూడా గాలింపులో భాగస్వాములను చేశారు. మునిగిన ఆ జలాంతర్గామిలో ఇంకా 72గంటలకు సరిపడా ఆక్సిజన్ ఉన్నట్లు సమాచారం. 10,432 కిలోల బరువున్న జలాంతర్గామి 4వేల మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. ఈ మునిగిపోయిన మినీ జలాంతర్గామిలో బ్రిటన్‌కు చెందిన బిలియనీర్ హామీష్ హార్డింగ్ (58) కూడా ఉన్నట్లు ఆయన కంపెనీ యాక్షన్ ఏవియేషన్స్ ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ఆధారంగా తెలుస్తోంది. 'జలాంతర్గామి ఇప్పుడే బయల్దేరింది. హామీష్ విజయవంతంగా డైవింగ్ చేస్తున్నారు' అని దానిలో వెల్లడించింది. గతంలో హామీష్ ఈ భూమిపై ఉన్న సముద్ర గర్భాల్లో అత్యంత లోతైన ప్రదేశమైన పసిఫిక్‌లోని ది ఛాలెంజర్ డీప్'ను సందర్శించిన తొలి బృందంలో సభ్యుడిగా కూడా ఉన్నాడు. 2022లో బ్లూఆరిజిన్ స్పేసస్ ఫ్లైట్‌లో కూడా ఇతడు సభ్యుడు. ఈయన ఆస్తి సుమారు ఒక బిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. టైటానిక్ శకలాలు చూపించేలా ఓషన్ గేట్ అనే సంస్థ నిర్వహిస్తున్న ఈ యాత్ర టిక్కెట్ ధర 2.50 లక్షల డాలర్లు. ఈ యాత్రలో భాగంగా 400 మైళ్ల దూరం ప్రయాణిస్తారు. ఈ మినీ జలాంతర్గామిలో అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లున్నాయని ఓషన్ గేట్ కంపెనీ చెబుతోంది.

# ఆదిపురుష్‌ని బ్యాన్ చేయండి

## ప్రధానికి సినీ వర్కర్స్ అసోసియేషన్ లేఖ

**న్యూఢిల్లీ, జూన్20:** ఆదిపురుష్ విడుదలైనప్పటి నుంచి ఒకదాని తర్వాత మరొకటి వివాదాలు చుట్టముడుతూనే ఉన్నాయి. ఈ సినిమాను నిషేధించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీకి ఆల్ ఇండియన్ సినీ వర్కర్స్ అసోసియేషన్ లేఖ రాసింది. సినిమా స్క్రీన్‌ప్లే, అందులోని డైలాగులు రాముడు, హనుమంతుడి గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, వెంటనే సినిమాను నిలిపివేయాలని కోరింది. ఆదిపురుష్ సినిమా హిందువుల మనోభావాలను, సనాతన ధర్మాన్ని తీవ్రంగా దెబ్బతీసేలా ఉంది. శ్రీరాముడు అందరికి దేవుడు. ఈ సినిమాలోని డైలాగులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడిని బాధపెట్టేలా ఉన్నాయి అని లేఖలో పేర్కొన్నారు. దేవుళ్లను వీడియో గేమ్‌లలో పాత్రల్లా చిత్రీకరించారని మండిపడ్డారు. ఇంతటి అవమాన కరమైన చిత్రం భారతీయ సినిమా చరిత్రలో భాగం కాకూడదని సినీ ఆర్టిస్టుల అసోసియేషన్ చెప్పింది. శ్రీరాముడిపై, రామాయణంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని పూర్తిగా విధ్వంసం చేసేలా ఈ సినిమా ఉందని మండిపడింది. థియేటర్లలో సినిమా ప్రదర్శనను వెంటనే నిలిపివేయాలని, భవిష్యత్తులో ఓటిటిలో కూడా ప్రదర్శించవద్దని, ఈ మేరకు ఆదేశించాలని ప్రధాని మోడీని కోరింది. ఆదిపురుష్ దర్శకుడు, రైటర్‌పై కేసు పెడతామనిచెప్పింది. రామాయణం ఆధారంగా దర్శకుడు ఓంరౌత్ తెరకెక్కించిన సినిమా ఆదిపురుష్. జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు రూ.340కోట్లువసూలు చేసిందని చిత్రబృందం ప్రకటించింది.



# ట్రక్కులో టిఎన్‌టి నింపి..శత్రువుపైకి వదిలి..

## రష్యా కొత్త వ్యూహం..



**మాస్కో, జూన్ 20:** ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం కొత్త మలుపులు తిరుగు తోంది. తాజాగా రష్యా కొన్ని టన్నుల టిఎన్‌టి నింపిన ఓ ట్రక్కును ఉక్రెయిన్ సైనికులపైకి వదిలి రిమోట్ సాయంతో పేల్చేసింది. ఈ విషయాన్ని రష్యా రక్షణ శాఖకు చెందిన ఓటెలిగ్రామ్ ఛానల్‌లో వెల్లడించారు. ఈ ట్రక్కులో 3.5 టన్నుల కుపైగా టిఎన్‌టిని నింపి ఐదు ఎఫ్ఎబి-100బాంబులను అమర్చారు. సాధారణంగా ఒక ఎఫ్ఎబి-100బాంబులో 100 కిలోల పేలుడు పదార్థం ఉంటుంది. దీని గురించి ఈ రష్యా కమాండర్ వివరిస్తూ, శత్రువుకు 300 మీటర్ల దూరంలో ట్యాం కును వారిపైకి మళ్లించి, మా సైనికుడు దూకేసి వెనక్కి వచ్చేశాడు. ఆ వాహనం వారి వద్దకు వెళ్లాక రేడియో కంట్రోల్ సాయంతో నేను దానిని పేల్చివేశాను అని పేర్కొన్నాడు. ఆ ట్యాంకులో టన్నుల కొద్దీ పేలుడు పదార్థాలు ఉండడంతో భారీగా విస్ఫోటం సంభవించి షాక్‌వేవ్ పుట్టుకొచ్చింది. ఈ ఘటనలో ఉక్రెయిన్ సేనలు భారీ నష్టాన్ని చవిచూసినట్లు రష్యా వెల్లడించింది. ఈ దాడి మొత్తాన్ని డ్రోన్ సాయంతో రష్యన్లు చిత్రీకరించారు. మరో రష్యా వార్ బ్లాగర్ మాత్రం, సదరు ట్యాంకు ఉక్రెయిన్ సైనికుల వద్దకు చేరక ముందే ఓ మందుపాతరపైకి వెళ్లి పేలి పోయిందని వెల్లడించాడు. ఈదాడి మరింకాలోని ఉక్రెయిన్‌స్థావరంపై జరిగిందని వెల్లడించాడు.

# యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో కిల్లర్ క్వశ్చన్లు ఉండవు

## వెల్లడించిన దక్షిణ కొరియా

**సియోల్, జూన్20:** యూనివర్సిటీ ప్రవేశాల కోసం దక్షిణ కొరియా నిర్వహించే ఓ పరీక్ష ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన విషయం తెలిసిందే. అయితే అందులో వచ్చే కొన్ని కఠినమైన ప్రశ్నలు అక్కడి యువతలో తీవ్ర ఒత్తిడికి కారణమవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ పరీక్షలో కీలక మార్పులకు దక్షిణ కొరియా ప్రభుత్వం ఉపక్రమించింది. అందులో కిల్లర్ క్వశ్చన్లుగా పిలిచే ప్రశ్నలు ఇకనుంచి లేకుండా చూస్తామని దక్షిణ కొరియా విద్యాశాఖ ప్రకటించింది. దక్షిణకొరియాలో పన్నెండో తరగతి పాసైన విద్యార్థులు యూనివర్సిటీలో చేరడానికి సన్‌అంగ్ అనే ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఏటా నవంబరులో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు భారీ పోటీ ఉంటుంది. ఒకేరోజు ఎనిమిది గంటలపాటు జరిగే ఈ పరీక్షకు దాదాపు 5లక్షల మంది హాజరవుతుంటారు. కొరియా భాషతోపాటు ఇంగ్లీష్, గణితం, చరిత్ర, సైన్సు తదితర సబ్జెక్టుల్లో విద్యార్థుల నైపుణ్యాలను విశ్లేషించే ప్రశ్నలుంటాయి. కేవలం కాలేజీ భవితనే కాకుండా కెరీర్, వివాహం వంటి విషయాల్లోనూ ఈ పరీక్ష కీల పాత్ర వహిస్తుందట. అందులో వచ్చే కొన్ని కఠిన ప్రశ్నలను కిల్లర్ క్వశ్చన్స్‌గా పేర్కొంటుంటారు. సాధారణ విద్యార్థులకు ఇవిశాపంగా మారుతున్నాయనే వాదన ఉంది. ఈ పరీక్షలో గట్టెక్కేందుకు ప్రైవేటు ట్యూషన్లను పెట్టుకోవడం తల్లిదండ్రులకు ఆర్థికంగా భారంగా మారడంతో పాటు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని తేలింది. మరోవైపు విద్యావ్యవస్థలో తీవ్ర పోటీ కారణంగా పిల్లల్లో ఒత్తిడి, ఆత్మహత్యల రేటు పెరుగతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాపరీక్షల తీరుపై తీవ్ర విమర్శలు వస్తుండటంతో వీటిలో మార్పులు చేయాలని దక్షిణకొరియా విద్యాశాఖ నిర్ణయించింది. సాధ్యమైనంత వరకు అటువంటి ప్రశ్నలు ఉండకుండా దీన్ని రూపొందిస్తామని విద్యాశాఖ మంత్రి లీజూ హో ప్రకటించారు. సన్‌అంగ్ పరీక్ష జరిగేరోజున దేశం మొత్తం నిశ్శబ్దంగా మారుతుంది. టివిలు, మ్యూజిక సిస్టమ్స్ మూగబోతాయి. రోడ్లమీద ట్రాఫిక్‌పిల్లలకుఅడ్డంరాకూడదని కోర్టులు, బ్యాంకు లూ స్టాక్‌మార్కెట్‌తో సహా కార్యాలయాలన్నింటినీ ఆలస్యంగా ప్రారంభించి త్వరగా మూసేస్తారు. ఏకాగ్రతకి భంగం కలకుండా చూడటానికి దేశమంతటా విమానాల రాకపోకల్ని నిలిపివేస్తారు. మిలిటరీ శిక్షణ, నిర్మాణ పనులనూ ఆపేస్తారు. విద్యార్థుల కోసం బస్సులు, ట్యాక్సీలను ఉచితంగా నడుపుతారు. పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు కూడా విద్యార్థుల కోసం అందుబాటులో ఉంటాయి.



# బెంగాల్ పంచాయతీ ఎన్నికలకు కేంద్ర దళాలు

## మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, జూన్20:** పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల వేళ మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బెంగాల్‌లోని సున్నితమైన జిల్లాల్లో కేంద్రబలగాలను మోహరించాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశిస్తూ, హైకోర్టుఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టులో మమతాబెనర్జీ సవాల్ చేయగా, సుప్రీంకోర్టు ఆ పిటిషన్లను తోసిపుచ్చింది. బెంగాల్‌లో ఒకే రోజులో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరగాలన్నదే హైకోర్టు ఆదేశాల వాస్తవ ఉద్దేశమని జస్టిస్ బివినాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన వెకేషన్ బెంచ్ స్పష్టంచేసింది. బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల కోసం కేంద్ర బలగాలను మోహరించడానికి అనుకూలంగా కోల్‌కతా హైకోర్టు ఈ నెల 15న తీర్పునిచ్చింది. ముఖ్యంగా రాష్ట్రపోల్ ప్యానల్ గుర్తించిన సున్నితమైన ఏడు జిల్లాల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలను తప్పనిసరిగా మోహరించాలని ఆదేశించింది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు పశ్చిమబెంగాల్ రాష్ట్ర పోలీస్ బలగాలతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కేంద్ర ఎన్నికలను మోహరించాలని, కోరాలని తాముభావిస్తున్నట్లు జస్టిస్ హిరణ్య భట్టాచార్యతో కూడి ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రంలో హింసాత్మకఘటనలు చోటుచేసుకున్న అన్ని జిల్లాల్లోనూ కేంద్ర బలగాలను మోహరించాలంటూ ఎస్ఇసికి ఆదేశాలిచ్చింది. జులై8న పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉండగా గతవారం నామినేషన్ల సందర్భంగా పలు చోట్ల హింసాత్మకఘటనలు చోటుచేసుకుని సుమారు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

06ATP27_06ATP27.qxd 20-06-2023 PM 10:49 Page 1



## మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్‌పై డెమో కార్యక్రమం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపిఎం నాగరాజు

బత్తలపల్లి, జూన్ 20 ప్రభాతవార్త : స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ కార్యక్రమంపై మోడల్ మండలాల ఏపిఎంలు, విఓలకు మూడురోజుల పాటు డెమో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపిఎం సుదర్శనరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగరాజు నేతృత్వంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామాంజినమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిఓటి ట్రైనర్లు చిలమత్తూరు ఏపిఎం భారతి, గుడిబండ ఏపిఎం ముత్యాలప్పలు శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిపిఎంమాట్లాడుతూ సంఘాలు,సంస్థలు వారి సంస్థలను వారే స్వయంనిర్వహణ, స్వంతంత్ర నిర్ణయాధికారం, స్వయం నియంత్రణ సాధించే స్థాయికి ఎదగాలన్నారు. ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ మొదటగా మన మండలంలోనే ఈ శిక్షణను ఇస్తున్నామని, ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకొని తిరిగి గ్రామస్థాయిలో శిక్షణ ఇవ్వవలసి వుంటుందన్నారు. ఈ శిక్షణలో ఏపిఎంలు నారాయణ, రమణప్ప, శారద, హేమలత, రవీంద్రారెడ్డి, రవిలతో పాటు బత్తలపల్లి సిసిలు పాల్గొన్నారు.

## మృతునికి పరిటాల శ్రీరాం నివాళి



మృతుదేహానికి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరాం

బత్తలపల్లి, జూన్ 20 ప్రభాతవార్త : సోమవారం రాత్రి బత్తలపల్లి ఎస్టీ కాలనీలో జరిగిన ఇరు కుటుంభాల ఘర్షణలో గాయపడి మృతిచెందిన యర్ర రామయ్య మృతదేహానికి ఆసుపత్రిలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరాం నివాళులర్పించారు. మంగళవారం అనంతపురం ఆసుపత్రిలో రామయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంభ సభ్యులను పరామర్శించి ఘర్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంభానికి టిడిపి పార్టీ అండంగా వుంటుందని భరోసా ఇచ్చారు.

## ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన యర్ర రామయ్య



ఘర్షణలో తీవ్రంగా గాయపడిన చిన్న కాశప్ప

బత్తలపల్లి, జూన్ 20 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని ఎస్టీ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన ఇరుకుంటుంభాల మధ్య ఘర్షణలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్టీ కాలనీకి చెందిన నాగభూషణ కుమారుడు ప్రవీణ్ ద్విచక్రవాహనంలో వేగంగా వస్తుండగా చోటు చేసుకున్న వివాదం చివరకు ఘర్షణకు కారణమైంది. దీంతో ఇరు కుటుంభాల వారు దాడులకు దిగారు. కాలనీకి చెందిన సాకే చిన్న కాశప్ప, కుమారులు గంగన్న, పురుషోత్తం, కోడల్లు లక్ష్మి, ఉమదేవిలు, యర్ర రామయ్య, ఆయన కుమారుడు శివక్రిష్ణ, గౌతమిలకు ఈ ఘర్షణలో గాయాలైనయి. వీరిలో చిన్న కాశప్ప, యర్ర రామయ్యలకు తీవ్ర గాయాలు కావడంతో అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యర్ర రామయ్య మంగళవారం ఉదయం మృతిచెందాడన్నారు చిన్న కాశప్ప పరిస్థితి సైతం విషమంగానే వున్నట్లు తెలిపారు. స్వల్ప గాయాలైన వారు బత్తలపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు. అయితే గడచిన నాలుగు రోజుల క్రితం ఇదే కాలనీకి చెందిన వారు, బోయ కులస్థులు మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం మరవక ముందే ఎస్టీ కాలనీకి చెందిన వారే ఘర్షణ పడడం చర్చనీయాంశంగా మారింది. ?ఇటువంటి ఘర్షణలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పోస్టుమార్టం అనంతరం యర్ర రామయ్య మృతదేహాన్ని కుటుంభ సభ్యులకు అప్పగించారు.

## జర్నలిస్టు అక్బర్ కుటుంబ సభ్యులను పరామర్శించి మాజీ ఎమ్మెల్యే విశ్వ

-ప్రమాదంలో గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : దాదాపు నెల రోజుల క్రితం తమిళనాడులోని నమ్మక్కల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు అర్బర్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. బెంగళూరు సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతపురానికి వచ్చి ఇంట్లోనే చికిత్స పొందుతున్న వారిని మంగళవారం ఉదయం ఆయన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.రమణ, రామాంజినేయులుతో కలిసి వెళ్లి పరామర్శించి నాటి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదంలో అందరూ ప్రాణపాయం నుండి తప్పించుకొని గాయాలతో బయటపడటం ఊపిరి పీల్చుకునే విషయమన్నారు. గాయపడిన వారందరూ త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన సన్ రే వైద్యులు డాక్టర్ రోహిత్‌రెడ్డిను కలిసి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

## నూతన ఇళ్లకు మార్కింగ్

- ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ పర్యటన



ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న దృశ్యం

అగళి, జూన్ 20 ప్రభాతవార్త : మండలంలో కొత్తగా మంజూరైన ఇళ్లకు స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపిడిఓ నరేంద్రకుమార్, హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్ గ్యారగొండనపల్లి గ్రామంలో పర్యటించి ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. అగళి మండలానికి కొత్తగా 236 ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో భాగంగానే గ్యాగొండనపల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపిడిఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. సత్వరమే పేదలు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించక ముందే లబ్దిదారులకు 20వేలను అడ్వాన్స్‌గా ఇస్తామన్నారు. ఉపాధిహామీ పథకంలో పునాది నిర్మాణానికి బిల్లులు ఇవ్వనున్నట్లు వీరు తెలిపారు. ప్రత్యేక అధికారి శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

## జూలై 1 నుంచి గర్భవతులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహారం

-1 నుంచి 5వ తేదీ మొదటి విడత, 16, 17 తేదీల్లో రెండవ విడత పంపిణీ -ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి



విలేఖరులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి వారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటికే అందిస్తోందని ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి తెలిపారు. మంగళవారం పీడీ ఉరవకొండకు వచ్చిన సందర్భంగా స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. పౌష్టికాహారాన్ని రెండు విడుతలుగా అందించడం జరుగుతుందని మోదటి విడత 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు బియ్యం 3 కేజీలు, పప్పు 1కేజీ, నూనె అరలీటర్, పాలు రెండున్న లీటర్లు, గుడ్లు 13, రెండవ విడత 16, 17 తేదీల్లో గుడ్లు 12, పాలు రెండున్నర లీటర్లు అందిస్తామన్నారు. జిల్లాకు ప్రతినెలా బియ్యం 1,31,800 కేజీలు, పప్పు 29,422 కేజీలు, నూనె 17,522 లీటర్లు, పాలు 4,44,077 లీటర్లతో కూడిన 32,149 వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అవసరం అవుతాయన్నారు. వాటిని 18,239 మంది గర్భవతులు, 16,796 మంది బాలింతలకు అందిస్తామన్నారు. ఇప్పటిదాకా సెంటర్‌కే వచ్చి వారు పౌష్టికాహారం భుజించాల్సి ఉండగా అనేక మంది వివిధ కారణాలతో రాలేకపోతున్నారన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటికే ఆహారం విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు కింద 91 అంగన్‌వాడీ సెంటర్లకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతోందని ఒక్కొక్క సెంటర్‌కు ప్రభుత్వం 16 లక్షల రూపాయలు కేటాయించగా మదర్ కమిటీల ఆధ్వర్యంలో వాటి నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాకు 250 కొత్త అంగన్‌వాడీ సెంటర్ల మంజూరుకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని పీడీ తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ల సేవలను విస్తృతం చేసి మరింత మెరుగుపర్చడంలో భాగంగా జిల్లాలోని 11 ప్రాజెక్టుల్లో రాయదుర్గం, కణేకల్లు, అనంతపురం అర్బన్ ప్రాజెక్టులు మినహా మిగిలిన ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ సెంటర్ల మార్పులు, చేర్పులు జరిగాయన్నారు. ఉరవకొండ ప్రాజెక్టులోకి కొత్తగా కూడేరు, బెలుగుప్ప మండలాలు కలిశాయని తెలిపారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలు, రక్తహీనతతో బాధపడతున్న మహిళలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు పీడీ బి.ఎన్.శ్రీదేవి వివరించారు.

## బస్సు యాత్రకు మైనార్టీలు పెద్ద ఎత్తున తరలి రండి - మైనార్టీ నేతలు



మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

మడకశిర టౌన్, జూన్ 20 ప్రభాతవార్త : ఈ నెల 23న ప్రారంభమయ్యే బస్సు యాత్రకు మైనార్టీలు పెద్ద ఎత్తున తరలి రావాలని మైనార్టీ పార్లమెంట్ కమిటీలు, రాష్ట్ర నియోజకవర్గ, మండల కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కదిరిలో జరిగే 23వ తేదీన బస్సు యాత్ర ప్రారంభోత్సవానికి ఉదయం 8 గంటలకు అందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్,ఫయాజ్ బాషా, రహమతుల్లా, అన్సర్‌బాషా అసిదుల్లా, ఇర్షాద్‌బాషా, అంజాద్‌బాషా, ఫకృద్దీన్ బషీర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిన్న వయసులో పెద్ద మనసును చాటుకున్న విద్యార్థిని రేణుక..!

-ప్రతిభా అవార్డు కింద ఇచ్చిన రూ.2 వేలకు రూ.8 వేలు జతచేసి విరాళం -గురుకులం హాస్టల్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి వినియోగించాలని సూచన



గురుకులం హాస్టల్‌లో నీటి వసతికై విరాళం అందిస్తున్న విద్యార్థిని రేణుక

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : చిన్న వయసులోనే పెద్ద మనసును చాటుకుంది పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని రేణుక. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా అవార్డుల అందించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా 10వతరగతిలో మంచిమార్కులు సాధించినందుకుగాను రేణుకకు రెండవబహుమతిగా 2,000రూపాయల నగదు ప్రోత్సాహంలభించగా ఎంతో పెద్దమనసుతో ఆలోచించిన రేణుక ఆ డబ్బుకు తానుదాచుకున్న మరో8,000రూపాయలను జతచేసిగురుకులంలోని హాస్టల్ లో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విరాళంగా అందించి అందరిమన్ననలు పొందింది. 10,000రూపాయలు విరాళమిచ్చిన రేణుక తండ్రివెంకటేష్ రెక్కాడితేగాని డొక్కాడని సామాన్య హమాలీకావడం విశేషం.

**అట్టహాసంగా జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం:**
స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం అట్టహాసంగా జరిగింది. గురుకుల ప్రిన్సిపాల్ సునీత, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మెన్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గురుకులంలో చదువుతూ 10వ తరగతి పరీక్షల్లో 536 మార్కులు సాధించి మోదటి స్థానంలో నిలిచిన చరితకు 3,000 రూపాయలు, 521 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన రేణుకకు 2,000 రూపాయలు, 513 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన సౌమ్యకు 1,000 రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించి ప్రశంసా పత్రాలు ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మెన్ రాజేష్ మాట్లాడుతూ ఆణిముత్యాలు కింద ఎంపికైన విద్యార్థినులను మిగిలిన విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకొని రాణించాలన్నారు. ఈ సందర్భంగా కురుగుంట గురుకులానికి బదిలీ అయిన ప్రిన్సిపాల్ భారతిను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యుడు గుర్రం రామాంజినేయులు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా పుట్టినిల్లు ఆశ్రమం ప్రథమ వార్షికోత్సవం

వజ్రకరూర్,జూన్ 3,ప్రభాతవార్త: పుట్టినిల్లు ఆశ్రమం ఏర్పాటు చేసి ప్రథమ సంవత్సరం పూర్తయిన సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నిర్మల మురళి, సభ్యులు మురళికృష్ణ,క్రిష్ణవేణి,చిరంజీవి సాయి సిద్ధార్థలు కలిసి గోశాలలో గోసేవ నిర్వహించారు.ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే పలురకాల కార్యక్రమాలను గురించి అక్కడ వారికి వివరించారు.అనంతరం పుట్టినిల్లు ఆశ్రమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

## 23న మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం

-పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : ఈనెల 23వ తేదీన ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం ఉదయం 10.30 గంటలకు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మీనుగ లలిత అధ్యక్షతన జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

## ఘనంగా ప్రభాతభేరి యోగా చైతన్య ర్యాలీ

-విద్యార్థులకు జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు



ప్రభాతభేరి ర్యాలీలో పాల్గొన్న పిల్లలు, పెద్దలు

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : ఉరవకొండను ఆయుష్, సంపూర్ణ యోగ గ్రామంగా తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించి క్రమంలో 9వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మంగళవారం ఉదయం ప్రభాతభేరి యోగ చైతన్య ర్యాలీ ఘనంగా జరిగింది. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నుండి పిల్లలు, పెద్దలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయుర్వేద ఆసుపత్రి సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.యండి.షఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ చందా చంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, ఆయుర్ ప్రధాన కార్యదర్శి తాటికొండ వెంకట్, యోగ గురువు నాగమల్లి ఓబులేష్, డాక్టర్ బాలాజీబాబు, డాక్టర్ కబీర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగ చేయాలని దీనివల్ల మానసిక, శారీరక రోగాలు రాకుండా చూసుకోవచ్చున్నారు. ర్యాలీ అనంతరం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారికి స్థానిక లయన్స్‌క్లబ్‌లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో యోగాసన, యోగాపై వ్యాసరచన, వకృత్వం, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల ఫార్మసిస్టు మహేష్, ఎంఎన్ఓ సుంకన్న, పీఈటీ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య రథ కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంత చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి



సభకు హాజరైన తెదేపా నాయకులు,కార్యకర్తలు

రొద్దం,జూన్ 20, ప్రభాతవార్త: చంద్రబాబు నాయుడు చేపట్టిన చైతన్య రథ కార్యక్రమాన్ని అందరు కలసి సమిష్టిగా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని బి.కె.పార్థసారథి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మండల పరిధిలోని బి.కె.పార్థసారథి స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మహిళలకు పెద్దపీట వేస్తు మినీ మ్యానిఫెస్టోను మహానాడులో విడుదల చేయడం జరిగింది.సత్యసాయి జిల్లాలో భాగంగా పెనుకొండ నియోజకవర్గానికి 25వ తేదిన తురకలాపట్నం, రొద్దం మీదుగా పరిగి మండలం చేరుకుంటారని,ఈ కార్యక్రమాన్ని స్థానిక నాయకులు,కార్యకర్తలు,నందమూరి అభిమానులు, మహిళలు,శ్రేయోభిలాసులు పాల్గొని విజయవంతం చేయాలని, అంతేకాకుండా వైసీపీ అరాచక పాలనలో జరుగుతున్న దుర్మార్గాలను ఎండగట్టడానికి మన జాతీయఅధ్యక్షులు చంద్రబాబు నాయుడు వచ్చి,అలాగే ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి వస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి,లీలావతి, ఈ.సి.హరి, చంద్రశేఖర్‌నాయుడు, మురళి,ఇమామ్,చంద్రశేఖర్,నారాయణ,రామచంద్ర పాల్గొన్నారు.

## వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది

- మాజీ ఎంఎల్‌ఏ సూరికి వైకాపా నాయకుల సూచన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకులు

బత్తలపల్లి, జూన్ 20 ప్రభాతవార్త : మండల కేంద్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఘర్షణలకు ఎవరు కారకులో నిజాలు తెలుసుకుని మాజీ ఎంఎల్ఏ గోనుగుంట్ల సూర్యనారాయణ మాట్లాడితే బాగుంటుందని వైకాపా నాయకులు సూచించారు. మంగళవారం స్థానిక రాష్ట్ర కురుబ కార్పొరేష్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ స్వగృహంలో ఎంపిపి బగ్గిరి త్రివేణి, జెడ్పిటిసి కోటి సుధ, వైస్ ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో జరుగుతున్న ఘర్షణల వెనుక టిడిపిలోని రెండు గ్రూపులే కారణమన్నారు. క్రికెట్, వ్యక్తిగత కారణాల వలన వచ్చిన గొడవలు రెండు కులాల మధ్య చిచ్చు రేపిందన్నారు. ఎస్టీలకు, బిసీలకు ఒక్కో నాయకుడు ప్రోత్సహించడం వలననే గొడవలు జరిగాయన్నారు. క్షతగాత్రులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ ఎంఎల్ఏ గోనుగుంట్ల సూర్యనారాయణ ప్రస్తుత ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబును విమర్శించడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలుసునని, మీరు కూడా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. మీరు ఎంఎల్ఏగా వున్న సమయంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్, తహాశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల మెట్లుకూడా ఎక్కలేక పోయారన్నారు. ఇపుడు వాలంటీర్ల ద్వారా అర్హతకలిగిన ప్రతిఒక్కరికీ పార్టీలకతీతంగా పథకాలను అందజేస్తున్నామన్నారు. మీ హయాంలో బాధితుల పక్షాన నిలబడిన మాపైనే కేసులు బనాయించారన్నారు. టిడిపి వారిపై ఆరోపణలు చేయలేని మీరు వైకాపా వారిపైనే ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. పోలీసులు సైతం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. పోలీసులను మేము ఒక్కటే కోరుతున్నామని, ఈ కేసుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరామన్నారు. అందరూ సమన్వయం పాటించాలని, అంతా సర్దుకుంటుందన్నారు. ఈ సమావేశంలో సర్పంచు కాశమ్మ, ఉపసర్పంచు కోటి గోపినాథ్, కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

- అన్న క్యాంటీన్‌లో ఉచిత అన్నదానం



పిల్లలకు కేకు తినిపిస్తున్న సవితమ్మ



ఉచిత అన్నదానం చేసుత్న్న సవిత

పెనుకొండ, జూన్ 20 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సవితమ్మ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు చేశారు. ఈ సందర్భంగా సవితమ్మ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు డివి ఆంజినేయులు, మావుటూరు గోపాల్, త్రివేంద్రనాయుడు, కోనాపురం కేశవయ్య, మాజీ ఎంపిటిసి మైలారప్ప, కౌన్సిలర్ గీతా హనుమంతు, మారుతిప్రసాద్, వాసుదేవరెడ్డి, బాలాజీ నాయక్, నరేష్, మద్దిలేటి, హేమంత్, రమేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను అవమానపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

-ఐసీడీఎస్ పీడీ డా॥బి.ఎన్.శ్రీదేవిను కోరిన బీయంఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు వెలిగొండ పద్మావతి



ఐసీడీఎస్ పీడీ డా॥బి.ఎన్.శ్రీదేవితో మాట్లాడుతున్న బీయంఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు వెలిగొండ పద్మావతి

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : మీరు ప్రాజెక్టు కార్యాలయంలోకి అడుగు పెట్టరాదని ఎందుకొచ్చారంటూ అంగన్‌వాడీలను అవమానపరుస్తున్న కార్యాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని బీయంఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు వెలిగొండ పద్మావతి కోరారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవిను కలిసి అంగన్‌వాడీల వివిధ సమస్యలను పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీలను కార్యాలయంలోకి రాకూడదని చెప్పే హక్కు ఉద్యోగులకు ఎక్కడుందని ప్రశ్నించారు. దీంతో స్పందించిన పీడీ సెంటర్ల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఎవ్వరూ ప్రాజెక్టు కార్యాలయంలో కనిపించరాదని సెంటర్ల లోనే ఉండాలని ఆ ఉద్దేశంతోనే రాకూడదని చెప్పి ఉంటారని అన్నారు. అయినా ప్రాజెక్టు కార్యాలయానికి అంగన్‌వాడీలను రావద్దని ఎవరు, ఎందుకు అన్నారో విచారిస్తామన్నారు. అంగన్‌వాడీలు, సెంటర్లకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే రాతమూలకంగా తనకు ఇస్తే పరిశీలించి తగిన చర్యలు తీసకుంటామని సూచించారు.

## లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించండి

-మోపిడి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు ఆవార్డుల ప్రధానం



జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా అవార్డు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సర్పంచ్ సిద్దప్ప, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మెన్ సతీష్, ఎంపీటీసీ సుధాకర్, ఉప సర్పంచ్ లాలెప్ప పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మోపిడి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు ప్రతిభాఅవార్డుల ప్రధానోత్సవం ప్రధానోపాధ్యాయులు యం.వాలానా యక్ అధ్యక్షతన అట్టహాసంగా జరుగగా వారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులై ప్రథమ స్థానంలో నిలిచిన బి.మానసకు 3,000 రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన టి.జ్ఞానేశ్వరికు 2,000 రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన గాయత్రికు 1,000 రూపాయలు ప్రోత్సాహక బహుమతిని అందించి మెడల్స్‌వేసి ప్రశంసా పత్రాలు ఇచ్చి సన్మానించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

-ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువనేత వై.భీమరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ-హాజరై దగ్గరుండి రోగులకు పరీక్షలు చేయించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని వజ్రకరూరు మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం పక్కనగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైసీపీ యువనేత వై.భీమరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన కనిపించింది. కర్నూల్‌కు చెందిన సుశీల నేత్రాలయ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన శిబిరాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సందర్శించి కంటి వైద్యం కోసం వివిధ గ్రామాల నుండి వచ్చిన రోగులను ఆయన పలుకరించి వారికి దగ్గరుండి వైద్యులతో కంటి పరీక్షలు చేయించి మందులు ఇప్పించారు. వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు చేసిన వైద్య బృందం ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. వారిని ప్రత్యేక వాహనంలో కర్నూల్‌కు తరలించి అక్కడ ఆపరేషన్లు చేసి మందులు ఇచ్చి సురక్షితంగా వారి తీసుకురావడం జరుగుతుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు మండల వైస్ ఎంపీపీ సుశీలరాణి, గ్రామ సర్పంచ్ మోనలిసా, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ ఎం.వి.రమణయాదవ్, జరుట్ల రాంపురం సర్పంచ్ తిరుపాల్ యాదవ్, వైసీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏసన్న, ఎర్రిస్వామి, గురు తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండ ఎంఈఓ-2గా పి.రమాదేవి బాధ్యతల స్వీకారం

-ఘనంగా సన్మానించిన ఏపీటీఎఫ్ మండల శాఖ



కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-2 పి.రమాదేవిను సన్మానించిన ఏపీటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, జూన్ 20 ప్రభాతవార్త : ఉరవకొండ మండల 2వ విద్యాధికారిగా పి.రమాదేవి మంగళవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మండలశాఖ నాయకులు షాలువాకప్పి పూలమాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాకేభాస్కర్, మండల ప్రధానకార్యదర్శి బి.సి.ఓబన్న,ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.నాగేంద్ర, ఆర్.లోకేష్, గీతావాణి, సూర్యప్రకాష్, క్రిష్ణ, జి.వి.బాలక్రిష్ణ, టి.వేణుగోపాల్, ఆదినారాయణ, వై.బి.చౌదరవి, పాండురంగలతోపాటు మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప సిబ్బంది ఉన్నారు.

## అనాధాశ్రమానికి వస్తువులు వితరణ



వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణి చేస్తున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 20,ప్రభాతవార్త: స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకులు తారక్‌నాథ్ 19వ వర్ధంతి సందర్భంగా ధర్మవరం రూరల్ పరిధిలో గల గోట్లురు గ్రామంలో గల వృద్ధాశ్రమాం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియ యూనియన్ నాయకులు ఎస్.గోపాల్ అధ్వర్యంలో వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ సిబ్బంది బాస్కర్,కిరణ్‌కుమార్, సాయికిరన్, ఓబులేసు,అజయ్ కుమార్‌రెడ్డి,లోహిత్,భరద్వాజ్, శివశంకర్, అమరేశ్వరి, సంధ్యారాణి,పవానిధనుంజయరెడ్డి,రాజరెడ్డి,చంద్ర పాల్గొన్నారు.

05ATP20_05ATP20.qxd 20-06-2023 PM 11:55 Page 1



# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నాం..

## - 181వ రోజుకు చేరుకున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

## - కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి



ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని తనకల్లు-3 గ్రామ సచివాలయ పరిధిలోని గొళ్ళవారి పల్లి,గొళ్ళవారిపల్లిహరిజనవాడ, బండ్రేవుపల్లి, గనాదిపల్లి, దుగినేపల్లి, ఎస్వి. పురం, కానసానివారిపల్లి నందు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్యే సిద్దారెడ్డికి గ్రామప్రజలు పూలమాలలు, మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు తిరిగి సమస్యలను పరిష్కరి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహా న్రెడ్డి ఆదేశాల మేరకు తనకల్లు-3 సచివాలయం నందు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగిందన్నారు. జగన్మోహా న్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. కె.జి నుండి ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చి ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించే విధంగా విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అమ్మ ఒడి, విద్య దీవెన, వసతి దీవెన, విద్యా కానుక లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టా రన్నారు. వైద్య విధానాలలో, స్వయం సహా యక సంఘాలతో, ప్రతి రంగాన్ని సమానమైన అభివృద్దిని చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. వీటన్నిం టిని చూసి ఓర్వలేని దుష్టచతుష్టయాలు అనవసరమైనటువంటి రాద్ధాం తాలతో జగనన్నపై బురద జల్లే కార్యక్రమాలు చేస్తున్నారని, వీటన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలు ఎప్పుడూ జగన్మోహా న్రెడ్డికి అండగా ఉంటారని, రాబోవు రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలతో జగనన్న మన ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధ్యార్థులకు బహుమతులు ప్రదానం



విధ్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపిపి

నంబులపూలకుంట, జూన్ 20, ప్రభాతవార్త:

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఒక్కో పాఠశాల నుండి ముగ్గురు (మొదటి, ది ్వతీయ,తృతీయ) విద్యార్థులకు ప్రభుత్వం అందించిన నగదు బహుమతిని విధ్యార్థులకు ఎంపిపి ఈటె రాము చేతుల మీదుగా అందించడం జరిగింది. అదేవిధంగా విధ్యార్థులను మెడల్స్ తో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం విధ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ కోట్ల రూపాయలు వెచ్చించి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పోరేటు పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత చదువు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ లు అందించి శుభాకాంక్షలు తెలి పారు. భవిష్యత్తులో ఇంకా బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈటె రాము, ఎంపిడిఓ ఆదినారాయణ, వైస్ ఎంపిపి కేశవరెడ్డి, సర్పంచ్ అంజినమ్మ, ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి, ఈఓఆర్డి మనోహర్, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ప్రత్యేక అధిరాకి రుపారాణి, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, నాయకులు నారా యణ స్వామి, శ్రీరాములు, స్కూల్ కమిటీ ఛైర్మెన్ టి. భాస్కర్, ఉపాధ్యా యులు వెంకటరామిరెడ్డి, మురళి, రహీం, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రశాంతంగా ఉండండి ఎస్ఐ



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

యల్లనూరు,జూన్ 20,ప్రభాతవార్త: గ్రామాలలో ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ రామక్రిష్ణ పేర్కొన్నా రు.మంగళ వారం మండలంలోని వెన్నపూస పల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తు లతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఫ్యాక్షన్ వీడి ప్రశాంత వాతా వరణంలో జీవించాలన్నారు.చిన్న చిన్న సమస్యలకు గోడవలు పడటం గ్రూప్ రాజకీయాలు చేయడం చేయరాదన్నారు.ఏవైన సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురా వాలన్నారు.అలా కాకుండ చట్టాన్ని అతిక్రమిస్తే తమదైన శైలీలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది అని హెచ్చరించారు. అందిరి పిల్లలను బాగా చదివించి మంచి ప్రయేజకులు అయ్యేలా చూడాల న్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు,కానిస్టేబుల్ విష్ణువర్ధన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏంఈఓగా బాధ్యతలు స్వీకరించిన పరమేశ్వర్ రెడ్డి



ఏంఈఓగా బాధ్యలు స్వీకరిస్తున్న దృశ్యం

యల్లనూరు,జూన్ 20,ప్రభాతవార్త: మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యలయంలో మంగళవారం ఏంఈఓ-2గా పరమేశ్వర్రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఈయన కుచువారిపల్లి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తు ప్రభుత్వం నిర్వహించిన కౌన్సిలింగ్లో ఏంఈఓ-2గా మండలంలో బాధ్యతలు చేపట్టారు.

# వడ్డెర విద్యార్థిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం



మాట్లాడుతున్న మల్లెల జయరాం

ఓబుళదేవరచెరువు, జూన్ 20, ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ ద్వితియ సంవత్స రం చదువుతున్న ఆదిమూర్తి అనే వడ్డెర కులానికి చెందిన విద్యార్థిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫల మయిందన్నారు. ఎక్కడా చూసినా అఘాయిత్యాలు, దౌర్జ న్యాలు, మహిళలపై మానభంగాలు, విద్యార్థులపై హింసా కాండ పెరిగి పోయిందన్నారు. అదే విధంగా జూన్ 17వ తేదీన మదనపల్లిలో ఇంటర్ మీడియట్ 2వ సంవత్స రం చదువుతున్న ఆదిమూర్తి అనే విద్యార్థిపై అల్లరిమూకలు దాడి చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీప కాలనీలో ఉంటున్న ప్రవీణ్ అనే వ్యక్తి బర్తడే పార్టీ ఉందని మోసపూరిత మాటలు చెప్పి సిటిఎంకు తీసుకువెళ్లి అక్కడ చింటు, నాని, చందు, నౌషాద్ అనే వ్యక్తులతో కలసి ఇనుపరాడ్లు, కర్రలు, బెల్టులతో విచాక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. కాళ్లవేళ్లా పడి వదిలేయండి అని ప్రాదేయ పడ్డా కనికరం లేకుండా చావా బాదడం హేయమైన చర్య అ న్నారు. సంఘటన జరిగి నాలుగురోజులు అవుతున్నా దాడికి పాల్పడ్డ వారి పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవ హరించడం సిగ్గుచేటన్నారు. బాధిత ఆదిమూర్తి కుటుం బానికి అండగా ఉంటామని నా ్యయం జరిగే వరకూ పోరాడతామన్నారు. వడ్డెర్లపై ఎవరైనా అనవసరంగా దాడులు చేస్తే చూస్తూ ఊరు కునే ప్రసక్తే లేదని వడ్డెర్ల సత్తా ఎంటో చూపిస్తామని జయరాం హెచ్చరించారు. ఆయన వెంట వడ్డెర సాధికార సమితి జిల్లా ప్రధాన కార ్యదర్శి పీట్ల సుధాకర్, వడ్డెర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరా జులు, రాష్ట్ర టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి జెరిపిటి అంజినప్ప, అమడగూరు వడ్డెర్ల సంఘం అధ్య క్షుడు కిష్టప్ప, జిల్లా ప్రచార కార్యదర్శి రమణ, నాయకులు మాజీ ఎంపిపి రామచంద్ర, కేఓ వెంకటరమణ, తిరుపాలు, వల్లిపి రామచంద్ర తదితరులు ఉన్నారు.

# ఘనంగా కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు

## -అర్బన్ టిడిపి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన పార్టీ శ్రేణులు

## - ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు మాజీ మంత్రికొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొల్లు రవీంద్ర జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిసిల అభ్యున్న తికి కృషి చేస్తూ ఎక్కడ బిసిలకు అన్యాయం జరిగినా నేనున్నానంటూ ముందుకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బిసి నేత కొల్లు రవీంద్ర నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే బిసిల అభ్యున్నతి సాధ్యమవ ుతుందని, బిసిలంతా కలిసికట్టుగా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం బెస్త సాధికారిక కమిటీ సభ్యులు షణ్ముఖ ఆధ్వ ర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి కుమార్గౌడ్, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, గోపాల్గౌడ్, దాసరి శ్రీధర్, చేపల హరి, వెంకటేష , షౌకత్ ఖాన్, వన్నూరు, వెంకటేష్, బుజ్జి, ఆటో శంకర్, తెలుగు మహిళలు వసుందర, సుజాత, బుజ్జి, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి



వ్యవసాయ అధికారులకు వినతీపత్రం అందజేస్తున్న దృశ్యం

నల్లచెరువు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కె.పూలకుంట గ్రామ పంచాయతీలోని నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మంగళవారం రైతు భరోసా కేంద్రం నందు వ్యవసాయ అధికారులకు వినతీపత్రం అందజేశారు. నల్లచెరువు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాలకు విన్నపం తెలి యజేశారు. గత సంవత్స రం నవంబర్, డిసెంబర్ నెలలో అధికంగా వర్షాలు పడటం, 2023 ఏప్రెల్,మే నెలలో అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి సహాయక ర్యలు చేపట్టలేదు. 2022లో పంటలు నష్టపోయిన రైతులందరికీ పంట భీమా ఇన్పుట్ సబ్సీడిలోను రైతుల ఖాతాలో జమ చేయలేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి సేవలు అందిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం పండించిన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మద్దతు ధరలకు కొనుగోలు చేయాలి. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వ విధానా న్ని రైతులు వ్యతిరేకించినప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేసేందుకు పూనుకుంటుందుని, బీజేపి అనుసరిస్తున్న విధానాల వలన రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకాకులం నుండి సత్యసాయి జిల్లా వరకు జాతీయ రహదారులు రైల్వే లైను, గ్యాస్పైప్ లైన్లు, సాగునీటి కాలవలు, పారిశ్రామిక కారిడార్లు, సోలార్ ప్రాజెక్టులు వంటి నిర్మాణల పేరుతో లక్షలాధి ఎకరాల భూసేకరణకు పూనుకు న్నారు. భూ ములు కోల్పోతు న్న రైతులకు ప్రస్తుతం మార్కె ట్ ధర ప్రకారం న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్, రవి సీజన్లో కంది, వేరుశనగ, మొక్కజొన్న, టమోటా, మిరప పంట తోటలు వేల ఎకరాలలో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సీడి, పంటల భీమా విడుదల చేయాలని, ఇన్ఫుట్ సబ్సీడి ఆహార పంట లకు ఎకరాకు రూ. 15వేలు, వాణిజ్య పంటలకు రూ. 40వేలు పెంచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# జెసి ఆదేశాలతో సమాచార శాఖ అధికారులు చర్చలు



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అనంతపురం, జూన్ 20 ప్రభాతవార్త బ్యూరో

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపియుడబ్ల్యూజే తలపెట్టిన పోరుబాటపై జిల్లా అధికారులు స్పందించారు. యూనియన్ నేతలతో చర్చించి వారి సమస్యలు తెలుసుకోవాలని, పరిష్కారం అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. జెసి కేతన్గార్గ్ ఆదేశాలతో డీఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి, ఏపియూడబ్ల్యూజే నేతలను చర్చలకు పిలిచారు. జిల్లాలో అధికారుల తీరు, ప్రభుత్వ నిబంధనల వల్ల జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ఈ సందర్భంగా ఎండగట్టడం జరిగింది. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశ్యారు. నిబంధనలు సడలించి చిన్న పత్రికలకు, కేబుల్ టీవి రిపోర్టర్లు, అర్హులైన విలేకర్లు అందరికీ అక్రిడేషన్లను మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమాచార శాఖ అధికారులను కలిసిన వారిలో ఏపియూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ పయ్యావుల ప్రవీణ్, ఎల క్ట్రానిక్ మీడియా జిల్లా అద్యక్షులు, కమిటీ సభ్యులు ఎస్ఎండి రసూల్, ఐజేయు సభ్యులు ప్రభాకర్నాయుడు, కమిటీ సభ్యులు చౌడప్ప, స్ట్రింగర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు కుమార స్వామి తదితరులు ఉన్నారు.

**నేడు కలెక్టరేట్కు తరలి రండి :** అక్రిడేషన్ల మంజూ రులో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు, అధికారుల తీరును నిరసిస్తూ ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపి యుడబ్ల్యూ జె) ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళనకు జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు అందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని ఏపియుడబ్ల్యూజే జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. అక్రిడేషన్ల మంజూరులో జరిగిన అన్యాయం, జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య పథకం అమలు చేయాలన్న డిమాండ్లతో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

# వంద శాతం రుణాలు రికవరీ చేయాలి

## - డిఆర్డిఏ పీడి నరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పీడి

ఓబుళదేవరచెరువు, జూన్ 20, ప్రభాతవార్త : పల్లవి మండలి సమాఖ్య పరిధిలో మహిళా సంఘ సభ్యులు తీసుకున్న బ్యాంకు, స్త్రీ నిధి రుణాలను వంద శాతం రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పీడి నరసయ్య ఆదేశాలు జారీ చేశారు. స్థానిక పల్లవి మండలి సమాఖ్య వెలుగు కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్టు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం రమణమూర్తి, ఏసి రామ్మోహన్, ఏపిజిబి ఫీల్డ్ ఆఫీసర్ రవి, ఏపియం రమణప్పలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పీడి మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను వంద శాతం సద్వినియెగపరచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అలాగే ప్రతి గ్రామ సంఘం ఇతర సంఘాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. అన్ని రకాల అప్పులు నిర్ణీత గడువులోగా చెల్లిస్తే ప్రభుత్వం అందించే రాయితీలకు అర్హుత సాదిస్తారన్నారు. ఏపిజిబి బ్యాంకు పరిధిలో ఎస్హెచ్జీ సభ్యులకు రూ 10 లక్షల వరకూ మైక్రో ఎంటర్ ప్రైజస్ ద్వారా రుణాలు అందిస్తామని ఫీల్డ్ ఆఫీసర్ రవి తెలియచేశారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య లీడర్లు, ఎల్సి, సీసి, ఎఫ్పిఓ సీసి, క్లస్టర్ సీసి, స్త్రీనిధి మేనేజర్, ఎమ్ఎస్ఏ, ఎఎన్ఎమ్లు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్టిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ-2కు సన్మానం



ఎంఈఓ-2కు సన్మానిస్తున్న వైఎస్ఆర్టిఎఫ్నాయకులు

నంబులపూలకుంట, జూన్ 20, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ఎంఆర్సిలో ఎన్పికుంట మండలానికి ఎంఈఓ-2గా భాధ్యతలు చేపట్టిన సుబ్బిరెడ్డికి వైఎస్ఆర్టిఎఫ్ నాయకులు శివయ్య, ఆంజినేయులు, వెంక టరామిరెడ్డిల ఆధ్వర్యంలో దుశ్శా లువ, పూలమాలలతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ముఖ్యమంత్రి జగన్మోహా న్రెడ్డి విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషిలో భాగంగా ఎంఈ ఓ-2 పోస్టులను పదోన్నతుల ద్వారా కల్పించారని తెలిపారు. విద్యా వ్యవస్థలో అమలు చేస్తున్న నాడు- నేడు, విద్యా కానుక, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద లాంటి కార్యక్రమాలను పరిశీలించి, సమర్థవంతంగా అమలు చేయడానికి, విద్యార్థుల అభివృద్ధిని, ఉపాధ్యాయులు పనితీరును పర్యవేక్షించడానికి ఎంఈఓ-2లను నియమిం చారని, దీనివల్ల ఇద్దరు ఎంఈఓలు ఉండటం వల్ల పారదర్శకతతో పాటు, పనిభారం తగ్గుతుందని తెలిపారు. ఎంఈఓ-2లు రావడానికి కృషి చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ,ఎస్సిఈఆర్టి డైరెక్టర్ ప్రతాప్రెడ్డి, ఎంఎల్సి కల్పలతారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 గోపాల్నాయక్, ప్రదానోపాధ్యాయురాలు శిరీష, రహీం, గోవర్ధన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీడిపి తీర్థం పుచ్చుకున్న 20 కుటుంబాలు



పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాధ రంగా ఆహ్వానిస్తున్న కందికుంట

తనకల్లు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గొల్లవారి పల్లి గ్రామంలో కనిగొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లోకి చేరడం జరిగింది. వీరికి కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్ చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ టీడిపి కండువా కప్పి సాధ రం గా ఆహ్వానించారు. అదేవిధ ంగా మండల పరిధిలోని కొక్కం టి క్రాస్లో టిడిపి నాయకులు సుబ్బయ్య ద్విచక్రవాహనం పడి ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కందికుంట వారిని పరామర్శించడం జరిగింది.

# టిడిపి నేత కొల్లు రవీంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనంత నేతలు



జ్ఞాపికను అందజేస్తున్న అనంత టీడీపీ నేతలు

అనంతపురం అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త

.తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర అద్యక్షులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మచి లీపట్నంలోని ఆయన స్వగృ హంలో అనంతపురం టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజే శారు. ఈసందర్భంగా టీడీపీ బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, సీనియర్ నాయకులు జెరిపిటి కృష్ణమూర్తి, వెంకటేషులు కలిసి కేక్ కట్ చేసి కొల్లుర వీంద్రకు స్వీట్లు తినిపించారు. అనంతరం శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అంద జేశారు. బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ నఇయోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు దళవాయి వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేసిన గ్రామస్తులు

నల్లచెరువు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జోగన్నపేట రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు కాంట్రాక్టర్లు మొదలుపెట్టారు. నిర్మాణం చేపట్టరాదని గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడి తే గ్రామా లకు వెళ్లే రాకపోకలకు ఇబ్బం దులకు కోల్పోతామని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తు న్నారు. ఈ అండర్బ్రిడ్జ నిర్మా ణం వలన జోగన్నపేట, బొమ్మి రెడ్డిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి ఎస్సి కాలనీ గ్రామస్తులకు రహదారి సౌకర్యం కోల్పోతామని అందువలన అండర్బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్కు వినతీపత్రం పంపినట్లు తెలిపారు. గతంలో సర్వే చేసినప్పుడు మాకు తెలియదని, అండర్ బ్రిడ్జ నిర్మాణంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అందువలన రైల్వే ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఆ రైల్వే గేట్ను పరిశీలించి అక్కడి ఫ్లైఓవర్ నిర్మాణం, ఆ ప్రదేశంలో కాకుండా గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండే విధంగా పరిశీలించి అండర్బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గ్రంధాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంధాలయ అధికారి పి.రమా

తనకల్లు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని గ్రంధా లయంను అనంతపురం జిల్లా గ్రంధాలయ కార్యదర్శి పి.రమా మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గ్రంధాల యం సొంత భవంన నిర్మించాలని, గ్రంధా లయం యొక్క పుస్తకాలు చాలా బాగా రికార్డు మెయింటెన్ చేస్తు న్నారని, మస్తాన్వలి ప్రతి రోజు విధులకు హాజరై పిల్లలకు అందుబాటులో ఉండి వారికి కావలసిన పుస్తకాలు చదివించి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మాకు ఎంతో సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా గ్రంధాలయ కార్యదర్శి పి.రమా, గ్రంధాలయ అధికారి యస్. మస్తాన్వలి పాల్గొన్నారు.

# వర్షం కోసం అయ్యప్పస్వామికి జలాభిషేకం

ఓబుళదేవరచెరువు, జూన్ 20, ప్రభాతవార్త : మండంలోని యం కొత్తపల్లి బండపై వెలసిన శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆధ్వర్యంలో స్వామి వారి పంచలోహ విగ్రహానికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. రైతులు పొలాలు దుక్కి చేసి విత్తేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వరుణ దేవుడు కనికరం చూపించకపోవడంతో సమీప వడ్డివారిపల్లి, యం కొత్తపల్లి గ్రామ ప్రజలు అయ్యప్పస్వామి వారికి 108 బిందెలతో జలాభిషేకం చేశారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వరుణ దేవుడు రైతులపై కరుణ చూపించి వర్షం కురిపించాలని వేడుకున్నానన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# నేడు వాహనాలు వేలం

నల్లచెరువు, జూన్ 20, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన వాహనాలను బుధవారం పోలీస్ స్టేషన్ నందు వేలం వేయడం జరుగుతుందని ఎస్సై వరలక్ష్మి తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వారి ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ నందు వాహనాలు వేలం నిర్వహించడం జరుగుతుందని, వేలం ఉదయం 10 గంటలకు ప్రారంభమగునని, వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణయించిన ధరలో 10 శాతం దరావత్తు చెల్లించి గంటకు ముందే పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆట

# ధోనీ లెజెండ్‌గా ఎలా మారాడంటే!



## ఆసక్తికర ఘటనను పంచుకున్న మాజీ క్రికెటర్

**న్యూఢిల్లీ:** ఎంఎస్ ధోనీ క్రికెట్‌లో ఈ పేరే ఓ సంచలనం. టీమిండియాకు రెండోసారి వన్డే ప్రపంచకప్ అందించినా ఐపిఎల్‌లో తన జట్టును అయిదోసారి విజేతగా నిలబెట్టినా ఆ క్రెడిటంతా మహేంద్రుడికే దక్కుతుంది. ఇలా తనదైన వ్యూహాలతో ముందుకు సాగుతూ ఎంతో మంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తాడు ఈ దిగ్గజం. అతడి గొప్పతనం గురించి తెలిపే ఎన్నో ఘటనలు ఉన్నాయి. వాటిలో ఓ ఆసక్తికరమైన విషయాన్ని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా పంచుకున్నాడు. తన ఆలోచనా విధానంతో ధోని ఓ లెజెండ్‌గా ఎలా మారాడో వివరించాడు. 2004లో టీమిండియా జింబాబ్వే, కెన్యా పర్యటనలో ఉంది. ఆ సమయంలో ధోనీ కంటే దినేశ్ కార్తీక్‌కు జట్టులో ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. మహీ రిజర్వ్ కీపర్‌గా ఉండగా డికె తుది జట్టులో ఉన్నాడు. ఓ సమయంలో నెట్స్‌లో డికెకు ధోనీ బౌలింగ్ చేయడం చూశా. వెంటనే ధోనీ వద్దకు వెళ్లి ఎందుకు అతడికి బౌలింగ్ చేస్తున్నావు? అతడు నీకు పోటీ కదా. అతడు బాగా ఆడితే నీకు అవకాశాలు రావు కదా. నువ్వు బ్యాటింగ్ లేదా కీపింగ్ ప్రాక్టీస్ చేయాలి. ఎందుకు బౌలింగ్ చేస్తున్నావు? అని ప్రశ్నించాను. వెంటనే దానికి ధోనీ నన్ను ఆపొద్దు, నేను బౌలింగ్ చేయాలి. నువ్వు బ్యాటింగ్ చేస్తానంటే నీకూ బౌలింగ్ చేస్తా అని బదులిచ్చాడు అని చోప్రా ట్విటర్ వీడియోలో ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు. ఆ తర్వాత ధోనీ ఆలోచనా విధానం ఇన్ని సంవత్సరాలుగా అతడిని ఓ విజయవంతమైన క్రికెటర్‌గా ఎలా మార్చిందో నాకర్థమైంది. అతడు ప్రపంచంలోనే గొప్ప క్రికెటర్‌గా ఎలా మారాడో తెలిసింది అని చోప్రా అన్నాడు. అప్పుడు ధోనీ చెప్పిన సమాధానంలోని అర్థం నాకు తెలిసింది. కావాలనుకున్నదాన్ని అతడు ఎలా సాధించగలిగాడో నాకర్థమైంది. ధోనీ , దినేశ్ కార్తిక్‌ను కానీ మరే ఇతర ఆటగాడిని కానీ పోటీగా అనుకోలేదు. అతడితోనే అతడు పోటీ పడ్డాడు. అందుకే అంటుంటారు నీకు నువ్వే పోటీ. ఎప్పుడూ బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండాలి అని అంటూ ఆనాటి ఘటనను వివరించాడు. ధోనీ తన గేమ్‌లో మాస్టర్. తన గొప్పతనాన్ని తిరిగి ఆవిష్కరించుకుంటూనే ఉంటాడు. అతడికి ఎవరైనా పోటీ ఉన్నారంటే అది అతడు మాత్రమే అంటూ మహేంద్రుడి గురించి ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. ఇక ఇటీవల ముగిసిన ఐపిఎల్‌లో తిరిగి చెన్నై జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు ధోనీ. అయిదోసారి ధోనీ సేన విజేతగా గెలిచి అత్యధిక సార్లు టైటిళ్లు గెలిచిన ముంబయి రికార్డును సమం చేసిన విషయం తెలిసిందే. విజేతగా గెలిచి అత్యధిక సార్లు టైటిళ్లు గెలిచిన ముంబయి రికార్డును సమం చేసిన విషయం తెలిసిందే.

# ఐపిఎల్ 2023 : సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి శుభ్‌మన్ గిల్!

**హైదరాబాద్:** టీమిండియా యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపిఎల్‌లో తాను ప్రాతినిథ్యం వహిస్తున్న గుజరాత్ టైటాన్స్‌కు గుడ్‌బై చెప్పే యోచనలో గిల్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఐపిఎల్ 2024లో శుభ్‌మన్ గిల్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించే అవకాశం ఉంది. ఆరెంజ్ ఆర్మీలో ఆటగాడిగానే కాకుండా కెప్టెన్‌గా జట్టును నడిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆరెంజ్ ఆర్మీలో ఆటగాడిగానే కాకుండా కెప్టెన్‌గా జట్టును నడిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ శుభ్‌మన్‌గిల్‌కు కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చినట్లు ఆ జట్టు వర్గాలు పేర్కొన్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ కూడా గిల్‌కు కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆఫర్‌కు శుభ్‌మన్‌గిల్ అంగీకరిస్తే ట్రేడింగ్ ద్వారా గుజరాత్ టైటాన్స్ నుంచి అతన్ని తెచ్చుకునేందుకు ఈ రెండు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉన్నాయని, అతని కోసం డబ్బులతో పాటు ఇతర ఆటగాళ్లను కూడా వదుకునేందుకు ఈ రెండు జట్లు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు శుభమన్‌గిల్ కూడా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నాడని ప్రచారం జరుగుతోంది. సూపర్‌ఫామ్‌లో ఉన్నప్పుడే అవకాశాలను అందిపుచ్చువాలని, ఐపిఎల్ ఫ్రాంచైజీకి సారథ్యం వహించడం ద్వారా టీమిండియా కెప్టెన్‌గా ఎదగవచ్చని గిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.



ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటం, 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత అతన్ని సారథ్య బాధ్యతల నుంచి తప్పించే అవకాశాలు ఉండటంతో గిల్ తన ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. హార్దిక పాండ్యా పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా కొనసాగినా సుదీర్ఘ ఫార్మాట్‌లో తాను సారథ్య బాధ్యతలు అందుకోవచ్చనే యోచనలో గిల్ ఉన్నట్లు సమాచారం. ఒకవేళ హార్దిక్ కెప్టెన్‌గా కొనసాగినా అతని డిప్యూటీగానైనా తనకు అవకాశం లభిస్తుందని ఈ క్రమంలోనే ఐపిఎల్‌లో వీలైనంత త్వరగా కెప్టెన్ కావాలనే ఉద్దేశంతో గిల్ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపిఎల్ 2023 సీజన్‌లో శుభ్‌మన్ గిల్ అసాధారణ ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. 17 మ్యాచ్‌లలో మూడు సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలతో 890 పరుగులు చేసిన గిల్ ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా నిలిచాడు.

# పంత్‌లేకపోవడం తీరని లోటే

### కానీ భరత్‌ను బలిపశువును చేయొద్దు: మాజీ కెప్టెన్



**న్యూఢిల్లీ:** ఆంధ్ర క్రికెటర్, టీమిండియా వికెట్ కీపర్ కెఎస్ భరత్‌కు భారత మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా అండగా నిలిచారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ 2023లో టీమిండియా ఓటమికి అతడిని కారణంగా చూపడం సరికాదంటూ మద్దతు ప్రకటించారు. దయచేసి అతడిని బలిపశువును చేయవద్దంటూ మేనేజ్‌మెంట్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు కెఎస్ భరత్. స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్ స్థానంలో వికెట్ కీపర్‌గా అవకా శం దక్కించుకున్న అతడు తన విధులను చక్కగా నిర్వర్తించాడు. కానీ కొంతమంది మాత్రం అతడు బ్యాటర్‌గా పంత్ స్థానాన్ని భర్తీ చేయలేకపోయాడంటూ విషం చిమ్మారు. ఈ క్రమంలో ఇంగ్లండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ 2023లో భరత్ బ్యాటింగ్ తీరుపై కూడా పెదవి విరిచారు. కాగా డబ్ల్యుటిసి ఫైనల్లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన భరత్ తొలి ఇన్నింగ్స్‌లో 5 పరుగులకే అవుట్ కాగా రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం 23 పరుగులు చేయగలిగాడు. ఇక ఈ ప్రతిష్టాత్మక ఫైనల్లో టీమిండియా 209 పరుగుల తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కెఎస్ భరత్ బ్యాటింగ్ ప్రదర్శనపై అనవసరపు విమర్శల నేపథ్యంలో అంజుమ్ చోప్రా అతడికి మద్దతు ప్రకటించారు. జులై 12న మొదలుకానున్న వెస్టిండీస్ పర్యటనకు భరత్ స్థానంలో ఇషాన్ కిషన్‌కు చోటు ఇవ్వనున్నారన్న వార్తల నేపథ్యంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రిషబ్‌పంత్ అందుబాటులో లేకపోవడం టీమిండియాకు తీరని లోటే. కానీ అతడిని దృష్టిలో పెట్టుకుని కెఎస్ భరత్ పట్ల అనుచితంగా ప్రవర్తించడం సరికాదు. నిజానికి వికెట్ కీపర్‌గా అతడు తన బాధ్యతలను చక్కగా నెరవేరుస్తున్నాడు. తన ప్రైమరి జాబ్ కూడా వికెట్ కీపింగే కదా! రిషబ్ పంత్ మాదిరే అతడు కూడా బ్యాటింగ్ అదరగొట్టాలని భావించడం పొరపాటే అవుతుంది. భరత్ లోయర్ ఆర్డర్‌లో ఆడుతున్నాడు. వాస్తవానికి టాపార్డర్ బ్యాటింగ్ బాధ్యతను నెత్తినవేసుకోవాలి. మిడిలార్డర్ వాళ్లకు సపోర్టుగా ఉంటుంది. ఇక లోయర్ ఆర్డర్ వీరందరికీ తమ వంతు సహకారం అందిస్తుందంతే! ఈ విషయాలను మనం ఖచ్చితంగా దృష్టిలో పెట్టుకోవాలని. అంతేగానీ బ్యాటింగ్ సరిగా లేదంటూ అతడిని విమర్శించడం సరికాదు అని అంజుమ్ చోప్రా చెప్పుకొచ్చారు. వికెట్ కీపర్‌గా కెఎస్ భరత్ రాణిస్తున్నాడని అతడిని అదే కోణంలో చూడాలని విజ్ఞప్తి చేశారు. కాగా జులై 12, ఆగస్టు 13 వరకు టీమిండియా వెస్టిండీస్‌లో పర్యటించనుంది.



# ఆటపై ఉన్న అవగాహనతోనే యువరాజ్‌ను కాదని ధోనీని కెప్టెన్ చేశాం

### -మాజీ సెలెక్టర్

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి ఉన్న నాయకత్వ లక్షణాలతో పాటు ఆటపై ఉన్న అవగాహనతోనే అతన్ని సారధిగా ఎంపిక చేశామని అప్పటి భారత సెలెక్టర్ భూపిందర్ సింగ్ తెలిపారు. జట్టులో గౌతమ్ గంభీర్, యువరాజ్‌సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి సీనియర్లను కాదనిధోనిని ఎంపిక చేయడానికి గల కారణాలు ఇవేనని ఆయన తాజాగా వెల్లడించారు. డబ్ల్యుటిసి ఫైనల్ ఓటమి నేపథ్యంలో మరోసారి టీమిండియా ఆటతీరుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భూపిందర్‌సింగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. జట్టులో ఉన్న ఆటగాళ్లలో ఒకరిని సారథిని చేయాలని మేం అనుకోలేదు. మేం కెప్టెన్‌గా నియమించానుకునే ఆటగాడికి క్రికెట్‌పై అవగాహన ఉండటంతో పాటు సరైన బాడీ లాంగ్వేజ్, జట్టును ముందుండి నడిపించే నాయకత్వ సామర్థ్యం, టీమ్ వనరులను ఉపయోగించుకునే నైపుణ్యాలు ఉండాలనుకున్నాం. ఇవన్నీ మాకు ధోనీలో కనిపించాయి. సారథిగా ప్రకటించే ముందు ధోనీ ఆటతీరు, బాడీ లాంగ్వేజ్, ఇతరులతో ఎలా మాట్లాడుతున్నాడనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాం. దాంతో మాకు అతనిపై సానుకూల అభిప్రాయం ఏర్పడింది. అప్పుడే ధోనీని సారథిగా ఎంపిక చేశాం అని భూపిందర్‌సింగ్ చెప్పుకొచ్చాడు. ధోనీ సారథ్యంలో టీమిండియా మూడు ఐసిసి టైటిళ్లు గెలిచింది. 2007 టీ 20 వరల్డ్‌కప్, 2011 వన్డే ప్రపంచకప్‌తో పాటు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. అప్పటినుంచి 10ఏళ్లు అయినా టీమిండియా ఐసిసి టైటిల్‌గెలవలేకపోయింది. ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచినా ఐసిసి టోర్నీల్లో నాకౌట్ చేరినా టైటిల్ మాత్రం అందుకోలేకపోతోంది. ఈ క్రమంలోనే ఐసిసి టోర్నీల్లో భారత్ విఫలమైనప్పుడల్లా ధోనీ అభిమానులు రచ్చ చేస్తున్నారు.

# ప్రేమపై కింగ్ కోహ్లీ క్రిప్టిక్ పోస్ట్

### అర్థంకోసం డిక్షనరీ కనిపెట్టమంటున్న నెటిజన్లు



**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ నుంచి ఏ చిన్న పోస్ట్ వచ్చినా అది సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తుంది. అదే క్రిప్టిక్ పోస్ట్. అయితే దాని అర్థం ఏమిటో తెలియక నెటిజన్ల తలతిరిగిపోతోంది. అలాంటి పోస్ట్‌నే కోహ్లీ మళ్లీ పెట్టాడు. చివరిసారిగా ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన కింగ్ కోహ్లీ మంగళవారం ప్రేమ గురించి ఇన్‌స్టా స్టోరీ పెట్టాడు. అందులో ప్రేమ అనేది మనల్ని పంచుకున్న వారికి గుర్తింపు. మీఆనందాన్ని కోరుకునేది మీరే అనిఅర్థం వచ్చేలా ఓ కొటేషన్ షేర్ చేశాడు. అయితే ఆ పోస్ట్‌ని కోహ్లీ ఎందుకు పెట్టాడు? ఎవరి కోసం పెట్టాడనే వివరాలు తెలియరాక అటు విరాట్ అభిమానులు, ఇటు నెటిజన్లు పిచ్చెక్కిపోతున్నారు. దానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తున్నారు. ఇంకా దానిపై పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ పోస్ట్‌కి ఎవరైనా అర్థం చెప్పండయ్యా కోహ్లీ పోస్ట్‌లకు అర్థం చెప్పే డిక్షనరీ ఎవరైనా కనిపెడితే బాగుంటుంది అంటూ రాసుకొచ్చారు.

# అలీబాబాకు కొత్త చైర్మన్, సిఇఒ

**బీజింగ్, జూన్ 20:** చైనాకు చెందిన దిగ్గజ వ్యాపార సంస్థ అలీబాబాలో నాయకత్వ మార్పు చోటు చేసుకుంది. ఎనిమిదేళ్లుగా చైర్మన్‌గా వ్యవహారిస్తున్న డేనియల్ ఝాంగ్‌ను పదవి నుంచి తప్పించారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జోసెఫ్ సాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అలీబాబాలో కీలకంగా ఉన్న టావోబావో, మాల్ ఆన్‌లైన్ వాణిజ్య విభాగాలకు చైర్మన్‌గా ఉన్న ఎడ్డీ వూ, అలీబాబా గ్రూప్‌నకు సిఇఒగా వ్యవహరించనున్నారు. కంపెనీ షేర్ల పతనం, కొవిడ్ తర్వాత పుంజుకోవడంలో సంస్థ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న తరుణంలో నాయకత్వ మార్పు జరగడం విశేషం. కొత్త బాధ్యతలు స్వీకరించనున్న జోసెఫ్ సాయ్, ఎడ్డీ వూ ఇరువురూ అలీబాబా సహ-వ్యవస్థాపకుడు జాక్ మాకు నమ్మకస్తులు కావడం విశేషం. పైగా వీరివురూ కంపెనీ సహ-వ్యవస్థాపకులు కూడా. క్లౌడ్ కంప్యూటింగ్ నుంచి లాజిస్టిక్స్, అంతర్జాతీయ వాణిజ్యంలో కంపెనీని పటిష్టపరుస్తామని ఇటీవలే అలీబాబా ప్రకటించింది. ఇందుకోసం ఆరు మార్గాల పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపింది. ఈ తరుణంలో ఝాంగ్ కీలక పదవి నుంచి వైదొలగనుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. క్లౌడ్ బిజినెస్‌కు ఝాంగ్ నేతృత్వం కొనసాగుతుందని అలీబాబా గ్రూప్ తెలిపింది. 2015లో ఝాంగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కంపెనీ ఆన్‌లైన్, భౌతిక స్టోర్లను మిళితం చేస్తూ ఆయన తీసుకొచ్చిన కొత్త రిటైల్ వ్యాపార నమూనా మంచి విజయాన్ని అందుకుంది. దీంతో మాల్స్, సూపర్‌మార్కెట్ల విభాగంలో అలీబాబా అగ్రస్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో చైనాలోనే అత్యంత విలువైన కంపెనీగా అలీబాబా అవతరించింది.



# పసిడిపై యేటా 13శాతానికిపైగా రాబడి!




**న్యూఢిల్లీ, జూన్ 20:** సార్వభౌమ బంగారం బాండ్ల పెట్టుబడి దారులకు మంచి రాబడులను అందిస్తున్నాయి. గత ఎనిమిదేళ్ల గణాంకాలను చూస్తే ఇదే విషయం తెలుస్తోంది. 2015లో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. భౌతిక బంగారంలో పెట్టుబడులను తగ్గించేందుకు, ఈ డిజిటల్ బంగారం బాండ్‌ను తీసుకొచ్చింది. భౌతిక బంగారంపై పెట్టుబడులను తగ్గిస్తే అది దిగుమతుల భారాన్ని తగ్గిస్తుంది. తద్వారా కరెంట్ ఖాతా లోటు కూడా తగ్గుతోంది. 2015 నుంచి ఇప్పటివరకు ఆర్‌బిఐ 66 విడతల్లో బంగారం బాండ్లలో పెట్టుబడులను స్వీకరించింది. అప్పటి నుంచి చూసుకుంటే సగటు వార్షిక రాబడి రేటు 13.77 శాతంగా ఉన్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి. నాటి నుంచి ప్రతి విడత సార్వభౌమ బంగారం బాండ్ల పథకంలో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చి ఉంటే, యేడాదికి కనిష్టంగా 4.48 శాతం నుంచి గరిష్టంగా 51.89 శాతం చొప్పున రాబడులు వచ్చాయి. పైగా దీనికి యేటా ఆర్‌బిఐ చెల్లించే 2.5శాతం వడ్డీరేటు అదనం అని చెప్పుకోవాలి. సార్వభౌమ బంగారం బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి, పెట్టుబడి విలువపై యేటా 2.5 శాతం చొప్పున పథకం కాల వ్యవధి ఎనిమిదేళ్ల పాటు వడ్డీ చెల్లిస్తారు. కాల వ్యవధి ముగిసిన తర్వాత అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా బంగారం పరిమాణంపై చెల్లింపులు చేస్తారు. అంతేకాకుండా ఎనిమిదేళ్లపాటు ఇందులో పెట్టుబడి కొనసాగించి వారికి లాభం ఎంత వచ్చినా దానిపై పన్ను ఉండదు.

# ఇండియాలో స్మార్ట్‌ఫోన్ల తయారీ: గూగుల్

**వాషింగ్టన్, జూన్ 20:** అమెరికాకు చెందిన టెక్ దిగ్గజాలు ఒక్కొక్కటిగా భారత దేశానికి తమ ఉత్పత్తిని మారుస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా తన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ల తయారీకి కొంతమేర భారత్‌కు తరలించే పనిలో గూగుల్ ఉంది. భారత్ అందిస్తున్న ప్రోత్సాహకాలతో ఇప్పటికే ఐఫోన్ మేకర్ ఆపిల్ రికార్డుస్థాయిలో ఉత్పత్తిని కొనసాగిస్తోంది. తాజాగా ఇదే అవకాశాన్ని వినియోగించుకోవాలని గూగుల్ యత్నిస్తోంది. ఇందులో భాగంగా లావా ఇంటర్నేషనల్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్, ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ సంస్థలతో ముందస్తు చర్చలు ప్రారంభించింది. వీటి ద్వారా తయారీని ఇండియాకు మార్చే టెక్ దిగ్గజం ఉంది. చైనాలో కఠినమైన కొవిడ్ లాక్‌డౌన్ నిబంధనలు, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం వంటి కారణాలతో అప్రమత్తమవుతున్న అనేక కంపెనీలు, మోడీ ప్రభుత్వం అందిస్తున్న అందిపుచ్చుకునేందుకు తమ తయారీని ఇండియాకు షిఫ్ట్ చేస్తున్నాయి. గత నెలలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కాలిఫోర్నియాలో గూగుల్ ప్రధాన కార్యాలయంలో సిఇఒ సుందర్ పిచాయ్‌ని కలిసిన తర్వాత తాజా అభివృద్ధి వెలుగులోకి వచ్చిం ది. ఈ క్రమంలో భాగస్వామ్య చర్చల కోసం గూగుల్ ఎగ్జిక్యూటివ్‌లలో దాని వినియోగదారు హార్డ్‌వేర్ విభాగం ఆపరేటింగ్ చీఫ్ అనా కొరల్స్, గ్లోబల్ సస్టైనింగ్ ప్రొడక్ట్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ మ్యాగీ వీ ఈనెలలో ఇండియాను సందర్శించారు. గత యేడాది 9 మిలియన్ల పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌లను తయారు చేసిన గూగుల్ తన ఉత్పత్తిని చైనా, వియత్నాం నుంచి తరలించే ప్రణాళికతో ఉందని తెలుస్తోంది.



## వాణిజ్యం

# టాటాలకు గట్టి పోటీ ఇస్తున్న ఇండిగో..

**ముంబై, జూన్ 20:** దేశీయ విమానయాన రంగంలో మెజారిటీ వాటాను కలిగి ఉన్న ఇండిగో టాటాల ఎయిర్ ఇండియాకు పోటీ ఇవ్వడంలో తగ్గేదే లేదంటోంది. ఇందుకోసం ప్యారిస్ ఎయిర్ షో వేదికగా చారిత్రాత్మక డీల్ ప్రకటించింది. యూరోపియన్ ఏవియేషన్ కంపెనీ ఎయిర్‌బస్‌లోని ఎ320 కుటుంబానికి చెందిన 500 విమానాలకు ఆర్డర్ పెట్టింది. చరిత్రలో ఎయిర్‌బస్ కంపెనీకి ఇంత పెద్ద సంఖ్యలో విమానాల ఆర్డర్ చేయలేదని ఇండిగో ప్రకటించింది. ఈ మెగా కొనుగోలు డీల్ విలువ 55 బిలియన్ డాలర్లని తెలుస్తోంది. పెద్ద ఆర్డర్ కారణంగా కంపెనీకి తక్కువ ధర ప్రయోజనం లభించనుంది. దీనికి ముందు టాటాల యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా 2022 ఫిబ్రవరిలో 470 విమానాల కోసం మెగా ఆర్డర్ పెట్టింది. బోయింగ్ సంస్థతో చేసుకున్న ఈ డీల్ విలువ దాదాపు 70 బిలియన్ డాలర్ల విలువైనదిగా వెల్లడైంది. ప్రస్తుతం ఏవియేషన్ రంగంలో మెజారిటీ కస్టమర్లకు కలిగి ఉన్న ఇండిగో రెండు దశాబ్దాల్లోనే స్టార్టప్ కంపెనీ స్థాయి నుంచి 60శాతం మార్కెట్ వాటా పొందింది. ఇదే క్రమంలో గత యేడాది మార్కెట్లోకి వచ్చిన ఆకాశ కూడా తన సేవలను విస్తరించేందుకు నిధులను సమీకరిస్తోంది. ప్రస్తుతం ఇండిగో 300లకుపైగా విమానాలతో సేవలను కొనసాగిస్తోంది. ఈ కంపెనీకి ఇప్పటికే ఆర్డర్ పెట్టిన 480 విమానాల డెలివరీ పూర్తికావాల్సి ఉంది. అయితే తాజాగా కొత్త విమానాల కోసం ఆర్డర్ చేయడం ద్వారా 2030-35 నాటికి స్థిరమైన డెలివరీలను పొందుతుందని తెలుస్తోంది. 2006లో గురుగావ్ కేంద్రంగా సేవలను ప్రారంభించిన కంపెనీ ఇప్పటి వరకు మొత్తంగా 1,330 విమానాలకు ఎయిర్‌బస్ వద్ద ఆర్డర్ పెట్టింది.



# ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్‌పై సెబి కొరడా..

**ముంబై, జూన్ 20:** పెట్టుబడి దారుల ప్రయోజనాలను కాపాడేందుకు సెబి మరోసారి రంగంలోకి దిగింది. క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు కార్వీ సంస్థపై ఇటీవల చర్యలు చేపట్టింది. తాజాగా ఇదే ఆరోపణల నేపథ్యంలో బ్రోకరేజ్ సంస్థ ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్‌పై కొరడా ఝుళిపించింది. కొత్త ఖాతాదారులను ఆన్‌బోర్డ్ చేయకుండా రెండేళ్లపాటు నిషేధించింది. ఏప్రిల్ 2011 నుంచి జనవరి 2017 మధ్య ఐఐఎఫ్ఎల్ ఖాతా పుస్తకాలను కేపిటల్ మార్కెట్స్ రెగ్యులేటరీ అనేకసార్లు తనిఖీ చేసిన తర్వాత ఆ ఆదేశాలు జారీచేసింది. తన యాజమాన్య ట్రేడ్‌ల సెటిల్‌మెంట్ కోసం క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసిందని సెబి తన విచారణలో తేలింది. అలాగే డెబిట్ బ్యాలెన్స్, క్లయింట్ల ట్రేడ్‌ల విషయంలోనూ ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించింది. ఐఐఎఫ్ఎల్‌కు సంబంధించిన పూర్తి డేటాను పరిగణనలోకి తీసుకుంటే, క్రెడిట్ క్లయింట్ల సొమ్మును దుర్వినియోగం చేసింది. తన స్వంత యాజమాన్య ట్రేడ్‌లకు నిధులు సమకూర్చింది. తద్వారా సెబి 1993 సర్క్యులర్‌లోని నిబంధ నలను ఉల్లంఘించింది అని సెబి సభ్యులు ఎస్‌కె మొహంతి తన 64 పేజీల తుది ఉత్తర్వులో పేర్కొన్నారు. ఏప్రిల్ 2011 నుంచి జూన్ 2014 మధ్య 42 ట్రేడింగ్ రోజులలో తన స్వంత లావాదేవీలకు నిధుల కోసం క్రెడిట్ బ్యాలెన్స్‌లను కలిగిన ఖాతాదారుల నిధులను కంపెనీ ఉయోగించింది. సెబి ప్రవర్తనా నియమావళికి నమోదిత బ్రోకర్‌లు అందరూ కట్టుబడి ఉండాలి. అయితే ఈ నిబంధనలను కూడా బ్రోకింగ్ సంస్థ ఉల్లంఘించినట్లు తేలింది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 20:** దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిసాయి. ఉదయం నష్టాలతో ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు దాదాపు చివరి గంటన్నర వరకు అదే బాటలో కొనసాగాయి. కనిష్టాలవద్ద కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్న మార్కెట్లు చివరి అరగంటలో స్పష్టమైన లాభాల్లోకి మళ్లాయి. చివరికిసెన్సెక్స్ 159.40 పాయింట్లు లాభపడి 63,327.70 పాయింట్లు వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 61.25పాయింట్లు పెరిగి 18,816.70 పాయింట్ల వద్ద నిలిచింది. టాటా మోటార్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంకు, కోటాక్‌మహీంద్రాబ్యాంకు, ఎల్అండ్‌టి, విప్రో, నెస్లే ఇండియా, టిసిఎస్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్,సన్‌ఫార్మా, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, రిలయన్స్, ఎస్‌బిఐ, ఐటిసి వంటి షేర్లు క్షీణించాయి. ఇన్నోవేటర్స్ ఫకేడ్ సిస్టమ్స్‌కు రెండు భారీ ఆర్డర్లు లభించాయి. కంపెనీ షేరు 10శాతం పెరిగి రూ.145.20 వద్ద నిలిచింది. 500 నేరో బాడీ విమానాల ఆర్డరును ఎయిర్‌బస్‌కు ఇచ్చినట్లు ఇండిగో ప్రకటించిన నేపథ్యంలో కంపెనీ షేరు రూ.2,490 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరింది. చివరికి 0.28 శాతం పెరిగి రూ.2,439 వద్ద నిలిచింది.

# ఎలక్ట్రిక్ కార్లపై మహిళల ఆసక్తి

**ముంబై, జూన్ 20:** మహిళలు ఎలక్ట్రిక్ కార్ల పట్ల మక్కువ చూపిస్తున్నారు. టాటా మోటార్స్ సంస్థ టియాగో ఎలక్ట్రిక్ కార్ల విక్రయ గణాంకాలు ఇదే విషయాన్ని తెలియచేస్తున్నాయి. చిన్న పట్టణాల్లో టియాగో ఈవీ అమ్మకాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో విడుదలైన టియాగో ఈవీ కారు ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్ రికార్డులు సృష్టిస్తోంది. తక్కువ ధరకు మెరుగైన ఫీచర్లతో ఈ కారు వస్తుండడం పట్ల కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. ఇప్పటికే 15వేల యూనిట్లను ఈ సంస్థ విక్రయించింది. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇప్పటి వరకు విక్రయించిన యూనిట్లలో మహిళలు సొంతం చేసుకున్నవి అధిక సంఖ్యలోనే ఉన్నాయి. సుమారు 24 శాతం కొనుగోలుదారులు మహిళలుగా ఉన్నారు. కానీ కార్ల పరిశ్రమలో సగటు మహిళా కస్టమర్లు 12శాతంగానే ఉండడం విశేషం. అంటే సంప్రదాయ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల వైపు మొగ్గు చూపించే మహిళలు రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా టియాగో ఈవీ కస్టమర్లలో 56శాతం మంది వయసు 49యేళ్లలోపు ఉండడం గమనించొచ్చు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 Air Surcharge: Delhi : 40 Ps.